Pubilshed from Ananthapuramu

PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 Vol.No : 04 | సంచిక : 27 Issue No : 27 | శనివారం Saturday | ఆగస్టు 1, 2026 1 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



బొగ్గు గనిలో భారీ

## పేలుడు

- 32 మంది మృతి..
- చిక్కుకుపోయిన కార్మికులు


పాకిస్తాన్ : బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించి 32 మంది కార్మికులు మరణించగా, పలువురు భూగర్భంలో చిక్కుకుపోయిన ఘటన పాకిస్తాన్ లోని క్వెట్టా సమీపంలో ఉన్న సోరేంజ్‌లో జరిగింది. భూగర్భంలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బలూచిస్తాన్ ప్రావిన్షియల్ రాజధాని క్వెట్టా శివార్లలోని బొగ్గు గనిలో గురువారం పేలుడు చోటుచేసుకుంది. మీథేన్ గ్యాస్ పేరుకుపోవడం వల్ల ఈ పేలుడు సంభవించిందని గవర్నమెంట్ మైన్ ఇన్‌స్పెక్టర్ ఘనీ బలోచ్ తెలిపారు. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

- మిగతా 2లో..

ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు

# సిద్ధం





## మోదీ జీ మీ కోసం ఎదురుచూస్తున్నాం: సీఎం చంద్రబాబు

- రేపు భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- భారీ భద్రత.. 7,000 మంది పోలీసుల మోహరింపు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖద్వారంగా ఈ విమానాశ్రయం
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


2 లో

### ప్రధాని బందోబస్తు, భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణ

ప్రజాభూమి ప్రతినిధి, విజయనగరం : ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును జాతికి అంకితం చేసేందుకు వస్తున్న నేపథ్యంలో బందోబస్తు, భద్రత ఏర్పాట్లను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పర్యవేక్షించారు.

- మిగతా 2లో..





మూడోరోజూ

## కొనసాగిన లాభాలు..

- 166 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్
- 78,094.64 వద్ద స్థిరపడ్డ సెన్సెక్స్
- 66.45 పాయింట్లు పెరిగి 24,383.60 వద్ద ముగిసిన నిఫ్టీ
- రాణించిన ఆటో, ఎఫ్ఎంసీజీ షేర్లు
- త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడంతో మార్కెట్లకు ఊతం
- ఆర్థిక అనిశ్చితులు తగ్గితే ఈ ర్యాలీ కొనసాగొచ్చన్న నిపుణులు

వివరాలు 2లో..



ఉత్తరాంధ్ర గడ్డపై

## మోదీ సందడి

- ప్రధాని పర్యటనపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిరంతర పర్యవేక్షణ
- మంత్రుల బృందం, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు
- చారిత్రాత్మక ఘట్టానికి సర్వం సిద్ధం మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,భోగాపురం/విజయనగరం : ఉత్తరాంధ్ర చరిత్రను మార్చే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను ఎలాంటి చిన్నపాటి లోటుపాట్లు లేకుండా చారిత్రాత్మకంగా విజయవంతం చేయడమే లక్ష్యంగా అన్ని శాఖల

- మిగతా 2లో..

ప్రతి కార్యకర్తా

## వన్ మ్యాన్ ఆర్మీలా

# పని చేయాలి



### అసభ్య పదజాలం, మార్ఫింగ్ కంటెంట్‌కు తావివ్వకూడదు

- ప్రభుత్వ వైఫల్యాలను, తప్పులను ఆధారాలతో తిప్పికొట్టండి
- గ్రామస్థాయి నుంచి సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలి
- అక్రమ కేసులు, వేధింపులన్నీ 'డిజిటల్ డైరీ' లో నమోదు
- ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- వివరణలు ఇచ్చే పరిస్థితి నుంచి అటాకింగ్ మోడ్‌లోకి రావాలి
- మెగా డీఎస్సీ నిర్వహణలోని అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి
- అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి
- రూ.9,500 కోట్లకు పైగా ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలి
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్

“ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : సోషల్ మీడియాలో చేసే ప్రతి కార్యకర్తా ఒక వన్ మ్యాన్ ఆర్మీలా పదునైన కంటెంట్‌తో నిజాన్ని పదిమందికి చేరవేస్తూ ప్రజల్ని చైతన్యం చేయాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్‌సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కేవలం ప్రచారకర్తలుగా కాకుండా ప్రజల గొంతుకగా, క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రతినిధులుగా పని చేయాలని ఆయన సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోషల్ మీడియా విభాగ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ, నగర అధ్యక్షులతో ముఖ్య సమావేశం నిర్వహించారు.”

2 పేజీలో..

ఈ సమావేశంలో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి, సోషల్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దొడ్డా అంజిరెడ్డి తదితరులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోస్టు రాజ్యాంగబద్ధంగా, వాస్తవ ఆధారాలతో,



పోటెత్తుతున్న

# గోదావరి..

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు

2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో

## ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి

- ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.

ప్రజాభూమి ప్రతినిధి,భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు, ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అల్లూరి సీతారామరాజు భోగాపురం విమానాశ్రయం వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

2 పేజీలో..





నాలుగంతస్తుల భవనం కూలి

## ఆరుగురు మృతి

భివండీ (మహారాష్ట్ర) : మహారాష్ట్రలోని భివండీలో నాలుగంతస్తుల భవనం కూలి ఆరుగురు మృతి చెందగా, శిథిలాల కింద పలువురు చిక్కుకున్న ఘటన గురువారం జరిగింది. ప్రమాదం జరిగిన భవనంలో ఒక్కో అంతస్తులో 12 చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. నిన్న రాత్రి 11:30 గంటల సమయంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో, అందులోని వారంతా శిథిలాల కింద చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 2లో..

# “క్రిమినల్ వేస్ట్”..

### ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

- ఇంజనీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి “క్రిమినల్ వేస్ట్” వ్యాఖ్యలు
- ఈ వ్యాఖ్యలతో తెలంగాణలో చెలరేగిన రాజకీయ దుమారం
- సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్, బీజేపీ
- రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్

2 పేజీలో..



ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ : తెలంగాణలోని ఇంజనీరింగ్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి.

ప్రజాభూమి

శనివారం, ఆగస్టు 1, 2026


# ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధం..

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** “ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధమైంది... మోదీ జీ, మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం” అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నానికి ఇప్పుడు రెక్కలొచ్చాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై ఫేస్ బుక్ వేదికగా చంద్రబాబు ఈ విధంగా స్పందించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు (ఆగస్టు 1) లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉత్తరాంధ్రకు మౌలిక వసతుల కల్పనలో ఇదొక కీలక ముందడుగు అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 7,000 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో మోహరించారు. ప్రారంభోత్సవానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, ఇతర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్రకు పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షితమవుతాయని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ప్రధాని బందోబస్తు, భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణ

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎయిర్ పోర్ట్ ఆవరణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, టెర్మినల్ బిల్డింగ్, ప్రధాని సభ నిర్వహించే ప్రాంతం, థింసా నృత్యం నిర్వహించే ప్రాంతాలను సందర్శించి, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాని పర్యటనకు దాదాపు 3 వేల సీసీ కెమెరాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, వాటిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ లోని ఎల్.ఈ.డి.స్క్రీన్స్ కు అనుసంధానం చేసినట్లుగా ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ డీజీపీకి తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా క్రౌడ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, పార్కింగ్ ప్రాంతాలను, ప్రధాని సభ జరిగే ప్రాంతాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించనున్నట్లుగా అధికారులు డీజీపీకి వివరించారు.అనంతరం, టెర్మినల్ బిల్డింగ్, లోపలి ప్రాంతాలను సందర్శించి, ప్రధాని సభ జరిగే ప్రాంతాలు, థింసా నృత్యం జరిగే ప్రాంతాలకు వెళ్ళే మార్గాలను పరిశీలించారు. జిల్లా పోలీసుశాఖ చేపట్టిన భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కి వివరించారు.

బందోబస్తు, భద్రత, ట్రాఫిక్ విధులను పర్యవేక్షించే సీనియర్ పోలీసు అధికారులు తమ క్రింద పని చేసే అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. ప్రజలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే మీటింగ్ స్థలంలోనికి అనుమతించాలన్నారు. సభ ముగిసిన తరువాత ప్రజలు సురక్షితంగా తిరిగి తమ ఇండ్లకు చేరుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టాలన్నారు. జాతీయ రహదారి మీదుగా ఎయిర్పోర్ట్ వైపు వాహనాలు వెళ్ళే మార్గంలో వాహనదారులకు సులువుగా అర్థమయ్యే విధంగా పెద్ద సైజులో సైనేజ్లను ఏర్పాటు చేసి, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలాలకు చేర్చాలని అధికారులకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ సూచించారు.డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెంట శాంతిభద్రతల అదనపు డీజీ ఎన్.మధుసూదన రెడ్డి, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ ఐజి శ్రీకాంత్, ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, విశాఖపట్నం రేంజ్ ఐజి గోపినాథ్ జెట్టి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మరియు ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఉన్నారు.

# ఉత్తరాంధ్ర గడ్డపై మోదీ సందడి

యంత్రాంగం సమన్వయంతో శ్రమించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం తెలిపారు.

ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లపై గత వారం రోజులుగా మంత్రుల బృందం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం సాధిస్తున్న ఆయన, వివిఐపిల రాక సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపడుతున్న పురోగతిని సమీక్షించారు. హెలికాప్టర్ ల్యాండింగ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ప్రధాని పర్యటన సుగమంగా సాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది మంది సాధారణ ప్రజలకు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.విమానాశ్రయ ప్రారంభోత్సవ ప్రాంగణంలో అతివిశిష్ట వ్యక్తుల భద్రత, ప్రధాని ప్రయాణించే రోడ్డు మార్గం, భద్రతా నిఘా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, సభా ప్రాంగణం సమీపంలో విస్తృత వాహనాల పార్కింగ్ స్థలాల కేటాయింపు వంటి కీలక అంశాలపై ఆయన అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వేసవి, ఉక్కపోత దృష్ట్యా ప్రాంగణంలో అడుగడుగునా ఉచిత తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్, తగినన్ని పారిశుద్ధ్య కేంద్రాలు, అత్యవసర వైద్య శిబిరాలు, ఫుడ్ పాయింట్ల ఏర్పాటుపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులు, ప్రత్యేక హెల్ప్‌లైన్ వ్యవస్థలు, క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా ప్రతి శాఖ చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. భద్రతా పరమైన అంశాల్లో పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో వేడుక జరిగేలా చూడాలని సూచించారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం సంపూర్ణంగా ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా, నిరంతర పర్యవేక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మంత్రుల బృంద కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, అనిగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, వాసంశెట్టి సుభాష్, తదితరులు ఉన్నారు

# మూడోరోజూ

## కొనసాగిన లాభాలు..

**న్యూఢిల్లీ :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. ఆటో, ఫైనాన్షియల్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్లకు ఊతం లభించింది. మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన ఐటీ షేర్లలో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆ రంగంపై ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 166.49 పాయింట్లు పెరిగి 78,094.64 వద్ద, నిఫ్టీ 66.45 పాయింట్లు ఎగిసి 24,383.60 వద్ద ముగిశాయి.బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు నిఫ్టీలో అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 0.44 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగంతో పాటు ఎఫ్‌ఎంసీజీ షేర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచాయి. అయితే ఐటీ సూచీ ఐదు రోజుల లాభాల పరంపరకు బ్రేక్ పడింది. ప్రస్తుతం నిఫ్టీకి 24,300 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఆ స్థాయి కంటే దిగువకు వెళితే 24,200 వద్ద మరో కీలక మద్దతు ఉందన్నారు. త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా వస్తుండటం మార్కెట్లకు బలాన్నిస్తోందన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు తగ్గితే ఈ ర్యాలీ కొనసాగొచ్చని అభిప్రాయపడ్డారు.

# ప్రతి కార్యకర్తా వన్ మ్యాన్ ఆర్మీలా పని చేయాలి

మర్యాదపూర్వక భాషలోనే ఉండాలని, అసభ్య పదజాలం, మార్ఫింగ్ కంటెంట్‌కు తావివ్వకూడదని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ--2025లో అక్రమాలపై నిష్పాక్షిక సీబీఐ విచారణ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా డిమాండ్‌తో పాటు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి హామీ అమలు, రూ.9,500 కోట్లకు పైగా ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిల విడుదలపై తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని నేతలు పిలుపునిచ్చారు. దీనికోసం గ్రామ స్థాయి నుండి ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో అధికారిక ఖాతాలను నిర్వహిస్తూ జన్ జెడ్, జన్ ఆల్ఫా యువత భాగస్వామ్యంతో డిజిటల్ వాలంటీర్ నెట్‌వర్క్‌ను నిర్మించాలని సూచించారు.

ప్రజాబలం లేక కేవలం భ్రమలు కల్పించే మీడియా వ్యవస్థలు, రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగంతో అధికారాన్ని చెలాయిస్తున్న కూటమి ప్రభుత్వంపై పొలిటికల్ అజెండాతో తీవ్రస్థాయిలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోలీసు వ్యవస్థను వాడుకొని పెడుతున్న అక్రమ కేసులు, వేధింపులను నమోదు చేయడానికి 'డిజిటల్ డైరీ'ని నిర్వహిస్తున్నామని, తప్పుడు ఫిర్యాదులు చేసే వారి వివరాలను కూడా రికార్డు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి నియోజకవర్గంలోనూ 'వైఎస్సార్సీపీ టాక్స్' వంటి డిజిటల్ వేదికలను ఏర్పాటు చేసి, స్థానిక కంటెంట్ క్రియేటర్లను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల ఆకాంక్షలే శ్రీరామరక్షగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో పోటీ చేసి విజయం సాధించడానికి వైఎస్సార్సీపీ సిద్ధంగా ఉందన్నారు. కాగా, నిరంతరం శ్రమిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచే కార్యకర్తల వివరాలను నేరుగా జగన్‌గారి దృష్టికి తీసుకెళ్తామని, భవిష్యత్తులో వారికి కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీల వంటి గొప్ప రాజకీయ అవకాశాలు దక్కుతాయని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హామీ ఇచ్చారు. కూటమి వ్యాప్తి చేసే అబద్ధాలను మొదటి రెండు గంటల్లోనే వాస్తవ ఆధారాలతో తిప్పికొడుతూ 'అటాకింగ్ మోడ్'లోకి మారాలని, ప్రభుత్వంపై చేసే ప్రతి విమర్శకు పాత జీవోలు, ఎఫ్ఐఆర్ కాపీల వంటి పక్కా ఆధారాలను జత చేయాలని పార్టీ నాయకులు పూడి శ్రీహరి సూచించారు. అక్రమ కేసులు, వేధింపులకు భయపడకుండా దృఢ సంకల్పంతో పని చేయాలని, కష్టకాలంలో ఉన్న కార్యకర్తలకు, వారి కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుందని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

-- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్ నాయకత్వంలో అధికారం పరమావధిగా కాకుండా ప్రజల శ్రేయస్సు, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థిరమైన రాజకీయ విధానంతో ముందుకు సాగుతోంది. ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చినా, సిద్ధాంతాలను, లైన్ ఆఫ్ థింకింగ్‌ను వదులుకోకుండా నిలబడడమే మన నాయకుడి నైజం. వైఎస్సార్సీపీ సోషల్ మీడియా విభాగాన్ని తొలిసారిగా ఒక ఆర్గనైజ్డ్ వ్యవస్థగా గ్రామ స్థాయి వరకు బలోపేతం చేశాం. చంద్రబాబు నాయుడు ప్రజాబలం లేకుండా కేవలం భ్రమలు కల్పించే మీడియా వ్యవస్థలు, రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం, కుట్రలతో అధికారం చలాయిస్తున్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న మనపై, సాధారణ ప్రజలపై పోలీసులను వాడుకుని అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతుండడం వారి నైరాశ్యానికి నిదర్శనం. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను తీవ్ర అప్పుల ఊబిలోకి నెట్టి, అబద్ధాలతో స్వర్గం చూపిస్తున్నది. పాలనలో విఫలమై, ప్రశ్నించే వారిపై వ్యక్తిత్వ హననానికి దిగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల ఆకాంక్షలే శ్రీరామరక్షగా మన పార్టీ దృఢంగా నిలబడింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో పోటీ చేసి స్వీప్ చేయడానికి వైఎస్సార్సీపీ సిద్ధంగా ఉంది. నాయకత్వ నిబద్ధత, కార్యకర్తల కృషితో 2029లో గతంలో కంటే భారీ మెజారిటీతో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. పేదరికాన్ని నిర్మూలించేలా విద్యారంగంలో ఐబీ సిలబస్, వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలతో పాటు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు వంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి జగన్ చేసిన కృషిని ఉదాహరణలతో సహా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియాపై ఉంది. ప్రజామోదం పొందే పొలిటికల్ అజెండాతో, ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన దాడి కొనసాగించాలి. ప్రతి సోషల్ మీడియా కార్యకర్త ఒక వన్ మ్యాన్ ఆర్మీలా, పదునైన కంటెంట్‌తో నిజాన్ని పదిమందికి చేరవేసే బాధ్యతాయుతమైన సైనికుడిగా పనిచేయాలి. ప్రతి నియోజకవర్గంలోనూ 'వైఎస్సార్సీపీ టాక్స్ వంటి వేదికలను ఏర్పాటు చేసి, కొత్త కంటెంట్ క్రియేటర్లను, ఆసక్తి ఉన్న యూత్‌ను ప్రోత్సహించి భాగస్వాములను చేయాలి.

**గ్రామ స్థాయి నుండి ప్రజా ఉద్యమంగా మలచాలి : లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ.**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి సోషల్ మీడియా కార్యకర్తపైనా అధ్యక్షులు వైఎస్ జగన్ కి అపారమైన నమ్మకం, అభిమానం ఉన్నాయి. మిగతా పార్టీల్లో లాగా మిమ్మల్ని కేవలం తెరవెనుక మాత్రమే ఉంచకుండా, పార్టీలో తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం. పార్టీ ప్రారంభించిన తొలిరోజుల్లో ఏ మీడియా మద్దతు లేకపోయినా, జగనన్న నడిచిన ప్రతి అడుగును ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత మన సోషల్ మీడియా వారియర్స్‌దే. 2024లో వేధింపులకు గురిచేసి, కేసులు పెట్టి జైళ్లకు పంపినా మన కార్యకర్తలెవరూ భయపడకుండా పార్టీ కోసమే నిలబడ్డారు. మీలో ఉన్న విశ్వాసం, నమ్మకం, నిబద్ధత, ధైర్యం ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీ కార్యకర్తల్లోనూ లేవు. ఇప్పుడు మనమందరం ఒక స్పష్టమైన లైన్ తీసుకొని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. డీఎస్సీ నిర్వహణలోని అక్రమాలు, అవినీతి, విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో పాటు నిరుద్యోగ భృతి, విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలపై మనం గళం విప్పాలి.

రాబోయే రోజుల్లో ప్రతి నెలా మీ సోషల్ మీడియా ఖాతాల పనితీరును పరిశీలించి, బాగా కంటెంట్ పెట్టిన వారిని నేరుగా వైఎస్ జగన్ గారితో కలిపిస్తాము. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపుతో పాటు భవిష్యత్తులో కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీల వంటి గొప్ప రాజకీయ అవకాశాలు దక్కుతాయి. ఈ పోరాటంలో అక్రమ కేసుల్లో ఇరుక్కున్న కార్యకర్తలకు, వారి కుటుంబాలకు వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. రెండు కాళ్లు లేకపోయినా పట్టుదలతో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అరుణిమ సిన్హా లాగా, మనం కూడా దఢమైన సంకల్పంతో పనిచేయాలి. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుండి డిజిటల్ వాలంటీర్ నెట్‌వర్క్‌ను నిర్మించి సోషల్ మీడియాను ఒక ప్రజా ఉద్యమంగా మలచాలి. ప్రతి మొబైల్ ఫోన్ ప్రజా సమస్యలను నిలదీసే ఆయుధంగా మారి, ప్రతి పోస్ట్ యువత భవిష్యత్తు కోసం వినిపించే స్వరం కావాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చి వైఎస్ జగన్ ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే వరకు మనమందరం సైనికుల్లా శ్రమించాలని సజ్జల పిలుపునిచ్చారు.

### అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో

# ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి.

ప్రజల సంక్షేమం,ఆర్థికాభివృద్ధి, ఉపాధి,రవాణా,పర్యాటకం, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజల రాకపోకలకు ఇప్పటికే సుమారు 5--6 వేల బస్సులను ఏర్పాటు చేశామని, ప్రజా ప్రతినిధులు కూడా తమ సొంత వాహనాలతో పాటు మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేతులమీదుగా రూ. 17,900 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభం కానున్నాయన్నారు.ప్రధాన మంత్రి భోగాపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కార్యక్రమ ఏర్పాట్లపై ప్రతిరోజూ రెండుసార్లు సమీక్షిస్తూ, అధికారులు మరియు ప్రజాప్రతినిధులకు అవసరమైన సూచనలు చేస్తున్నారని చెప్పారు.విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం,ఉత్తరాంధ్ర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సమాచార,పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

శ్రీకాకుళం,విజయనగరం, విశాఖపట్నం నగరాల్లో సుమారు 200 హోర్డింగ్స్,50 ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా డ్రోన్ల ద్వారా కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 5 డ్రోన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా డిజిటల్,సోషల్ మీడియా వేదికల ద్వారా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాధాన్యత,ఉత్తరాంధ్రకు రానున్న అభివృద్ధి అవకాశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు. విమానాశ్రయంతో ఎగుమతులకు కొత్త ఊపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్ పోర్టులో 25,000 మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన టెర్మినల్ అందుబాటు లోకి రావడంతో ఉత్తరాంధ్ర నుంచి దేశ,విదేశాలకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.ఈ విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతంలో



ఆర్థిక,సామాజిక, వాణిజ్య రంగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు.ఇప్పటివరకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు,దేశాలకు వలస వెళ్లే ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర,భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగు తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.విమానాశ్రయం ద్వారా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ ఏర్పడి,యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు.

పోలవరం నీటితో ఉత్తరాంధ్రకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఆగస్టు 14 న పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.సాగు నీరు,తాగు నీరు,పరిశ్రమలు,వ్యవసాయ రంగాలకు ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచేలా ఘనంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈపాత్రికేయుల సమావేశం లో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనిలో భారీ పేలుడు

బొగ్గు గనిలో పేలుడు జరిగిన కొన్ని గంటల తర్వాత ఏడుగురి మృతదేహాలను వెలికితీశారని, ఆ తర్వాత అత్యవసర సహాయక బృందాలు మరో 25 మృతదేహాలను కనుగొన్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఘటన స్థలంలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. భూగర్భంలో చిక్కుకుపోయిన మిగిలిన కార్మికులను గుర్తించి వెలికితీయడానికి సహాయక బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

గనిలో చిక్కుకుపోయిన కార్మికులందరీ జాడను గుర్తించే వరకు సహాయక చర్యలు కొనసాగుతాయని మైన్ ఇన్‌స్పెక్టర్ ఘనీ బలోచ్ తెలిపారు. పలువురు కార్మికులు లోపల చిక్కుపోయినందు వల్ల ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. మీథేన్ గ్యాస్ పేలుళ్ల తర్వాత గనిలో ఆక్సిజన్ స్థాయిలు సున్నాకి పడిపోవడంతో కార్మికులు సజీవంగా బయటపడే అవకాశాలు తగ్గిపోయాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా అక్కడ ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో... సహాయక బృందాలు కూడా గని లోపల చాలా జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ప్రమాద స్థలం నుంచి వెలికితీసిన మృతదేహాలను ఖననం చేయడం కోసం వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని బలోచ్ చెప్పారు. ఇంకా శిథిలాల కింద చిక్కుకున్న వారి బంధువులు సమాచారం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

ఇక, ప్రమాద స్థలంలో రెస్క్యూ బృందాలు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పనిచేస్తున్నాయని బలూచిస్తాన్ గనులు, ఖనిజాల శాఖ మంత్రి షోయబ్ నోషెర్వానీ అన్నారు. ఈ ప్రమాదంలో మరణించినవారి కుటంబాలకు నోషెర్వానీ సంతాపం తెలియజేశారు. ఈ పేలుడులో మరణించిన ప్రతి గని కార్మికుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల పాకిస్తానీ రూపాయల (సుమారు 1,800 డాలర్లు) పరిహారం చెల్లిస్తుందని ఆయన చెప్పారు. పేలుడుకు గల కారణాలపై అధికారులు సమగ్ర దర్యాప్తు జరుపుతామని తెలిపారు. అలాగే, గనుల భద్రతా చర్యలను సమీక్షించనున్నట్టుగా వెల్లడించారు. అయితే గనిలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పేలుడు జరిగిందని భావిస్తున్నట్లు బొగ్గు గని కార్మికుల సంఘం పాకిస్తాన్ సెంట్రల్ మైన్స్ లేబర్ ఫెడరేషన్ ఆరోపించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, గనుల భద్రతా చట్టాలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. పాకిస్తాన్‌లోని బొగ్గు గనుల పరిశ్రమలో ముఖ్యంగా బలూచిస్తాన్‌లో ప్రాణాంతక ప్రమాదాలు సర్వసాధారణంగా మారిపోయాయి. అక్కడి అనేక గనులలో తగినంత వెంటిలేషన్ ఉండదు. అంతేకాకుండా, ఇతర ప్రాథమిక భద్రతా చర్యలు తక్కువగా ఉన్నాయి.

# నాలుగంతస్తుల భవనం కూలి ఆరుగురు మృతి

వెంటనే స్పందించిన స్థానికులు పలువురిని రక్షించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో పగుళ్లు ఏర్పడడంతో.. దానిని ఖాళీ చేయాల్సిందిగా అక్కడి వారికి ఇది వరకే సూచించినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ వారు ఖాళీ చేయకుండా అనధికారికంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులేనని తెలిపారు.


# “క్రిమినల్ వేస్ట్”..

హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో ప్రతిఏటా 1.1 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, వారిలో కొందరు కనీసం ఉద్యోగ దరఖాస్తును కూడా నింపలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.“ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఒక తెల్ల కాగితం ఇచ్చి అప్లికేషన్ రాయమంటే రాయలేని పరిస్థితి నెలకొంది. ఇది ‘క్రిమినల్ వేస్ట్’. ఇంజినీరింగ్ చదివామంటూ చిన్న ఉద్యోగాలకు వెళ్లరు, అదే సమయంలో అవసరమైన నైపుణ్యాలను కూడా అలవర్చుకోరు” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డిని “చీప్ మినిస్టర్” అని సంబోధిస్తూ, ఆయన విద్యార్హతలను ప్రశ్నించారు. “రియల్ ఎస్టేట్ బ్రోకర్ స్థాయి నుంచి బ్లాక్‌మెయిలర్‌గా ఎదిగారు” అంటూ ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి ముఖ్యమంత్రికి ఉన్న అర్హత ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. తన జీవితంలో రేవంత్ రెడ్డి ఎప్పుడైనా పోటీ పరీక్షలు రాశారా? లేదా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారా? ఎక్కడైనా ఉద్యోగం చేశారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. తక్షణమే సీఎం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ నేతలు సైతం ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది యువతను కించపరచడమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగాల కల్పనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను విద్యార్థులను విమర్శించలేదని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంలో విఫలమవుతున్న విద్యా వ్యవస్థను మాత్రమే ఉద్దేశించానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచారు. విద్యార్థుల్లోని నైపుణ్యాల అంతరాన్ని సరిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొంటూ కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టారు.

## పోటెత్తుతున్న గోదావరి..

మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.



ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, ఆగష్టు 01, 2026


# పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

మచిలీపట్నం క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి కృష్ణా జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన సిబ్బందికి గురువారం ఘనంగా సన్మానం చేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.వి. నాయుడు పాల్గొని మాట్లాడారు.

పదవీ విరమణ పొందిన సిబ్బందిని ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన ఘనంగా సత్కరించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.అడిషనల్ ఎస్పీ వి.వి. నాయుడు



కామెంట్స్:"పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికే ముగింపు... సమాజ సేవకు కాదు. దశాబ్దాల పాటు నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించిన సిబ్బంది ప్రతీ ఒక్కరికీ ఆదర్శ ప్రాయులు. పోలీసు శాఖలో వారి సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి."పదవీ విరమణ పొందిన సిబ్బంది:జె. సంపూర్ణమ్మ (WASI-2982): ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్.బి.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు (HC-674): మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ఈ సందర్భంగా తమ ఉద్యోగ ప్రయాణంలో నిరంతరం సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి ఉద్యోగులకు పదవీ విరమణ పొందిన సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# లోక్‌సభలో మత్స్యకారుల సంక్షేమ ముచ్చట..

## ఎరువుల లభ్యతపై కేంద్రం స్పష్టత

**మత్స్యకారుల సహాయక ఆర్థిక పరిమితులను పెంచాలి ఎంపీ వల్లభనేని బాలశౌరి రసాయన ఎరువుల**



**దిగుమతులు, ప్రత్యామ్నాయాలపై కేంద్రం కీలక వివరణ**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో మత్స్యకారుల సంక్షేమం, అలాగే దేశంలో రసాయన ఎరువుల దిగుమతులు-ముడి పదార్థాల సరఫరా అంశాలపై పలు కీలక విషయాలను లేవనెత్తారు.మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి!లోక్‌సభలో రూల్–377 కింద మచిలీపట్నం నియోజకవర్గంలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను బాలశౌరి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.రైతులు, మత్స్యకారులు, పశుపోషకుల సంక్షేమా నికి కేంద్రం అండగా ఉంటుందని ప్రధాని చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ... మచిలీపట్నం ప్రాంతం పడవల నిర్మాణం, మత్స్య పరిశ్రమ, రొయ్యలు మరియు సముద్ర ఆహార ఎగుమతులకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కానీ, ప్రస్తుతం పెరిగిన వ్యయం వల్ల మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఈ సందర్భంగా కేంద్ర మత్స్యశాఖ ముందు ఉంచిన డిమాండ్లు:చిన్న పడవల యూనిట్ వ్యయం: చిన్న చేపల వేట పడవల యూనిట్ వ్యయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచాలి.వలల కొనుగోలు సహాయం: వేట వలల ధరలు పెరిగినందున, ఆర్థిక సాయాన్ని రూ.70 వేల నుంచి రూ.1 లక్షకు పెంచాలి.ఇంజిన్లపై సబ్సిడీ: పడవల ఇంజిన్ల కోసం ఇచ్చే సహాయాన్ని రూ.1.35 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి.రసాయన ఎరువుల సరఫరా - ప్రత్యామ్నాయాలపై కేంద్రం సమాధానంఎరువుల తయారీకి వాడే అమ్మోనియా, సల్ఫర్ దిగుమతులు మరియు వాటి లభ్యతపై బాలశౌరి అడిగిన ప్రశ్నలకు కేంద్ర రసాయనాలు & ఎరువుల శాఖ సమగ్ర సమాధానం ఇచ్చింది.

రష్యా సల్ఫర్ ప్రభావం పరిమితమే: భారత్ దిగుమతి చేసుకున్న 21.4 లక్షల మెట్రిక్ టన్నుల సల్ఫర్‌లో రష్యా నుంచి వచ్చింది కేవలం 6.8 శాతం (1.47 లక్షల మెట్రిక్ టన్నులు) మాత్రమేనని కేంద్రం తెలిపింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధ వాతావరణంలో పైప్‌లైన్ దెబ్బతిన్నా, అది ద్రవ అమ్మోనియా రవాణాకు సంబంధించినది కావడం వల్ల సల్ఫర్ సరఫరాపై ప్రభావం పడలేదని స్పష్టం చేసింది.ధరల పెరుగుదలకు కారణాలు: పశ్చిమ ఆసియా సంక్షోభం, రవాణా వ్యయాలు, బీమా ప్రీమియంలు పెరగడమే అంతర్జాతీయంగా సల్ఫర్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని వెల్లడించింది.

స్వదేశీ రిఫైనరీలకు ప్రాధాన్యం: దేశీయంగా సల్ఫర్ లభ్యతను పెంచేందుకు IOCL, BPCL, HPCL వంటి ప్రభుత్వ రంగ రిఫైనరీల నుంచి ఎరువుల రంగానికి ప్రాధాన్యత ప్రకారం సల్ఫర్ సరఫరా చేయాలని ఆదేశించినట్లు తెలిపింది.గ్రీన్ అమ్మోనియా దిశగా అడుగులుదిగుమతి అమ్మోనియాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ‘జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్’ కింద ఏడాదికి 7 లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను అందించేలా SECI, ఎరువుల సంస్థల మధ్య పదేళ్ల ఒప్పందాలు కుదిరాయి. మూడు సంవత్సరాల తర్వాత ఈ సరఫరా ప్రారంభమవుతుందని, గ్రీన్ అమ్మోనియా సబ్సిడీ వ్యయాన్ని కేంద్ర ఎరువుల శాఖే భరిస్తుందని స్పష్టం చేసింది.మత్స్యకారులకు మద్దతు ఇవ్వడంతో పాటు, రైతులకు ఎరువుల కొరత రాకుండా నిరంతరం సరఫరా చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ఈ చర్చల ద్వారా స్పష్టమైంది.



# మచిలీపట్నం నియోజకవర్గ ‘ముసాయిదా ఓటర్ల జాబితా’ విడుదల

**ముఖ్యమైన మార్పు: గతంలో మచిలీపట్నంలో 205 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం కొత్తగా ఆమోదం పొంది ఆ సంఖ్య 223 పోలింగ్ స్టేషన్లకు పెరిగింది**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం ఎమ్మార్వో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు అధికారికం గా విడుదల చేశారు. రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం (ECI) పర్యవేక్షణలో జరుగు తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) 2026లో భాగంగా ఆర్‌డీఓ (RDO), ఎమ్మార్వో (MRO) మరియు ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈ జాబితాను ఆవిష్కరించారు.

హాజరైన ముఖ్య నాయకులు & అధికారులు:

ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు షేక్ సిలార్ దాదా, ఇమడాబత్తుల దిలీప్, చల్లాది రామకృష్ణ, మేడంపూడి అనిల్ బాబు, మట్ట నాంచారయ్య, పల్లి శేఖర్, తలుపుల లక్ష్మణ్, రమేష్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.ఓటర్లకు ముఖ్యమైన తేదీలు & సమయ పట్టికప్రక్రియగడువు / తేదీఅభ్యంతరాలు / దరఖాస్తుల స్వీకరణనేటి నుండి ఆగస్టు 30 వరకుదరఖాస్తుల పరిష్కారం ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 28 వరకుతుది ఓటర్ల జాబితా ప్రచురణఅక్టోబర్ 3, 2026ఓటర్లు ఏమి చేయాలి? ఎక్కడ సరిచూసుకోవాలి?వివరాల పరిశీలన: ముసాయిదా జాబితాలో మీ పేరు ఉందో లేదో ముందే సరిచూసుకోండి. పేరులో అక్షర దోషాలు (Spelling Mistakes), వయస్సు, చిరునామా లేదా ఇతర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోండి.

ఆన్‌లైన్ సదుపాయం: ముసాయిదా ఓటర్ల జాబితా ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ల వారీగా PDF రూపంలో అందుబాటులో ఉంది.ఆఫ్‌లైన్ కేంద్రాలు: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంఅసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (AERO) కార్యాలయాలు బి.ఎల్.ఓ (BLO)ల వద్దఎమ్మార్వో కార్యాలయం & జిల్లా కలెక్టర్ కార్యాలయంగమనిక: పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులున్నా లేదా ఏవైనా లోపాలున్నా వెంటనే BLO, ERO, RDO, AERO, ఎమ్మార్వో లేదా మ్యూనిసిపల్ కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తులు లేదా ఫిర్యాదులు అందజేయవచ్చు.



# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

## కలెక్టరేట్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల వినతి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ ప్రవేశ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనిపై తక్షణమే సీబీఐ (CBI) విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జ్ కలెక్టర్ నవీన్ ను కలసి డీఎస్సీ అక్రమాలపై, అలాగే కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలనే అంశాలపై వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని), అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, గుడివాడ నియోజకవర్గ సమన్వయకర్త దుక్కిపాటి శశిభూషణ్, పెడన సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము), పెనమలూరు సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తిల, లంకె వెంకటేశ్వరరావు, శీలం భారతి తో పాటు పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్ సీపీ నాయకుల ప్రధాన విమర్శలు:దొడ్డిదారిన పోస్టుల కేటాయింపు: కష్టపడి చదివి, ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకున్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. లోకేష్ వద్ద టోకెన్లు తీసుకుని, దొంగతనంగా ఉద్యోగాలు పొందిన వారికి అర్హత ఎలా వస్తుందని ప్రశ్నించారు.స్పోర్ట్స్ కోటాలో లూటీ: ఎటువంటి పరీక్షలు లేకుండానే స్పోర్ట్స్ కోటా పేరుతో 380 ఉద్యోగాలు కట్టబెట్టారని, క్రీడా సంఘాలు ఇచ్చిన నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు ఉద్యోగం ఇవ్వకుండా, నాలుగు కాలేజీలు కలిపి పెట్టిన ఆటల్లో పాల్గొన్న వారికి ఉద్యోగాలు ఇచ్చారని ధ్వజమెత్తారు.మెరిట్ లిస్ట్, కేసులు నిలవకపోవడం: కలెక్టరేట్‌లో మెరిట్ లిస్ట్‌లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. డీఎస్సీ ఉద్యోగం కోసం ₹15 లక్షలు డిమాండ్ చేస్తూ మాట్లాడిన ఫోన్ సంభాషణలపై కేసులు ఎందుకు బలంగా పెట్టలేదని, బలమైన కేసులు పెడితే ప్రభుత్వ భాగోతం బయటపడుతుందనే భయం వేధిస్తోందని విమర్శించారు.టీచర్లపై ఒత్తిడి: ఏళ్ల తరబడి అనుభవం ఉండి, మరో రెండేళ్లలో రిటైర్మెంట్ కానున్న ఉపాధ్యాయులను టెట్ రాయాలని ఒత్తిడి తెస్తున్న చంద్రబాబు ప్రభుత్వం, లోకేష్ మనుషులకు మాత్రం ఎలాంటి పరీక్షలు అవసరం లేదనడం దారుణమన్నారు. కృష్ణా డెల్టా రైతుల సమస్యలు – సాగునీటి ఎద్దడి:సాగునీరు నిరాకరణ సరైనది కాదు: వరి నాట్లు వేసిన తర్వాత కృష్ణా డెల్టాకు నీరివ్వలేమని చెప్పడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. జూన్ నెలలో ఏరువాక సాగును ప్రారంభించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇప్పుడు నీటిని అందించలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.నీటి లభ్యత ఉన్నా వైఫల్యం: పట్టిసీమ నుంచి 4,000 క్యూసెక్కుల నీటిని తీసుకునే వెసులుబాటు ఉన్నా, ఆల్మట్టి నుంచి నీరు వస్తున్నా రైతులకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.క్రాప్ హాలిడే – నష్టపరిహారం: సాగు ఆపేయాలని చెప్పినందున కృష్ణా డెల్టా రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ తీరుపై ఘాటు విమర్శలు:హామీల విస్మరణ: 'అమ్మ ఒడి' పథకం పేరును 'తల్లికి వందనం'గా మార్చి లబ్ధిదారుల సంఖ్యను ఏటేటా తగ్గిస్తున్నారని, ఉచిత విద్యుత్ సదుపాయాలకు ఆంక్షలు విధిస్తున్నారని ఆక్షేపించారు.రక్షణ వ్యవస్థల వైఫల్యం: వైఎస్ జగన్ పర్యటనల సమయంలో వేలాది మంది పోలీసులను మోహరిస్తున్న ప్రభుత్వం, తిరుపతి, కాశీబుగ్గ, సింహాచలం లాంటి ధార్మిక క్షేత్రాలలో భక్తుల భద్రతను గాలికి వదిలేసిందని విమర్శించారు.అధికారుల విభేదాలు: రాష్ట్రంలో పోలీస్ ఉన్నతాధికారులు రోడ్డున పడి తిట్టుకుంటున్నారని, రాష్ట్రంలో పాలన పూర్తిగా దారి తప్పిందని నాయకులు ఆరోపించారు.డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ విచారణ వేయకపోతే, రైతులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పోరాటాలు చేస్తుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొర్రా విటల్, అచ్చేభా, గడిదేశి బాలజేసు, రూరల్ పార్టీ అధ్యక్షులు మట్టా నాంచారయ్య, వివిధ హోదాలలో ఉన్న నాయకులు మాజీ కార్పొరేటర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు




# ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు, అభ్యంతరాలు తెలియజేయాలి

**ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఎం నవీన్ సమీక్ష**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)-2026 ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీలు క్షుణ్ణంగా పరిశీలించి ఏవైనా మార్పులు చేర్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత గడువులోగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)-2026 కార్యక్రమంలో భాగంగా, ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్)ను శుక్రవారం అధికారికంగా ప్రచురించిన సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, క్లెయిమ్స్-అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి ఎన్యూమరేషన్ నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి సేకరించినట్లు తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో బీఎల్ఓ లు, బీఎల్ఏలు,



ఈఆర్‌వోలతో దశలవారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రతి అంశా న్ని పర్యవేక్షించినట్లు చెప్పారు.ఈ ప్రక్రియకు ముందు జిల్లాలో మొత్తం 15,43,242 మంది ఓటర్లు ఉండగా, ఎన్యూమరేషన్ అనంతరం 14,05, 580 ఫారాలు మాత్రమే తిరిగి అందా యని తెలిపారు. 1,37,662 మంది ఓటర్లకు సంబం ధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదని, వీరిలో మరణించినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు, చిరునామా తెలియనివారు లేదా ఇతర కారణా లతో ఫారం సమర్పించని వారు ఉండవచ్చని పేర్కొన్నారు. అందువల్ల వారి పేర్లు ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితాలో పొందుపరచలేదని స్పష్టం చేశారు. సంబంధిత జాబితాను కూడా రాజకీయ పార్టీలకు అందజేస్తున్నట్లు తెలిపారు.ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీలకు ఫోటోలతో కూడిన భౌతిక ప్రతితో పాటు డిజిటల్ కాపీ రూపంలో అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రం, ఈఆర్‌వో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల పరిశీలన కోసం జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా జాబితా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను రాజకీయ పార్టీల సూచనలు, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్న 1,769 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 77 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,846కు చేరిందని వెల్లడించారు.ముసాయిదా ఓటరు జాబితాపై జూలై 31 నుంచి ఆగస్టు 30, 2026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7, వివరాల సవరణ లేదా పోలింగ్ కేంద్రం మార్పుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాజకీయ పార్టీలు, ప్రజలు ముసాయిదా జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలు ఉంటే నిర్దేశిత గడువులోగా తెలియజేయాలని కోరారు.ముసాయిదా జాబితాలో ఉన్న ఓటర్లలో "నో మ్యాపింగ్" కేసులు, అలాగే లాజికల్ అనామలీలు గుర్తించిన వారికి సెప్టెంబర్ 28 వరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. సంబంధిత వ్యక్తులు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించిన అనంతరం విచారణ నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఓటరు హక్కు కలిగి ఉండేందుకు భారత పౌరసత్వం, 18 సంవత్సరాల వయస్సు, సంబంధిత నియో జకవర్గంలో సాధారణ నివాసం, చట్టపరంగా అనర్హత లేకపోవడం వంటి అర్హతలు ఉండాలని తెలిపారు. అవసరమైతే ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి పౌరసత్వ నిర్ధారణకు సమర్పించవచ్చని వివరించారు.క్లెయిమ్స్, అభ్యంతరాలు, నోటీసులపై వచ్చిన వివరణలు, విచారణలను సెప్టెంబర్ 28, 2026 నాటికి పూర్తి చేసి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కొడాలి శర్మ సిపిఐ(ఎం), బిఎంవి దాస్ (టిడిపి), షేక్ సిలార్ దాదా (వైయస్సార్సీపి), బి విజయ్ కుమార్ (బీఎస్పీ), కే చంద్రశేఖర్ (కాంగ్రెస్), కూనపురెడ్డి శ్రీనివాసరావు (బిజెపి), ఎన్ సత్యానారాయణ (సిపిఎం), ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దస్తావేజులు పోయినవి

వట్టిగుడిపాడు గ్రామ వాసిని సింహాద్రి నాగరాజు అను నేను ఆ యొక్క వట్టిగుడిపాడు గ్రామంలో నేను స్వయంగా క్రైయం పొందిన 115 చదరపు గజములు విస్తీర్ణం గల కాళీ నివేశ స్థలం మనకు సంబంధించిన ఆర్ఎస్ నెంబర్ 122 /7 సి కి సంబంధించిన డాక్యుమెంట్ 31 85 / 2013 అను నెంబర్ గల డాక్యుమెంటు ఆగిరిపల్లి గ్రామంలో ఫోటో స్టాండ్ తీయించుకొనుటకు వస్తుండగా మార్గమధ్యంలో బండి నుండి జారీ పడిపోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ ఫోను నెంబర్కు తెలియపరచగలరు( 703240 4627)

ఇట్లు
ఒట్టిగుడిపాడు గ్రామ నివాసి
సింహాద్రి నాగరాజు

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 1 ఆగస్టు 2026

## వరదలపై ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి







ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

ప్రస్తుతం పెరుగుతున్న గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రభుత్వ శాఖల అధికార యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. శుక్రవారం వేలేరుపాడు లోని తాసిల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో వరదలపై అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా ప్రప్రదంగా వరదలు చుట్టుముట్టే గ్రామాలలోని ప్రజలను, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాల్సిందిగా ఆదేశించారు. వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలలోని వైద్యశాలలో ఉంచి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వరద చుట్టుముట్టిని గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ పరంగా అందించాల్సిన సేవలను ఎవరికి వారు బాధ్యతాయుతంగా అందించాలని తెలిపారు. ముంపునకు గురయ్యే గ్రామాలను ఖాళీ చేపించి పునరావాస కాలనీలకు వరదలు సంభవించే మూడు నెలల వరకు అక్కడే ఉంచే ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో రాములు నాయక్, డి.ఎస్.పి జై కృష్ణ, సీఐ బాల సురేష్ బాబు, ఎస్సై నవీన్ కుమార్, తాసిల్దార్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

**వరద పరిస్థితిని సమీక్షించిన జెసి**

గోదావరి వరద పరిస్థితిని శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సిబ్బందితో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వరద చుట్టుముట్టిన గ్రామాల్లో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, ముఖ్యంగా కాలవుల్లో దాటే ప్రయత్నాలు చేయనివ్వకూడదని చేపల వేటకు వెళ్లే వారిని నిలుపుదల చేయాలని తదితర రక్షణకు సంబంధించిన సూచనలు అందించారు. ఇప్పటికే వరద పరిస్థితిపై 9 బోట్లు అవసరం ఉండగా నాలుగు బోట్లను సమీకరణ చేయడం జరిగిందని మరో అయిదు బోట్లను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు జెసి తెలిపారు. వరద ముంపుకు గురై గుట్టలపై తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకునేందుకు రుద్రంకోట గ్రామస్తులకు 750 తార్పాలియలను పంపిణీ చేయడం జరిగింది అన్నారు.

**ప్రజారక్షణ చర్యలు పై పోలీసు అప్రమత్తం.**

వరదల సమయంలో ఏ విధమైన ప్రాణ నష్టాలు జరగకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని డి.ఎస్.పి జై కృష్ణ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా రహదారుల పై చేరిన వరద నీటిలో దాటే ప్రయత్నం చేసే వారిని నిరువదించాలని, వరద ఉధృతం గా ఉన్నందున చేపల వేటను నియంత్రించాలని ప్రధానుగుణంగా ఎక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిందిగా డి.ఎస్.పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సురేష్ బాబు, ఎస్సై నవీన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యాలయ సహాయకురాలికి ఘన వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యాలయ సహాయకురాలిగా దీర్ఘకాలం సేవలందించిన పీతాని నాగవేణి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,కళాశాల స్థాపన నుంచి అంకిత భావంతో సేవలందించిన నాగవేణి సేవలను కొనియాడారు.ముఖ్య అతిథులు ఆర్ఐఓ యోహాన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.సీపీడీసీ కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆమె విధులను సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలు పొందారని అన్నారు.ఉద్యోగ విరమణ చేసిన నాగవేణి తనకు ఘనంగా వీడ్కోలు పలికిన ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కే.రమేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని టి. వెంకట దుర్గాప్రసాద్ సమన్వయం చేశారు.

## జర్నలిస్టుల డిమాండ్స్ డే విజయవంతం

-ఏలూరులో రిలే నిరాహార దీక్ష



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "డిమాండ్స్ డే" కార్యక్రమం శుక్రవారం ఏలూరులో విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా జర్నలిస్టులు రిలే నిరాహార దీక్ష నిర్వహించి, జర్నలిస్టుల 11 పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవె న్యూ అధికారి శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.సీనియర్ జర్నలిస్టు బాలశౌరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.డి. జబీర్, జిల్లా కార్యదర్శి వై.వి. హరీష్, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణరావు,ది ఏలూరు ప్రెస్ ఫోరం అధ్యక్షుడు రమ ణ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ పునరుద్ధరణ, మీడియా కమిషన్ ఏర్పాటు, ప్రమాద బీమా పునరుద్ధరణతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి లింగరాజు సంఘీభావం ప్రకటించారు.అలాగే ఎలక్ట్రానిక్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కళ్యాణ్ కుమార్, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు రుషి రావు, కార్యదర్శి వెంకట్రావు, ప్రజాశక్తి గంగరాజు, ఏపీడబ్ల్యూజేఎఫ్ ట్రెజరర్ చిన్నారావు, ఎర్లీ పోస్ట్ ఎడిటర్ పిల్లి మిల్టన్ ప్రతాప్, దర్శి సత్యనారాయణ, చింతపల్లి శ్రీనివాస్, సతీష్, దొరబాబు, సన్నీ చక్రవర్తి, శరత్,యాదవ్, శ్రీకాంత్, సీతారాముడు జర్నలిస్టు నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా ఎస్ఐపై దురుసు ప్రవర్తన ఖండనీయం: రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



శ్రీకాకుళం జిల్లాలో మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి పర్యటన సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్ఐ ప్రవల్లిక పట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించడాన్ని ఏపీఎ స్ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్, ఏలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారుల పట్ల ఇలాంటి అనుచిత ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని ఆయన అన్నారు.మహిళా పోలీసు అధికారి ణిపై అసభ్యంగా ప్రవర్తించడం వైసీపీ నాయకుల సంస్కారహీనతకు నిదర్శనమని ఆయన విమర్శించారు.చట్టాన్ని అమలు చేసే అధికారుల పట్ల గౌరవం చూపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, మహిళల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలను ప్రభుత్వం, పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించాలని కోరారు.నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహించే రాజకీయ ధోరణి సమాజానికి ప్రమాదకరమని పేర్కొంటూ, ఈ ఘటనలో బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు.

## నేడు జిల్లాలో112.43 కోట్ల ఎన్టీఆర్ భరోసా పంపిణీ

-జిల్లా కలెక్టర్ కె.వైట్రీ సెల్వి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



ఏలూరు జిల్లాలో ఆగష్టు 1వ తేదీన 2,54,579 మంది ఫించన్ దారులకు 112.43 కోట్ల రూపాయిలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసాపించను పథకము కింద ఆగష్టు, 1వ తేదీ ఉదయం 7 గంటల నుండి అందించడం జరుగుతుందన్నారు.ఏలూరు జిల్లాలో ఆగష్టు, 2026 నెలలో 2,54,579 మంది ఫించన్ దారులకు 112.43 కోట్ల రూపాయిలు పంపిణీ చేయడం జరుగుతుంది. జిల్లా లో ఫించన్ లు పంపిణీ 1 వ తేదీన 100 శాతం పంపిణీ చేయు టకు చర్యలు తీసుకొనటం జరుగుతుందన్నారు. అనివార్య కారణం ల చేత 1 వ తేదీన తీసుకోని వారికి 2వ తేదీ న పంపిణీ చేస్తారని, జిల్లా లో 4954 మంధి సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బంది తో ఫించనల పంపిణీకి ఏర్పాటులు చేయడమైనదన్నారు. పింఛను పొందేం దుకు పింఛను దారులు వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచా రం అందించాలని, సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 7.00 గంటల నుండి పించను పంపిణి జరిగే విధముగా చర్యలు తిసుకోనవలసినదిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు.

## ఉద్యోగిగా శ్రీనివాస్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయం

ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

వివిధ హోదాలలో భూసారపు శ్రీనివాస్ ఉద్యోగ విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమైనవని పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి రవి అన్నారు. ఎలమంచిలి మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్వర్ణ గ్రామం ఆఫీసర్( డిప్యూటీ ఎంపీడీవో) గా విధులు నిర్వహించిన భూసారపు శ్రీనివాస్, ఉద్యోగ విరమణ అభినందన సభ ఎలమంచిలి క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఇంచార్జ్ ఎంపీడీవో జె డి వి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎంపీ పీ ధనలక్ష్మి పాల్గొని మాట్లాడారు. మరో ముఖ్య అతిథి జిల్లా స్వర్ణ, గ్రామ వార్డు అధికారి వెంకటలక్ష్మి, పలువురు వక్తలు మాట్లాడుతూ వివాదరహితుడిగా, సౌమ్యుడిగా, నిజాయితీతో తన 41 సర్వీస్ లో ఒక్క మేమొ కూడా రాకుండా విధులు నిర్వహించడం గొప్ప విశేషం అని అన్నారు. ఈ సభలో తాసిల్దార్ పవన్ కుమార్, రిటైర్డ్ తాసిల్దార్ రామాంజనేయులు, విశ్వనాథ శర్మ, ఇలపకుర్రు కార్యదర్శి పెచ్చెట్టి సత్యనారాయణ, మొగల్తూరు ఎంపీడీవో త్రిశూల్పాణి, నర్సాపురం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రామన్,డిప్యూటీ ఎంపీడీవో దుర్గ ప్రసాద్, శివదేవుని చిక్కాల సొసైటీ చైర్మన్ వద్దే సోమ చంద్ర శేఖర్, శ్రీనివాస్ కుమారుడు వినయ్ కుమార్ పలు గ్రామాల కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు, పాల్గొని శ్రీనివాస్ సేవల కొనియాడారు. ఈ సందర్భంగా భూసారపు శ్రీనివాస్, రమాదేవి దంపతులను ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో, తాసిల్దార్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ తన సర్వీస్ కాలంలో సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులను సభికులకు పరిచయం చేశారు.

## వైద్య, ఆరోగ్య శాఖలో పెద్దిరాజు సేవలు చిరస్మరణీయం.



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

వైద్య, ఆరోగ్య శాఖ, మలేరియా విభాగంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గా పెద్దిరాజు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మండలంలోని నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సబ్ యూనిట్ ఆఫీసర్ గా ఉద్యోగ విరమణ చేసిన పెద్దిరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జీలుగుమిల్లి మండల అధ్యక్షుడు కూరం ప్రసాద్, పలువురు సహోద్యోగులు మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా పెద్దిరాజు గిరిజనులకు అందించిన వైద్య సేవలు కొనియాడదగినవని అన్నారు. పదవి విరమణ పొందిన పెద్దిరాజును శాలువాతో సన్మానించారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి: సీపీఐ



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో విస్తృత పోరాటాలు చేపట్టనున్నట్లు సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య తెలిపారు. మండలంలోని బుట్టాయగూడెం, సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు తెల్లం ముణేశ్వరావు అధ్యక్షతన శుక్రవారం సీపీఐ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దారయ్య మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో బిజెపి అనుకూల ప్రభుత్వాల పాలనలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య కుటుంబాల పోషణ ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. విద్య, వైద్య సేవలను మరింత మెరుగుపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీపు జాత, ఆగస్టు 6 నుండి 15 వరకు జరిగే పాదయాత్ర, అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ప్రజాపోరాటాల్లో మండలంలోని రైతులు, కూలీలు, యువకులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని దారయ్య కోరారు. అనంతరం చలో ఢిల్లీ గోడ పత్రికలను పార్టీ కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కొప్పుల నాగరాజు, పార్టీ కార్యకర్తలు మడకం దుర్గారావు, కొడమంచిలి బాబురావు, కోరం సత్తిబాబు, ఉయికే నాగేశ్వరరావు, కుర్సం రామలక్ష్మి, ఉడత మంగమ్మ, గుండి నాగరత్నం, బుద్దుల ముత్యాలమ్మ, కారం వీరమ్మ, మడకం గంగరాజు, పోలోజు సుబ్రమణి, తెల్లం వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లల దంత సంరక్షణపై తల్లిదండ్రులు శ్రద్ధవహించాలి.

- డాక్టర్ చరిష్మ.



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు గుడాల హరిబాబు ఆధ్వర్యంలో కొత్తపేట మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు 45 మంది విద్యార్థిని. విద్యార్థులకు డెంటల్ డాక్టర్ చరిష్మ దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చరిష్మ మాట్లాడుతూ చిన్నపిల్లలు ఎక్కువగా చాక్లెట్లు తినడం వల్ల. దంతాలను సరిగా బ్రష్ చేయకపోవడం వలన దంతాలు గుంటలు పడి పిప్పళ్ళుగా మారి దుర్వాసన రావడం. దంతాలు ఊడి పోవుట జరుగునని వీటిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పేస్టు. పెన్నులు. పెన్సిళ్లు అందజేశారు . ఈ కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ ఇమ్మిడి రాజేష్.కోశాధికారి ఆరుమిల్లి సురేష్.చిలుకూరి భీమన్న. ప్రధానోపాధ్యాయులు కథలు వెంకటేశ్వరరావు. బడుగు త్రిమూర్తులు.పెచ్చెట్టి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సమావేశం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆదేశాల ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాధికార డిప్యూటీ సెక్రెటరీ డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు జాతీయ న్యాయ సేవధికార సంస్థ అందించే సేవల పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా డిప్యూటీ సెక్రెటరీ డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర , జిల్లా స్థాయిలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలు ఏ విధంగా అమలు పరుస్తున్నారు, ఆ సేవలు ప్రజల వద్దకు చేరువయ్యే క్రమంలో ఎదురయ్యే సమస్యలు అలాగే సూచనలను ప్యానల్ న్యాయవాదులు మధ్యవర్తులు పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, బాధితులు మరియు ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి జాతీయ న్యాయ సేవాధికార సంస్థకు అందించే క్రమంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని కావున లీగల్ సర్వీసెస్ క్లినిక్స్ ,యాసిడ్ ఎటాక్ కేసులలో బాధితుల పరిహారం, మానవ అక్రమ రవాణా ణ , బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు మొదలైన విభాగాలలో న్యాయ సేవలు అమలు మరియు పురోగతి పైన అభిప్రాయాలను సేకరించముల ద్వారా ఆయా పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడం జరుగుతుందని తెలియజేశారు మరియు ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి ,ఏలూరు భార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొనే సీతారాం ప్యానల్ న్యాయవాదులు మధ్యవర్తులు పారా లీగల్ వాలంటీర్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని జీవీఎస్‌వీఆర్ఎం మోడల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం చైర్మన్ మండాది నాగ వెంకట అవినాష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్యే భవిష్యత్తుకు బలమైన పునాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్రం సభ్యులు , అన్నాబత్తుల దుర్గారావు, టిడిపి వార్డు ఇన్చార్జ్ మజ్జి శంకరం పాల్గొన్నారు.ఉపాధ్యాయురాలు నందిని మాట్లాడుతూ, పేద విద్యార్థుల విద్యకు చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం చైర్మన్ మండాది నాగ వెంకట అవినాష్ పాటు సత్రం సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా నోట్‌బుక్స్ అందించిన శ్రీ మన్యం జగ్గమ్మ సత్రం చైర్మన్, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, లీలా కుమారి . పేరెంట్స్ పాల్గొన్నారు.

# ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న గోదావరి శబరి నదులు

- రెండోవ ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తున్న గోదావరి
- భయం గుప్పెట్లో లోతట్టు గ్రామాల ప్రజలు.
- వరదలను ఎదుర్కొనేందుకు సమాయత్తం అయిన అధికార యంత్రాంగం.
- సహాయక చర్యలు కోసం లాంచీలను, నాటు పడవలను సిద్ధం చేసిన అధికారులు.





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

గోదావరి శబరి నదులకు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు జీవనదులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. విఆర్ పురం వద్ద శుక్రవారం సాయంత్రానికి పెరుగుతున్న వరద ఉధృతి 15 మీటర్లకు చేరుకొని ప్రవహిస్తుంది. అదేవిధంగా మండలానికి ఎగువున భద్రాచలం వద్ద పెరుగుతున్న వరద ఉధృతి శుక్రవారం సాయంత్రానికి 48 అడుగుల వరకు చేరుకొని రెండోవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. పెరుగుతున్న వరద ఉధృతి భద్రాచలం వద్ద 50 అడుగులను దాటి చేరుకుంటుందని పలువురు విశ్లేషకులు అంచనాను తెలుపుతున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరి 43 అడుగులు కాగా, ఇప్పుడు 44 అడుగులు వరకు చేరుకొని ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే మండలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక 16.74 మీటర్లు ఉండగా 15 మీటర్లు వరకు వరద ఉధృతి చేరుకొని ఉధృతంగా ప్రవహిస్తుంది. పెరుగుతున్న గోదావరి వరదలను చూసి మండల ప్రజలు భయం గుప్పెట్లో మగ్గుతున్నారు. గోదావరి వరదలు సంభవిస్తే ఉన్న ఇళ్లను వదిలి ఎత్తైన అటవీ ప్రదేశాల్లో తాత్కాలిక పునరావాసాలు ఏర్పాటు చేసుకొని, యావత్తు కుటుంబాలు చాలిచాలని ఆగుడి సేలలో కరెంటు లేక దోమ కాటుతో నరకం చూడాల్సిన పరిస్థితి వస్తుందని లోతట్టు గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో మగ్గుతున్నారు. ఇదిలా ఉండగా వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం మొత్తం సమాయత్తం అయింది. అలాగే వరద పునరావాస కేంద్రాల వద్ద నిర్వాసిత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుబ్రంచెపించి, బ్లీచింగ్ చల్లించి సిద్ధం చేయించారు. అదేవిధంగా వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్లగూడెం, శ్రీరామగిరి, సీతంపేట, జీడిగుప్ప, ఇసునూరు, పోచవరం తదితర లోతట్టు గ్రామాల ప్రజలు ముందస్తుగా వరద పునరావాస కేంద్రాల్లో తాత్కాలిక గుడిసెలను నిర్మించుకొని, ఎప్పుడు వరద వస్తె అప్పుడు వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నారు. వరద ఉధృతి పెరిగితే రామవరం-రామవరంపాడు మధ్య, తుస్తివారిగూడెం టు అడవి వెంకన్నగూడెం గ్రామాల మధ్య, చింతరేగుపల్లి టు కన్నయ్యగూడెం గ్రామాల మధ్య రహదారులను గోదావరి వరద నీటిలో మునిగే ప్రమాదం ఉంది. అదేవిధంగా వరద ఉధృతి శ్రీరామగిరి సమీపంలో 43 అడుగుల చేరుకుంటే అక్కడ రోడ్డు బ్లాక్ అవటంతో శ్రీరామగిరి, చొక్కనపల్లి, కొత్తూరు, కల్తనూరును గ్రామాలకు మండల కేంద్రానికి రాకపోకలు స్తంభిస్తాయి. అలాగే గోదావరి వరద మరింత పెరిగి 45 అడుగులకు చేరుకుంటే సోకులేరు వాగు కారణంగా చింతూరు మండలం రోడ్డు దిగ్బంధం, ముకునూరు, నరసింగపేట, తిమ్మిరిగూడెం, ఎ.జి.కోడేరు, ఉలుమూరు, మల్లెతోటకు వెళ్లే రోడ్డు మార్గం నిలిచిపోతుంది, పోచవరం సమీపంలో రోడ్డు పైకి వరదనీరు చేరుకొని దీని ప్రభావంతో పోచవరం, తుమ్మిలేరు, కొండేపూడి, కొల్లూరు, గొందూరు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి, వడ్డిగూడెం, రాజుపేట గ్రామాలు కూడా జలదిగ్బంధం అవుతాయి. పొంగి ప్రవహిస్తున్న వరద ఉధృతి శాంతించి గోదావరి తగ్గుముఖం పట్టాలని లోతట్టు గ్రామాల ప్రజలు తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తున్నారు.

## ప్రజలకు చేరువగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఈదర, సీతారామపురం గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది . ఈదర గ్రామంలో ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దొండపాటి యేసుపాదం, ఎస్సీ సెల్ నాయకుడు లంకపల్లి పండు, సీనియర్ నాయకుడు పాపట్ల శ్రీను ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. సీతారామపురంలో గ్రామ అధ్యక్షుడు చిన్ని సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇదే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

## నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటులో సత్తా చాటిన మోడరన్ విద్యార్థి అభిషేక్.




ప్రజా భూమి ప్రతినిధి-రామచంద్రపురం

ఒడిశా స్టేట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్-సన్‌రైజ్ స్పాన్సర్‌షిప్ తో భువనేశ్వర్‌లో జరిగిన నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలలో మోడరన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న బోను అభిషేక్ సత్తా చాటాడు.నేషనల్ లెవల్ అండర్ -19 డబుల్స్ క్యాటగిరిలో అభిషేక్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అగ్రశ్రేణి క్రీడాకారులతో అభిషేక్ ఈ టోర్నమెంట్‌లో తలపడి సత్తా చాటాడని అభినందించారు.ఈ పోటీల్లో అభిషేక్ బాయ్స్ డబుల్స్ విభాగంలో అద్భుతంగా ఆడి సెమీ ఫైనల్ వరకు చేరుకున్నాడని వివరించారు.అతని క్రమశిక్షణతో కూడిన వ్యూహాత్మక ఆట, కోర్టులో చూపిన పోరాట పటిమ అందరినీ ఆకట్టుకుందని నిర్వాహకులు పేర్కొనటం అభినందనీయమని రావుపేర్కొన్నారు.సెమీ ఫైనలిస్ట్‌గా నిలిచినందుకు అభిషేక్‌కు నిర్వాహకులు మెడల్, మెరిట్ సర్టిఫికెట్ తో పాటు రూ.15,000 నగదు బహుమతి అందజేశారని తెలిపారు. నేషనల్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో ఇలాంటి స్థాయికి చేరడం అభిషేక్ భవిష్యత్తుకు మంచి సంకేతమని రావు కొనియాడారు. భవిష్యత్తులో అభిషేక్ మరిన్ని విజయాలు సాధించి దేశం గర్వించే క్రీడాకారుడుగా నిలవాలని రావు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరేలా పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. కొత్తపేటలోని 141వ బూత్ పరిధిలో బూత్ కన్వీనర్ ముద్రగడ పనిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మెగా డీఎస్సీ, ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్లు వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల ఆర్థికంగా లబ్ధి పొందినట్లు పలువురు లబ్ధిదారులు ప్రచార బృందానికి వివరించినట్లు చెప్పారు. ప్రజలు ఇచ్చిన భారీ మెజారిటీకి తగ్గట్టుగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాయకత్వంలో కొత్తపేట నియోజకవర్గంలో అన్ని వర్గాలకు సమానంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి, క్లస్టర్ కో-ఇంచార్జ్ బూసి భాస్కర్‌రావు, నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు కాసా విజయసాగర్, కొత్తపేట డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలంగి రవిచంద్ర, శీలం సూర్యచంద్రరావు, కడియం భాస్కరరావు, అద్దంకి చంటిబాబు, దేవగుప్తపు నాగేంద్రతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాకాల వరదలపై ముందస్తు అప్రమత్తత అవసరం

-ఆత్రేయపురం మండల అధికారులతో తహశీల్దార్, ఎంపీడీవో సమీక్ష సమావేశం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ ఆర్.డి. రామచంద్ర మూర్తి, ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో వరదలు సంభవించే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, గ్రామస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అవసరమైతే సహాయ శిబిరాల ఏర్పాటుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రజలకు సకాలంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలను వేగవంతంగా చేపట్టాలని తహశీల్దార్, ఎంపీడీవో స్పష్టం చేశారు.

## ఈతకోటలో భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ

గ్రామదేవతలకు పసుపు, కుంకుమ, చీరలతో మహిళల ప్రత్యేక పూజలు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



మండల పరిధిలోని ఈతకోట గ్రామంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలు శ్రీ ఎరిణమ్మ, శ్రీ పోలేరమ్మ, శ్రీ సత్తమ్మతల్లి, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవార్లకు శుక్రవారం మహిళలు, గ్రామ పుట్టింటి ఆడపడుచులు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామ పంచాయతీ వీధిలోని కమ్యూనిటీ హాల్, రామాలయం నుంచి భాజా భజంత్రీల నడుమ సారెతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు ముందుగా గ్రామంలోని శ్రీ ఎరిణమ్మతల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద చెరువు గట్టుపై కొలువైన శ్రీ పోలేరమ్మ తల్లి, చిన్న చెరువు గట్టున వెలసిన లోకమాత శ్రీ సత్తమ్మతల్లి, కొత్త సెంటర్‌లో జాతీయ రహదారి సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర సారెలను సమర్పించారు. అలాగే శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవికి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోని అమ్మవారికి కూడా మహిళలు సారెలు సమర్పించి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పుట్టింటి ఆడపడుచులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయాలను దర్శించుకుని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతలను మహిళలు ప్రార్థించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం గ్రామంలో భక్తిపారవశ్యాన్ని నింపింది.

## వరద ముందస్తు చర్యలు చేపట్టని కూటమి ప్రభుత్వం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

గోదావరి శబరి నదులు పొంగి ఉధృతంగా పప్రవశిస్తున్నాయి, భద్రాచలంలో 48 అడుగులు రెండోవ ప్రమాద స్థాయికి చేరుకుంది గోదావరి, కానీ కూటమి ప్రభుత్వం వరదలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ప్రణాళిక చేయకపోవడం బాధాకర విషయం అని మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ, చింతరేగుపల్లి గ్రామంలో అధ్యక్ష వహించిన మాజీ వార్డ్ నెంబర్ గుటల నవీన్ కుమార్, రైతు విభాగం అధ్యక్షుడు గుటల ముత్యాలరావు, మాజీ సర్పంచ్ పిట్టరామారావు ఎస్టీ సెల్అధ్యక్షుడు కోటం జయరాజు అన్నారు. ఇప్పటి వరకు ప్రజలకి అవగాహన కూడా కల్పించలేదని, అలాగే బంపర్ స్టాకు పెట్టకపోవడం, నిత్యవస సరుకులు కూడా ముందస్తు చర్యలు తీసుకోపోవడం ముంపు బాధితులని పట్టించుకోని వుంకనిపైస్తుందని వారు తెలిపారు. రహదారులు బంద్ అయితే ఎటువంటి సౌకర్యాలు ఉండవు, కన్నాయిగూడెం టు చింతరేగుపల్లి అలాగే తొస్టివారిగూడెం టు వెంకన్న గూడెం ముందుగా రహదారులు బంద్ అయ్యే విలేజ్ లు మరి గతంలో ఇదే ప్రభుత్వం వరదలప్పుడు 3000 రూపాయలు ఇస్తామని పేపర్ లో ప్రకటన చేసిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు కూడా అన్ని ఇస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తాను అంటే రాబోయే ఎన్నికలలో ప్రజలు సరైన గున పాఠం చెప్తారని పేర్కొన్నారు. నిత్యాశర సరుకులు ముందుగా బాధితులకి అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గూటాల సీతయ్య, ముత్యాల అశోక్, గూటాల సత్యనారాయణ, గుటల ఏసు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సొసైటీ కార్యాలయాన్ని సందర్శించిన డెవలప్మెంట్ మేనేజర్ గీత

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



మండలంలోని జగ్గవరం పంచాయతీ పరిధిలో గల కోతుల గుట్ట గ్రామంలో సొసైటీ కార్యాలయాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ బ్యాంక్ జిల్లా సొసైటీ డెవలప్మెంట్ మేనేజర్ గీత యన్ సి డి సి శివరామకృష్ణ డిసిసిబి షరీఫ్,ప్రకాష్, రంపచోడవరం బ్రాంచ్ సూపర్వైజర్ వెంకటేష్, కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది తదుపరి రైతులతో మాట్లాడుతూ మన మండలంలోని (కూటురు గట్టు సంస్థ) సొసైటీ రైతు ఉత్పత్తి తయారీ కేంద్రంగా సెలెక్ట్ అయింది అని తెలియజేశారు.అందుకు యన్ సి డి సి అండ్ ఎ పిసిఓబి నుండి నిధులు వస్తాయి అని ఆ యొక్క నిధులను సంఘ పాలకవర్గం సంఘ సభ్యులు కలసి రైతులకు అవసరం అయిన ఉత్పాదకాలను కొనుగోలు చేసి వాటిని వ్యవసాయ రంగానికి వాడుకొని అందరూ రైతులు లబ్ధి పొందాలని ఆశించారు.

అదే విధంగా కొత్తగా రైతులను సభ్యత్వం కట్టించుకొని సభ్యులు గా చేర్చుకొని వారి కూడా సొసైటీ నుండి వచ్చే అన్ని రకాల సదుపాయాలు అందచేత వచ్చు అని తెలియజేశారు. కొత్తగా సభ్యత్వం కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు,ఒక్క పాస్ ఫోటో తో పాటు సభ్యత్వ రుసుము చెల్లించి నమోదు చేయించు కోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సంఘం అధ్యక్షులు తోటకూరి వెంకటేశ్వర రావు, డైరెక్టర్ నోముల సత్యనారాయణ,శీలం సత్యం ,సిఈఓ శివ తెలుగుదేశం మండల అధ్యక్షులు యడవల్లి భాస్కర్ రావు, సీనియర్ నాయకులు పోడియం అప్పారావు, బిజెపి పార్టీ నోముల రామారావు, కన్నారావు మండలంలోని గౌరవ రైతులు పాల్గొనటం జరిగినది

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వరదలపై హై అలర్ట్
- మంత్రి సుభాష్
- లంక గ్రామాల్లో పాఠశాలలకు సెలవు.
- వరదలు నేపథ్యంలో తాత్కాలంగా రేవుల్లో పంట్లు నిలుపుదల
- అధికారులు సూచనలు తప్పనిసరిగా పాటించండి.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొనసాగుతున్న వరద పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం హై అలర్ట్ ప్రకటించిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని పేర్కొంటూ, లోతట్టు ప్రాంతాలు, గోదావరి పరివాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో నిరంతరం చరవాణి ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, వైద్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. లంక గ్రామాల్లో నివసిస్తున్న గర్భిణీ స్త్రీలను వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. గర్భిణీలకు అవసరమైన వైద్య సేవలు, మందులు, అత్యవసర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**లంక గ్రామాల్లో పాఠశాలకు సెలవు.**

విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని లంక గ్రామాల పాఠశాలలకు జిల్లా యంత్రాంగం సెలవులు ప్రకటించిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వరద ప్రాంతాలకు, నది ఒడ్డులకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**వరదల నేపథ్యంలో ఫాంట్లు తాత్కాలికంగా నిలిపివేత.**



వరదల కారణంగా నది పరివాహక ప్రాంతాల్లో పంట్లు (ఫెర్రీలు) రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఫెర్రీ సేవలు పునరుద్ధరించే వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రమే వినియోగించాలని సూచించారు.ఎవరూ వరద నీటిలోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని మంత్రి సుభాష్ హెచ్చరించారు. సెల్ఫీలు, వీడియోల కోసం వరద ప్రవాహాల వద్దకు వెళ్లడం, నీట మునిగిన రహదారులపై ప్రయాణించడం, కాలువలు, వాగులు దాటే ప్రయత్నాలు చేయడం ప్రమాదకరమని తెలిపారు. విద్యుత్ తీగలు, బలహీనమైన గట్లు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**అధికారులు సూచనలు తప్పని సరిగా పాటించాలి.**

ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక అధికారులను సంప్రదించాలని కోరారు.ప్రజల సహకారంతోనే వరదల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని పేర్కొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యులు, పొరుగువారిని కూడా జాగ్రత్తగా ఉండేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 01 ఆగష్టు 2026

## : కూడేరు మండలం ఉదిరిపికొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.. పాఠశాలలో సిసి కెమెరాల ప్రారంభం..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆకాంక్షించారు. శుక్రవారం కూడేరు మండలంలోని ఉదిరిపికొండ గ్రామంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా



జడ్పీ పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపిక కాగా, పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ను పరిశీలించి, చాలా బాగా ఏర్పాటు చేశారని, ల్యాబ్ బాగుందని కితాబిచ్చారు. అనంతరం అక్కడ సిసి కెమెరాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. తదనంతరం పదవ తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో చక్కటి ల్యాబ్ ఉందని, మంచి టీచర్లు ఉన్నారు, బాగా కష్టపడండి, విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఐ.ఎఫ్.పి ప్యానెల్ ఎలా వాడతారు, పిల్లలకి ఏ విధంగా బోధిస్తారు అనేది హెచ్ఎంతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ నాగరాజు, తహసీల్దార్ మోహన్ కుమార్, ఆయా శాఖల మండల అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

### -రియల్ ఎస్టేట్ గొడవలే కారణం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రియల్ ఎస్టేట్ గొడవల కారణంగా జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటనలో ఇద్దరికీ యావజీవ కారాగార శిక్ష విధిస్తూ హిందూపురం అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ వి.వెంకటేశ్వరరావు తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న చిన్న కొండప్ప ను రహమత్ పురంకు చెందిన మహమ్మద్ ముస్తఫా అలియాస్ పఠాన్ ముస్తఫా, పులమితి రియాజ్ ఖాన్ అలియాస్ పౌడర్ రియాజ్ ఖాన్ అలియాస్ పఠాన్ రియాజ్, షేక్ మహమ్మద్ అస్లాంలో కలిసి 2018 జనవరి 23వ తేదీన పట్టణంలోని ధనలక్ష్మి రోడ్డు లో రియల్ ఎస్టేట్ గొడవల కారణంగా పిడుగులు గుద్దడంతో కణత భాగం దెబ్బతిని స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. న్యాయవాది బిర్లాజీరావు కుటుంబానికి సంబంధించిన ఐదు ఎకరాల భూమిని ఎకరా రూ.5 లక్షల చొప్పున ముద్దాయిలు ముగ్గురు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ విషయంలో మధ్యవర్తిగా చిన్న కొండప్ప వ్యవహరించారు. ఇందుకోసం అడ్వాన్స్ కింద ముద్దాయిలు ముగ్గురు రూ.10 వేలు చెల్లించారు. సంబంధిత భూమిని చదును చేసేందుకు ఆ ముగ్గురు రూ.16 వేలు ఖర్చు చేశారు. ఇదిలా ఉండగా బిర్లాజిరా కుటుంబానికి సంబంధించి ఉత్తర భూములను విక్రయించినందుకు గాను చిన్న కొండప్పకు ఆ కుటుంబం ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. దీంతో ముద్దాయిల ముగ్గురు అగ్రిమెంట్ చేసుకున్న భూమి విషయంలో చిన్న కొండప్ప లబ్ధి పొందాడని భావించి, అగ్రిమెంట్ చేసుకున్న భూమి తమకు వద్దని, అడ్వాన్స్ ఇచ్చిన మొత్తం, భూమి చదును చేసేందుకు ఖర్చు చేసిన రూ.16 వేలు చెల్లించాలని పేర్కొని చిన్న కొండప్ప నుండి ద్విచక్ర వాహనాన్ని లాకెళ్ళారు. ఏ విషయమై 2018 జనవరి 23వ తేదీన ధనలక్ష్మి రోడ్డులో ఘర్షణ జరిగి చిన్న కొండప్పపై దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురై ఆయన మృతి చెందారు. ఈ సంఘటనపై అప్పట్లో టూ టౌన్ సిఐ గా ఉన్న తమీమ్ అహమ్మద్ హతుడి భార్య యశోదమ్మ ఫిర్యాదు మేరకు సెక్షన్లు 302, 384, 506 ఆర్/డబ్ల్యు 34 కింద కేసు నమోదు చేశారు. సంబంధిత కేసులో న్యాయమూర్తి 11 మంది సాక్షులను విచారించారు. కేసు విచారణలో ఉన్న సమయంలో మూడవ ముద్దాయి షేక్ మహమ్మద్ అస్లాం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహమ్మద్ ముస్తఫా, కులమతి పులమితి రియాజ్ ఖాన్ లకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున జరిమానా విధించారు. రూ. 40 వేల జరిమానాలో రూ.30 వేలు హతుడి భార్య యశోదమ్మకు నష్టపరిహారంగా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ వాదించారు.

## 1 నుంచి ముదిగుబ్బలో ప్రత్యేక బియ్యం విక్రయాలు

### ప్రభుత్వ ప్రత్యేక కౌంటర్లలో నాణ్యమైన బియ్యం అందుబాటు - డిప్యూటీ తహసీల్దార్ మునిస్వామి



ప్రజాభూమి, ముదిగుబ్బ

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని మరింత అందుబాటు ధరల్లో అందించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు ముదిగుబ్బ మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మునిస్వామి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని మండలంలో అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయమవుతున్న నాణ్యమైన బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకు ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం మార్కెట్లో కిలో రూ.62 ఉండగా, ప్రత్యేక కౌంటర్లలో రూ.52కే అందుబాటులో ఉంటుందని చెప్పారు. అలాగే గ్రేడ్--1 పచ్చిబియ్యం మార్కెట్ ధర కిలో రూ.58 ఉండగా, ప్రభుత్వ ప్రత్యేక కౌంటర్లలో రూ.50కే విక్రయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా కూడా ఈ బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నాణ్యమైన బియ్యం సరసమైన ధరలకు లభించడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ముదిగుబ్బలో కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బియ్యం విక్రయాలు ప్రారంభమవుతాయని మునిస్వామి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేయాలని ఆయన కోరారు.ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, నాణ్యమైన ఆహార ధాన్యాలను అందుబాటులో ఉంచడమే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశమని డిప్యూటీ తహసీల్దార్ మునిస్వామి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయాలు నిర్వహించబడతాయని, ప్రజలు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వకుండా అధికారిక విక్రయ కేంద్రాల నుంచే బియ్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

## అల్లు రామలింగయ్యకు ఘన నివాళి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పద్మశ్రీ అల్లు రామలింగయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.శ అల్లు అర్జున్ అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో అల్లు రామలింగయ్యకు నివాళులర్పించారు. అనంతరం బాబు మాట్లాడుతూ, పద్మశ్రీ అల్లు రామలింగయ్య తెలుగు సినిమా పరిశ్రమంలో విభిన్న పాత్రలు పోషించి ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, ఆయన చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ తో సత్కరించిందని గుర్తు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో హిందూపురం అల్లు అర్జున్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

## పాదయాత్రలు, ఆందోళనలకు సంబంధించి పోస్టర్ విడుదల చేసిన సిపిఐ మండల కార్యదర్శి డి. పెద్దయ్య

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలో నీ ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న "బద్లావ్ జరూరీ హై -- మార్పు కావాలి..!" ఉద్యమంలో భాగంగా నిర్వహించనున్న పాదయాత్రలు, ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి, ఐ, పెద్దయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, భరించలేని ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువులు, ఇంధన ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతిన్నది . సీపీఐ ప్రధానంగా ధరల నియంత్రణ, ప్రతి యువకుడికి ఉపాధి కల్పించడం, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించడం, రైతులకు పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించడం, మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయడం, కార్మికులు, దళితులు, ఆదివాసీల హక్కులను పరిరక్షించడం వంటి డిమాండ్లతో ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్నికలకు ప్రభుత్వ నిధుల (స్టేట్ ఫండింగ్) విధానాన్ని అమలు చేయాలని సీపీఐ పార్టీ ద్వారా డిమాండ్ చేస్తున్నాం . ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 6 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత పాదయాత్రలు, ఆగస్టు 17 నుంచి 28 వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచార ఆందోళనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సెప్టెంబర్ 1, 2026న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ "బద్లావ్ జరూరీ హై" ర్యాలీతో పాటు "చలో ఢిల్లీ" మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతపరమైన విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయి, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం చేపడుతున్న ఈ ఉద్యమాలకు ప్రజలు, యువత, ప్రజాసంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం, ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి, బాలు, డి హెచ్ పి ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు, పెద్దన్న, రాఘవేంద్ర, సుబ్బు, దేవరాజు, రాజు, మహేష్, నారాయణ, పుట్లూరు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

**- : జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436.. - : పురుష ఓటర్లు 8,83,174 మంది.. మహిళా ఓటర్లు 9,07,053 మంది.. ట్రాన్స్ జెండర్లు 209 మంది ఉన్నారు. - : ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉన్నయెడల, క్లైములు అభ్యంతరములు 31.07.2026వ తేదీ నుండి 30.08.2026 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..**

**- : జిల్లా కలెక్టర్ - జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ విడుదల చేశారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి జాబితా ప్రతులను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓలకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్)ను ప్రచురించడం జరిగిందని, ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం ఓటర్లు 17,90,436 మంది ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,83,174 మంది (49.33 శాతం).. మహిళా ఓటర్లు 9,07,053 (50.66 శాతం) మంది.. ట్రాన్స్ జెండర్లు 209 (0.01 శాతం) మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 2,48,087 (12.17 శాతం) మంది ఓటర్లను ఏ.ఎస్.డి.డి కింద తొలగించడం జరిగిందని, వాటిలో ఆచూకీ తెలియని ఓటర్లు 46,276 (2.27 శాతం), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు 79,582 (3.90 శాతం), మరణించిన ఓటర్లు 75,378 (3.70 శాతం), రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు 46,452 (2.28 శాతం), 399 (0.02 శాతం) ఉన్నారన్నారు. ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు ఉన్నయెడల, క్లైములు అభ్యంతరములు 31.07.2026 వ తేదీ నుండి 30.08.2026 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్లు ఎవరైనా ఓటరు జాబితా చూసుకోవాలి అనుకున్న వారు ఆన్లైన్ నందు కానీ, కలెక్టర్ కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయం, ఏఈఆర్ఓ కార్యాలయం మీ సంబందిత బి.ఎల్.ఓ దగ్గర పని వేళలో (10:30 నుంచి 05:00 వరకు) చూసుకొనవచ్చునన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,579 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,17,518 మంది మహిళా ఓటర్లు 1,19,019 మంది ట్రాన్స్ జెండర్లు 42 మంది ఉన్నారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,03,306 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,00,480 మంది మహిళా ఓటర్లు 1,02,801 మంది ట్రాన్స్ జెండర్లు 25 మంది ఉన్నారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,44,853 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,19,335 మంది మహిళా ఓటర్లు 1,25,459 మంది ట్రాన్స్ జెండర్లు 59 మంది ఉన్నారన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,19,095 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,08,157 మంది మహిళా ఓటర్లు 1,10,920 మంది.. ట్రాన్స్ జెండర్లు 18 మంది ఉన్నారన్నారు. సింగనమల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,22,458 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,10,485 మంది మహిళా ఓటర్లు 1,11,945 మంది ట్రాన్స్ జెండర్లు 28 మంది ఉన్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,28,673 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,10,262 మంది.. మహిళా ఓటర్లు 1,18,392 మంది.. ట్రాన్స్ జెండర్లు 19 మంది ఉన్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,10,918 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,04,752 మంది.. మహిళా ఓటర్లు 1,06,157 మంది.. ట్రాన్స్ జెండర్లు 9 మంది ఉన్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,24,554 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,12,185 మంది.. మహిళా ఓటర్లు 1,12,360 మంది.. ట్రాన్స్ జెండర్లు 9 మంది ఉన్నారన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లకు సంబంధించి మొత్తం ఓటర్లు 2,021 మంది ఉన్నారన్నారు. అందులో రాయదుర్గం నియోజకవర్గంలో 65 మంది, ఉరవకొండ నియోజకవర్గంలో 235 మంది, గుంతకల్లు నియోజకవర్గంలో 408 మంది, తాడిపత్రి నియోజకవర్గంలో 207 మంది, సింగనమల నియోజకవర్గంలో 413 మంది, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 170 మంది, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 123 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 400 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు సుజాత, హరిప్రసాద్, కేశవరెడ్డి, నాగేంద్రప్రసాద్, హబీబాఖానం, నాగమణి, సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తులు ప్రైవేటు చేతుల్లో పెట్టడమే జీవో 396!

### పిపిపి మోడల్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు, దస్తా లేఖరుల పాలిట శాపాలు!

### దస్తావేజుల లేఖరుల పోరాటానికి మద్దతు పలికిన వైసిపి రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం నగరంలో రామ్ నగర్ నందు సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్ద శుక్రవారం డాక్యుమెంట్ రైటర్లు సమ్మె చేస్తున్న వారికి మద్దతుగా కె.వి.రమణ మాట్లాడుతూ వైసిపి తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తులను జగన్మోహన్ రెడ్డి స్వాధీనం చేసుకుంటున్నాడని గోబెల్ ప్రచారం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని అన్నారు. ఎన్నికలలో లబ్ధి పొంది నేడు అదే రీ సర్వేను కొనసాగించడంతో పాటు నిజంగానే ప్రజల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంలో భాగంగా జీవో నెంబర్ 396 తీసుకువచ్చి భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రైవేటు ఏజెన్సీలకు పిపిపి పద్ధతిలో అప్పగించడానికి పూనుకొని లక్షల మంది దస్తా లేఖరుల కుటుంబాలను బజారు పాలు చేస్తున్నారు. జీవో 396 భవిష్యత్తులో సబ్ రిజిస్ట్రార్ల వ్యవస్థను నాశనం చేసి, ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోవడమే కాకుండా లక్షల కుటుంబాలను ప్రమాదం తెచ్చి పెడుతుందన్నారు. కొన్ని వ్యవస్థలు తప్పకుండా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, అప్పుడే ప్రజలకు జీవించే హక్కు, భద్రత ఉంటుందని బ్రిటిష్ వారే భావించారన్నారు. కానీ స్వాతంత్ర్యానంతరం మన పాలకులు, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన వ్యవస్థలన్నింటినీ ప్రైవేటుకు అప్పగించి, భ్రష్టు పట్టించి మానవ మనుగడకే ప్రమాదాన్ని తెచ్చి, మానవత్వం లేని పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ల వ్యవస్థలో ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దడానికి ప్రభుత్వం బాధ్యతగా ఉంటుంది, అదే ప్రైవేటు ఏజెన్సీలు చేసే పొరపాట్లకు ఎవరు బాధ్యులు? ప్రజల హక్కులకు, ఆస్తులకు గ్యారెంటీ ఏమిటి? కొన్ని డిపార్ట్మెంట్లు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. అటువంటి వాటిలో పోలీసు, రెవెన్యూ, మరియు నిత్యం ప్రజా జీవితంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సబ్ రిజిస్ట్రార్ వ్యవస్థ కూడా ఒకటి అని, అలాంటి కీలకమైన డిపార్ట్మెంట్ ను ప్రైవేటుపరం చేయడం అంటే ప్రజల ఆస్తులను ప్రైవేటుకు అప్పగించడమే అని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 396 వెంటనే ఉపసంహరించుకొని, సబ్ రిజిస్ట్రార్ వ్యవస్థను కొనసాగించాలన్నారు. దస్తా లేఖరులు చేస్తున్న ఈ పోరాటం కేవలం వారి కోసమే కాదు, ఆ వ్యవస్థను కాపాడడం కోసమని భావించి, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి, ఈ వ్యవస్థను ప్రభుత్వ ఆధీనంలో ఉండేటట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. తద్వారా వ్యవస్థను కాపాడడంతో పాటు లక్షలాదిమంది దస్తాలేఖరుల జీవితాలను కాపాడిన వారవౌతాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తాలేఖరులు బి కె ఎస్ వేణు, కరణం చంద్రశేఖర రావు, ప్రభాకర్, అనుగుంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండాలి..

### - : మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా "నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం




భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్, అనంతపురం నగరంలోని ఎస్ఎస్బీఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం "నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" జిల్లా స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్ టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జి. మమతా, జిల్లా యువజన అధికారి ఐశయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు డి.భరత్, ఎస్ఎస్బీఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా సరిత, నిగమా ఫౌండేషన్ కో-ఫౌండర్ వసుంధర, మై భారత్ కోఆర్డినేటర్ బిసాతి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కె.జయమారుతి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. భార్గవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, మాదకద్రావ్యాల వినియోగం యువత ఆరోగ్యం, కుటుంబం, సమాజం దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి యువకుడు మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే "నషా ముక్త్ భారత్ -- వికసిత్ భారత్" లక్ష్య సాధనలో భాగంగా ప్రజల్లో మాదక ద్రావ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అతిథులు, యువతతో కలిసి "నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని యువత కోసం డిక్లమేషన్, కథా రచన, స్లోగన్ రచన, చిత్రలేఖనం, జానపద నృత్యాలు, జానపద గేయాలు, నూక్కడ్ నాటకాలు, షార్ట్ స్టోరీ తదితర పోటీలు నిర్వహించగా, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన యువతకు బహుమతులు ప్రదానం చేయగా, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు విష్ణుప్రియ, వీరేంద్ర, నాగభూషణ్, నాగశుభ, ప్రగతి పదం యూత్ అసోసియేషన్ సభ్యులు సాయి కార్తిక్, అంబరీష్, రాము, అలాగే మై భారత్ వాలంటీర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఏపీ పీ గోపాలకృష్ణకు ఉత్తమ ప్రశంసాపత్రం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేస్తున్న అనంత గోపాలకృష్ణ ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు, హిందూపురం రూరల్ స్టేషన్ కు చెందిన రెండు ప్రధాన కేసులకు సంబంధించి ముద్దాయిలకు శిక్ష పడటంలో బలమైన వాదనలు వినిపించిన అనంత గోపాలకృష్ణను ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ అంకిత సురాన అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. గోపాలకృష్ణ ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల న్యాయవాదులు అభినందించారు.

# ప్రజల సంక్షేమాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - ప్రజల వద్దకు ప్రభుత్వం -- ప్రతి ఇంటికి సంక్షేమం - టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

ప్రజల సంక్షేమం, అభివృద్ధే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని పుల్లయ తోటలో టిడిపి నాయకుడు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజల వద్దకు ప్రభుత్వం -- ప్రతి ఇంటికి సంక్షేమం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవి





ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే) మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. అనంతరం టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ పీవీ రమణ, నాయకులు బాలస్వామి రెడ్డి, సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, సింగారెడ్డి రజనీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, గంగాధర్ రెడ్డి, శివయ్య, దక్కా రమేష్, యుగంధర్, అహ్మద్ అలీ, మడక శ్రీనివాసులు, గంగాధర్, భాష పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ నారీ శక్తి పథకంతో ఆర్కే వ్యాలీ విద్యార్థులకు ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణ

### - ప్రతిభ ఆధారంగా 25 మంది విద్యార్థుల ఎంపిక



ప్రజాభూమి, వేంపల్లె

ఆర్జీయూకేటీ నారీ శక్తి పథకం కింద నిర్వహించిన అభిరామ్ సివిల్ సర్వీసెస్ అకాడమీ ఎంపిక పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఆర్కే వ్యాలీ విద్యార్థుల్లో 25 మంది ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లోని అభిరామ్ సివిల్ సర్వీసెస్ అకాడమీలో రెండేళ్లపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. గత ఏప్రిల్‌లో ఆర్కే వ్యాలీ ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగం సమన్వయకర్త డా. డి. కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆర్కే వ్యాలీ డైరెక్టర్, ప్రొఫెసర్ విజయ ప్రకాష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కృషి, పట్టుదలతో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమై ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులు, ముఖ్యంగా యువతులు, సివిల్ సర్వీసుల్లో రాణించేలా నాణ్యమైన శిక్షణ అందించడమే నారీ శక్తి పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో డా. పి.రవికుమార్, డీన్ అకాడమీక్ రమేష్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

## లింగాలలో ఉత్సాహంగా ఇంటింటికి తెలుగుదేశం

ప్రజాభూమి లింగాల



మండల కేంద్రంలో గురువారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఉత్సాహభ రిత వాతావరణంలో సాగింది. లింగాల మండల టీడీపీ అధ్యక్షులు యమ్మనూరు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, మండల పార్టీ నాయకులు సారెడ్డి గంగాధర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ, గడచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల లబ్ధి గురించి, వాటివల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలు ప్రభుత్వ పాలనపై, సంక్షేమ ఫలాల అందజేతపై హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో తమ గ్రామ పరిధిలోని పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్దెల రామకృష్ణారెడ్డితో పాటు స్థానిక నాయకులు తిరుపాల్ రెడ్డి, మహేష్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రామదాసు, మహబూబ్ బాషా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు లీలావతి నాగిరెడ్డి స్మారక వృద్ధాశ్రమం లో రక్తదాన శిబిరం

### ఘనంగా 17వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాభూమి పులివెందుల



లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి నాగిరెడ్డి స్మారక వృద్ధాశ్రమం అల్లుడు వార్షికోత్సవ వేడుకలు ఘనంగానే నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు మూలి కిరణ్ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ పులివెందుల జనరల్ ఆసుపత్రి వారి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్తదానం చేసేవారు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వృద్ధాశ్రమంలో ఎంతోమంది సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 17వ సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ వార్షికోత్సవం వేడుకలు లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## సర్ 2026 పులివెందుల ముసాయిదా ఓటరు జాబితా విడుదల - 2,00,531 మంది ఓటర్లు



ప్రజాభూమి,పులివెందుల

భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సవరణ కార్యక్రమం సర్ --2026 షెడ్యూల్ ప్రకారం 129 -- పులివెందుల శాసనసభ నియోజకవర్గం ముసాయిదా ఓటరు జాబితా గురువారం ప్రచురించబడింది.ఈ నియోజకవర్గంలో మొత్తం 309 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 2,00,531 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 98,030 మంది,మహిళలు 1,02,488 మంది,ఇతరులు 13 మంది ఉన్నారు.ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం ఈఆర్వో కార్యాలయం, కార్యాలయాలు,బి ఎల్ ఓ ల ద్వారా అన్ని 309 పోలింగ్ కేంద్రాలలో, అలాగే భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు.ఓటర్లు తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఈఆర్వో కోరారు. కొత్తగా పేరు చేర్పు, తొలగింపు, లేదా వివరాల్లో సవరణల కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఈ ఆర్ ఓ , ఏ ఈ ఆర్ ఓ లేదా బి ఎల్ ఓ లకు నిర్ణీత దరఖాస్తు ఫారాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఖచ్చితమైన, నవీకరించబడిన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి అర్హత గల పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి విజ్ఞప్తి చేశారు.

## జ్యోతి గ్రామంలో అపరిశుభ్రత.. భక్తులు, గ్రామస్తుల ఆందోళన

### - త్రాగునీటి ట్యాంక్ వద్ద మురుగునీరు

### - చెత్త తొలగింపు, బ్లీచింగ్ చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి హామీ



ప్రజాభూమి, సిద్ధవటం: శ్రీశైల క్షేత్రానికి దక్షిణ ముఖ ద్వారమైన సిద్ధవటం మండలం జ్యోతి గ్రామంలో అపరిశుభ్రత తీవ్రంగా పెరిగి భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్రాగునీటి ట్యాంకు సమీపంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోందని, త్రాగునీటిలో మలినాలు చేరుతున్నాయని స్థానికులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని పలు రహదారులపై చెత్త పేరుకుపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, శివయ్య దర్శనానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్ వాహనం పనిచేయకపోవడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. ఈ విషయమై జ్యోతి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసును వివరణ కోరగా, త్రాగునీటి ట్యాంకు పరిసరాల్లోని అపరిశుభ్రతను వెంటనే తొలగించి, గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడతామని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ వాహనం మరమ్మతులో ఉందని, హరిత రాయబారుల ద్వారా చెత్త తొలగించి బ్లీచింగ్ పిచికారీ నిర్వహించి గ్రామస్తులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి,పులివెందుల

మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ రూరల్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33 కేవీ లైన్స్ మరమ్మతు కార్యక్రమం వున్నందున ,ఈ కొత్తపల్లి , మల్లికార్జునపురం నల్లగొండ వారి పల్లి,కణంపల్లి , మోతునూతల పల్లి, మల్లికార్జునపురం, చంద్రగిరి, కె వేలమవారిపల్లి , వెంకటాపురం గ్రామాలకు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సప్లై లో అంతరాయం కలగనుందని, కావున దయచేసి ప్రజలు రైతులందరూ విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు

## లింగాల గ్రామంలో శుక్రవారం - శుభ్రవారం కార్యక్రమం దోమల లార్వా నిర్మూలనపై అవగాహన

ప్రజాభూమి లింగాల



పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణే ధ్యేయంగా శుక్రవారం లింగాల గ్రామంలోని జయమ్మ కాలనీలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రసన్న కుమార్ ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి నీటి నిల్వ పాత్రలను పరిశీలించారు.నీటి నిల్వల ద్వారా దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని, కావున వారానికి ఒకసారి నీటి పాత్రలను శుభ్రం చేసుకుని ఆరబెట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే నీటిలో దోమల పిల్లలను గుర్తించి, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం, చిన్నపిల్లల రోగనిరోధక టీకాల పురోగతిని పరిశీలించారు. స్థానిక ఆరోగ్య కార్యకర్త ద్వారా యు-విన్ జాతీయ (యాప్) తెరిపించి, పిల్లల టీకా వివరాలను అక్కడికక్కడే సరిచూశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య , ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వై.యస్. ఆనంద రెడ్డికి రెడ్యం సోదరుల సంతాపం



ప్రజాభూమి,పులివెందుల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పెద్దనాన్న వైయస్ ఆనంద రెడ్డి(87) అనారోగ్యంతో గురువారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైయస్సార్ సిపి నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిలు శుక్రవారం మధ్యాహ్నం పులివెందులలోని వారి స్వగృహంలో వైఎస్ ఆనందరెడ్డి మృతదేహంపై పూలమాలవేసి, ప్రగాడ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తపరిచారు. వై.యస్ కుటుంబ సభ్యులను రెడ్యం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.వై.యస్ ఆనంద రెడ్డి కుటుంబానికి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ధైర్యాన్ని, మనోనిబ్బరాన్ని ఇవ్వాలని ప్రార్థించినట్లు రెడ్యం తెలిపారు.

## ప్రజల్లో వైసిపి విశ్వసనీయత కోల్పోయింది

### - గత సార్వత్రిక ఎన్నికలే నిదర్శనం

### - టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్

ప్రజాభూమి, వేంపల్లె



ప్రజల్లో వైసిపి విశ్వసనీయత కోల్పోయిందని, గత సార్వత్రిక ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. గ్రామాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. ఇంటింటికీ టిడిపి కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల సానుకూల స్పందన వ్యక్తమవుతోందని పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ పేర్కొన్నారు.

## పోరుమామిళ్లలో టైక్వాండో పోటీలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కడప జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు డిసెంబర్ రెండో తేదీన పోరుమామిళ్లలోని చిత్త గ్రాండ్ ఫోర్ట్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించబడుతున్నట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. ఈ పోటీలు సబ్ జూనియర్ క్యాడియట్. జూనియర్ మరియు సీనియర్ విభాగంలో నిర్వహించబడతాయి ఈ పోటీలు న్యూ ఆంధ్ర ప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగును జిల్లాలోని టైక్వాండో అకాడమీ లకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు అని తెలిపారు ఈ పోటీలలో పాల్గొను క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం మరియు ఆధార్ కార్డు ఫోటోతో హాజరు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా టైక్వాండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి జిల్లా సెక్రెటరీ నాయబ్ రసూల్ మరియు సీనియర్ క్రీడాకారులు నరసింహ ప్రసాద్, ఉస్మాన్ , వెంకటసుబ్బయ్య మరియు ఆంజనేయులు పాల్గొన్నారు.

## సగిలేరు గురుకుల ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన గురుకుల పాఠశాల సిబ్బంది.

ప్రజాభూమి పోరుమామిళ్ల :




ఈనెల 28వ తారీఖున న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ భవన్లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొల్లు రామమోహన్ కు జాతీయ విశేష ప్రతిభ వాగ్దేవి పురస్కారాన్ని భూగర్భ గనుల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, పలువురు పార్లమెంటు సభ్యులు అందజేశారు. అందుకుగాను ప్రిన్సిపాల్ కే సుబ్బయ్య, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు అధ్యాపకేతర బృందం ఘనంగా సన్మానించారు.

## అమరలింగేశ్వర స్వామి సన్నిధిలో నవగ్రహ ప్రతిష్ఠ 41వ రోజు విశేష పూజలు

### - పంచామృత అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహణ..

ప్రజాభూమి, సిద్ధవటం:



మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరి సమేత శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించిన నవగ్రహాల ప్రతిష్ఠకు 41 రోజులు పూర్తైన సందర్భంగా శుక్రవారం విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహాలకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించగా, గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లతో పాటు నవగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి.

## దగ్గు, ఆయాసం ఉంటే వెంటనే కఫ పరీక్షలు చేయించుకోండి: డాక్టర్ రంగలక్ష్మి

ప్రజాభూమి, సిద్ధవటం: రెండు వారాలకు పైగా దగ్గు, ఆయాసం, అలసటతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కఫ (స్పుటం) పరీక్షలు చేయించుకోవాలని పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గృహాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించి చికిత్స పొందాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.



## వైయస్ ఆనందరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ సీఎం వైయస్ జగన్

ప్రజాభూమి,పులివెందుల



మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పెదనాన్న వైయస్ ఆనందరెడ్డి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్ జగన్ శుక్రవారం ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైయస్ ప్రకాష్ రెడ్డి,ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి,దుష్యంత్ రెడ్డి ఉన్నారు..ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైయస్ ఆనందరెడ్డి లేని లోటు కుటుంబ సభ్యులందరికీ తీవ్ర బాధ కలిగిస్తుందన్నారు. ఆయన మాకు పెద్దదిక్కుగా ఉండేవారని, ఆయన మరణం మా అందరి హృదయాల్లో నిలిచిపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబకపల్లె బాబురెడ్డి,మాజీ చైర్మన్ వరప్రసాద్ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్ ఆనందరెడ్డి నేత్రదానం - ఇద్దరు అంధులకు చూపు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ వైయస్ ఆనందరెడ్డి(87) హఠాన్మరణం చెందారు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. కుమారులు వైయస్ రాజేష్ రెడ్డి, కుమార్తెలు సునీత, సాధనల నిర్ణయంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో రెండు కార్నియాలను సేకరించారు.సేకరించిన కార్నియాలను వైసీపీ మునిసిపల్ ఇన్‌చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి,మాజీ చైర్‌పర్సన్ వైయస్ ప్రమీలమ్మ హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. వీటి ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించనుంది.ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ నేత్రదానం అత్యున్నత మానవతా సేవ అని, ప్రతి ఒక్కరూ నేత్రదానం పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు.

## సావిత్రమ్మ ఆరోపణలు అవాస్తవాలు- జె.సిద్ధరామయ్య

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి శివ జ్యోతి నగర్ కు చెందిన ఆర్ సావిత్రమ్మ నా మీద,వి.జగన్నాథం పై చేసిన ఆరోపణలు అవాస్తవని, మూడు కోట్ల డబ్బులు నా కూతురు అకౌంటు లోను,ముని లక్ష్మి అకౌంట్ టు లోను వేశామని ఆమె చేసిన రూపణలు అవాస్తవమని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సిద్ధరామయ్య అన్నారు.గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సావిత్రమ్మ మా పైన చేసిన ఆరోపణలు మూడు రోజులలోపు నిరూపించకపోతే ఆమె పైన పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. మా వెనక రాజకీయ నాయకులు ఉన్నారని ఆమె చేసిన ఆరోపణలు నిరూపించగలదా అని,నిజంగా మా వెనక రాజకీయ నాయకులు ఉంటే పేర్లు ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.చెక్కు విషయంలో చెక్కు నీది కాదు,బాకీ నీది కాదు, అని,వేరే వారికి మాకు జరుగుతున్న లావాదేవీల విషయంలో నీకు సంబంధం ఏంటి అని ప్రశ్నించారు. నారాయణ చనిపోవడంతో అతనికి ఇవ్వవలసిన ఏడు లక్షల 50 వేల రూపాయలు మాత్రమే అని, పెద్దమనుషులు పోలీసుల సమక్షంలో తేలినదని, చనిపోయారన్న దయా హృదయంతో పది లక్షల రూపాయలు ఇచ్చేందుకు సిద్ధపడి ఆ డబ్బు కూడా కే శంకర్రెడ్డి,తండ్రి మునుస్వామి రెడ్డి కి భూములు అమ్మిన తర్వాతనే ఆ డబ్బులు నారాయణరెడ్డి భార్యకు డాక్యుమెంట్లు చెక్కును ఇచ్చమన్నారు. సావిత్రమ్మపై దాడి చేయడానికి,ఆమె బండిని ధ్వంసం చేయడానికి మాకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. శివారెడ్డి కి మా వల్ల నష్టం జరగలేదని ఐదు లక్షల రూపాయల డాక్యుమెంటు తిరిగి ఇచ్చి డబ్బు తెచ్చుకోమని పంపించామని, శివారెడ్డి సావిత్రమ్మ కుమ్మక్కై జగన్నాథంకు ఇవ్వాల్సిన లక్ష రూపాయలు కూడా ఇవ్వకుండా నాకు సాక్షులుగా ఉన్న వ్యక్తులపైనే ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోర్టుకు వెళ్లారని ఆరోపించారు. ఆటో నడుపుకున్న వ్యక్తికి కోర్టుకు వెళ్లే శక్తి లేదనడం ఆశాస్పదమన్నారు.శివారెడ్డికి కొర్లగుంట లో ఇల్లు,కట్టకింద పల్లిలో ప్లాటు,మాధవ నగర్ లో ఇల్లు బాడుగకు ఇచ్చినారని, తుమ్మలగుంట లో ప్లాటు ఉందని, అన్నీ కలిపితే సుమారు రెండు కోట్ల పైనే శివారెడ్డికి ఆస్తులు ఉన్నాయని ఆరోపించారు.పది రూపాయల వడ్డీతో కార్లు,బాండ్లు పెట్టుకొని ప్రతినిత్యం వ్యాపారం చేసుకుంటున్నామని,ఆస్తులన్నీ నీ భార్య కొడుకు పేరుతో ఉన్నవి నిజము కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఈ రాజగోపాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## చంద్రగిరి బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో వెంటనే పునర్నిర్మించాలి: కాంగ్రెస్ పార్టీ డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి



చంద్రగిరి బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన బస్టాండ్‌ను ప్రభుత్వం అత్యవసరంగా నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో శుక్రవారం చంద్రగిరి బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ కారణంగా ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఈ బస్టాండ్‌ను వెంటనే కూల్చివేసి, ఆధునిక వసతులు, విశాలమైన వేచిచోటు, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు వంటి అన్ని మౌలిక వసతులతో నూతన బస్టాండ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి. రమేష్ బాబు, తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాలగురుమ్ బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తలపా దామోదర్ రెడ్డి హాజరై నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చంద్రగిరి బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల జరిమానాతో పాటు సామాజిక సేవ...

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట



మద్యం మత్తులో కారు నడిపిన యువకుడికి 4 రోజులు బస్టాండ్, స్కూల్ శుభ్రం చేసే శిక్ష: రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర. మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ మండలం, గుడ్డంపల్లి తండాకు చెందిన ఎం. అశోక్ నాయక్ (26) అనే యువకుడు మద్యం సేవించి కారు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడటంతో, అతడిపై మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185 కింద కేసు నమోదు (పెట్టీ కేసు నెం. 3393/2026, ఎస్.టి.సి. నెం. 3213/2026) చేసి తిరుపతిలోని ×× స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు ముందు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో మాన్య న్యాయస్థానం రూ. 10,000/- జరిమానాతో పాటు భారతీయ నాగరిక సురక్షా సంహిత (దీమీూ) సెక్షన్ 23 ప్రకారం జూలై 31 నుండి ఆగస్టు 04 వరకు (మొత్తం 04 రోజులు) రేణిగుంట ఆర్‌టీసీ బస్ స్టేషన్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రా ఎఅస్త్రష్ట్ర రాఎష్ట్రశీశీశ్రీ) ప్రాంగణాలు, పరిసర ప్రాంతాలను శుభ్రపరచే సామాజిక సేవ చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ సేవా కాలంలో నిందితుడు రేణిగుంట ఎస్హెచ్‌ఓ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, అప్పగించిన పనిని పూర్తి చేసినట్లు ఫోటోలతో కూడిన నివేదికను ఆగస్టు 5న కోర్టుకు సమర్పిస్తామని, ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ జయచంద్ర స్పష్టం చేశారు.

## రేణిగుంటలో బిస్మిల్లా నగర్,పార్కును సందర్శించిన ఎంపీడీవో రవిచంద్ర, పట్టణాధ్యక్షుడు, మా భాష.

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట బిస్మిల్లా పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలి: ఎంపీడీవో రవిచంద్ర అన్నారు. రేణిగుంట, జూలై 31: రేణిగుంట పట్టణంలోని బిస్మిల్లా పార్కును శుక్రవారం ఎంపీడీవో రవిచంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. పార్కు అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు పలు చోట్ల మౌలిక సదుపాయాల కొరత కనిపించడంపై ఎంపీడీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్కును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలనిసంబంత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్కులో నడక మార్గాలు, చిన్నారుల ఆట వస్తువులు, బెంచీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు వంటి సౌకర్యాలను కల్పించి అందమైన ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజలు కుటుంబ సభ్యులతో వచ్చి ఆహ్లాదకరంగా గడిపేలా పార్కును తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీవో రవిచంద్ర, ఈవో శ్రీధర్, వీఆర్వో భాస్కర్, వెంకటేష్, సుబ్బరాయుడు,తదితరులు పాల్గొన్నారు...

## అనకవోలులో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు.

పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామంలో సోమవారం సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు.



ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 23 వినతులు అందాయి. వాటిలో ఎంపీడీవో నుంచి 11, తాసిల్దార్ నుంచి 4, ఎంఈఓ నుంచి 2, వ్యవసాయ శాఖ ఏఈ దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ ఏఈ, గృహనిర్మాణ శాఖ ఏఈ, పంచాయతీరాజ్ డి ఈ, నీటిపారుదల శాఖల నుంచి ఒక్కొక్క వినతి వచ్చాయి. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యత అని ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

## జూలై నెలలో పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులకు జిల్లా పోలీసుల ఘన సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు



చిత్తూరు జిల్లా పోలీసు శాఖలో జూలై నెలలో పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, విలువైన బహుమతులు అందజేసి వారి సేవలను కొనియాడారు. నాన్ కేడర్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఆర్. రాజశేఖర రాజు మాట్లాడుతూ, దాదాపు 39 సంవత్సరాల పాటు నిబద్ధతతో పోలీసు శాఖకు సేవలందించిన అధికారులు అందరికీ ఆదర్శప్రాయులని ప్రశంసించారు. కుటుంబానికి దూరంగా ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో జీవితం గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా పోలీసు శాఖ వారి వెంటే ఉంటుందని తెలిపారు. ఏ.ఆర్. అడిషనల్ ఎస్పీ దేవదాస్ మాట్లాడుతూ, పోలీసు సేవలు సవాళ్లతో కూడుకున్నవైనా వాటిని విజయవంతంగా పూర్తి చేసిన అధికారుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. సమాజానికి అందించిన సేవలకు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలుపుతూ, మిగిలిన జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ శ్రీమతి ఎస్. షాను మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన అధికారులు అందరికీ ఆదర్శమని కొనియాడారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు అవకాశాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా సన్మానం అందుకున్న అధికారులు మాట్లాడుతూ, పోలీసు శాఖ తమకు అందించిన ఆత్మీయ వీడ్కోలు జీవితాంతం మరువలేని అనుభూతిగా నిలుస్తుందని, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహచరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఆర్.ఐ చంద్రశేఖర్, పోలీస్ కార్యాలయ ఏ.ఓ.నాగభూషణమ్మ, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నైపుణ్యాభివృద్ధికి ప్రాంతీయ అకాడమిక్ సదస్సు

### ప్రతి వైద్యుడు పాల్గొని విజయవంతం చేయాలి -ఐఎంఏ అధ్యక్షుడు డా. ఏ.ఆర్. రెడ్డి, కోశాధికారి రెడ్డప్ప

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



భారత వైద్య సంఘం (ఐఎంఏ) తిరుపతి శాఖ ఆధ్వర్యంలో జోన్--3 ప్రాంతీయ అకాడమిక్ సదస్సు (రీజినల్ అకాడమిక్ కాన్ఫరెన్స్)ను ఆగస్టు 2వ తేదీన తిరుపతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ తిరుపతి అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి, కోశాధికారి రెడ్డప్ప తెలిపారు. ఈ సదస్సును రాష్ట్రంలోని వైద్యుల విజ్ఞాన వికాసానికి, నూతన వైద్య పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి ఒక గొప్ప వేదికగా అభివర్ణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య రంగంలో ప్రతి రోజూ కొత్త సాంకేతికత, కొత్త చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయని, అలాంటి మార్పులకు అనుగుణంగా వైద్యులు తమ పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవడం అత్యంత అవసరమన్నారు. వైద్యుల వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి అకాడమిక్ సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ప్రాంతీయ సదస్సులో దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులు, వివిధ ప్రత్యేక విభాగాలకు చెందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొని ఆధునిక వైద్య విధానాలు, అత్యవసర వైద్య సేవలు, తాజా చికిత్సా విధానాలు, క్లిష్టమైన వ్యాధుల నిర్ధారణ, నిర్వహణ, రోగి భద్రత, వైద్య నైతిక విలువలు వంటి పలు అంశాలపై శాస్త్రీయ ప్రసంగాలు చేయనున్నారని వెల్లడించారు. నిత్య వైద్య సేవల్లో ఎదురయ్యే సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను నిపుణుల ద్వారా తెలుసుకునే అవకాశం వైద్యులకు లభిస్తుందన్నారు.

అంతేకాకుండా, ఈ సదస్సులో నిర్వహించే పరస్పర చర్చలు, ప్రశ్నోత్తర కార్యక్రమాలు, అనుభవాల పంచుకోలు ద్వారా యువ వైద్యులు సీనియర్ వైద్యుల అనుభవాన్ని తెలుసుకుని తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వైద్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అనుబంధాలను బలోపేతం చేయడంలో కూడా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తిరుపతి వంటి ఆధ్యాత్మిక నగరంలో ఈ సదస్సు నిర్వహించడం ఎంతో ప్రత్యేకమని పేర్కొంటూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో సేవాభావం, అంకితభావం, మానవతా దృక్పథంతో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ సమావేశం స్ఫూర్తినిస్తుందని చెప్పారు. సదస్సులో శాస్త్రీయ సమావేశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, స్నేహ సమ్మేళనం, గాలా విందు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవి వైద్యుల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఒకరినొకరు తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. "ప్రతిభ పుట్టుకతో రాదు... నిరంతర సాధన, అంకితభావం, క్రమశిక్షణతోనే సాధ్యమవుతుంది. ప్రతి వైద్యుడు జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. కొత్త విషయాలను తెలుసుకోవడం, అవసరమైతే పాత విధానాలను సమీక్షించుకోవడం, ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని స్వీకరించడం వైద్య వృత్తిలో అత్యంత అవసరం" అని డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి అన్నారు. భారత వైద్య సంఘమే వైద్యుల ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ, రాష్ట్రంలోని జోన్--3 పరిధిలోని ప్రతి వైద్యుడు ఈ సదస్సుకు హాజరై జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐఎంఏ తిరుపతి కోశాధికారి రెడ్డప్ప మాట్లాడుతూ, ఈ సదస్సు విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వైద్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నూతన వైద్య పరిజ్ఞానాన్ని తెలుసుకోవడంతో పాటు సహచర వైద్యులతో అనుభవాలను పంచుకోవాలని కోరారు. ఈ ప్రాంతీయ అకాడమిక్ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లోనే ఆదర్శవంతమైన వైద్య సదస్సుగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 2వ తేదీన ఉదయం ప్రారంభమయ్యే ఈ సదస్సులో ప్రారంభోత్సవ కార్యక్రమం, శాస్త్రీయ సదస్సులు, నిపుణుల ఉపన్యాసాలు, పరస్పర చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం గాలా విందు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచకపోతే ప్రభుత్వానికి భంగపాటే: సీఐటీయూ హెచ్చరిక

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, వివోఏలకు కనీస వేతనం రూ.26 వేలుగా పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ, విజనరీ పాలన అంటూ ముందుకు వెళ్తున్నామని చెబుతున్న ప్రభుత్వం స్కీమ్ వర్కర్ల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పసిబిడ్డల నుంచి పాఠశాల విద్యార్థుల వరకు సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న స్కీమ్ వర్కర్లకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలతో జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంగన్వాడీలు, ఆశా కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. వాణిశ్రీ, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ, వివోఏ యూనియన్ నాయకురాలు సునీత మాట్లాడుతూ, పదేళ్లుగా జీతాల పెంపు కోసం పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడి, నవచేతన యాప్ వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యాలు కూడా లేకుండా పనిచేయాల్సి వస్తోందని అన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు జి. బాలసుబ్రమణ్యం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని మార్చే శక్తి తమకు ఉందని హెచ్చరించారు. ముట్టడి అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ నాయకులు, ప్రజానాట్యమండలి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ట్రాఫిక్ చైతన్యం పెంపొందించిన ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్

### టీ.పీ.పీ.ఎం. హైస్కూల్లో హెల్మెట్, ట్రాఫిక్ నిబంధనలు, స్వీయ రక్షణపై అవగాహన.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



విద్యార్థుల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపొందించే లక్ష్యంతో తిరుపతిలోని టీ.పీ.పీ.ఎం. హైస్కూల్లో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎ. సంజీవ్ కుమార్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సీఐ ఎ. సంజీవ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని, జీబ్రా క్రాసింగ్ ద్వారానే రోడ్లు దాటాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలను అలవాటు చేసుకుంటే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడంతో పాటు రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చని వివరించారు. విద్యార్థినులకు స్వీయ రక్షణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించిన ఆయన, అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించడం, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండడం, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అవసరమైతే వెంటనే పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ, మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

# నాయుడుపేట పోలీసుల చొరవతో మైనర్ బాలిక సురక్షితం

- అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు
- బాలల భద్రతే లక్ష్యం.. మరోసారి అప్రమత్తత చాటిన నాయుడుపేట పోలీసులు
- సకాలంలో స్పందించి బాలికను రక్షించిన పోలీసు శాఖ
- అపరిచితుల మాయమాటలు నమ్మవద్దని ప్రజలకు పోలీసుల హెచ్చరిక.

ప్రజా భూమి ప్రతినిధి (నాయుడుపేట). తిరుపతి జిల్లా నాయుడుపేటలో పోలీసుల అప్రమత్తతతో అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న ఓ మైనర్ బాలిక సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేరింది. బాలల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న పోలీసు శాఖ మరోసారి తమ బాధ్యతాయుత విధి నిర్వహణను చాటిచెప్పింది. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు బాలల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి నాయుడుపేట బస్టాండ్ వద్ద రాత్రి ఎన్‌ఆర్‌ఓ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఒంటరిగా సంచరిస్తున్న సుమారు 15 సంవత్సరాల మైనర్ బాలికను గుర్తించి విచారించారు. విచారణలో బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన తర్వాత ప్రస్తుతం తన అమ్మమ్మ వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తున్నట్లు తెలిపింది. శ్రీకాళహస్తికి చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడటంతో అతని



పిలుపు మేరకు అక్కడికి వెళ్లేందుకు బయలుదేరినట్లు వెల్లడించింది. అయితే తాను ప్రయాణిస్తున్న బస్సు శ్రీకాళహస్తి పట్టణంలోకి కాకుండా బైపాస్ మార్గంలో వెళ్తుండటంతో నాయుడుపేట బస్టాండ్ వద్ద దిగినట్లు వివరించింది. బాలిక పరిస్థితి అనుమానాస్పదంగా ఉండటంతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ఆమెను వెంటనే నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం డీఎస్పీ ఆదేశాల మేరకు బాలిక తల్లికి సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. తల్లి సమక్షంలో బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి, అపరిచితుల మాయమాటలు నమ్మడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికను క్షేమంగా ఆమె తల్లి సంరక్షణకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల ద్వారా పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులను నమ్మి మైనర్ బాలలు, బాలికలు ఇంటి నుంచి వెళ్లకుండా తగిన అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితుల్లో బాలలు కనిపించినా లేదా వారికి సహాయం అవసరమని గమనించిన వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తత, తల్లిదండ్రుల పర్యవేక్షణ, పోలీసుల సకాల స్పందనతోనే బాలల భద్రతను మరింత సమర్థవంతంగా కాపాడగలమని ఎస్పీ పేర్కొన్నారు.

# ఆఫీసు సభార్డినేట్ శ్రీనివాసులు సేవలు అమూల్యం

### - పదవి విరమణ మహోత్సవంలో జడ్పీటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీసు సభార్డినేట్గా పనిచేస్తూ పదవి విరమణ చేసిన శ్రీనివాసులు సేవలు అమూల్యమని స్థానిక జడ్పీటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి అధ్యక్షత,ఎంపీడీవో వెంకటేశులు ఆధ్వర్యంలో పదవి విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎల్పిఓ రెడ్డప్ప,ఎంఈఓ రవి,మండల పరిషత్ పరిపాలనాధికారి త్రివిక్రమరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి నిర్దిష్ట వయసు రాగానే పదవి విరమణ తప్పనిసరి అన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత 35 సంవత్సరాలు పాటు సేవలందించిన ఆఫీసు సభార్డినేట్ శ్రీనివాసులు అంకిత భావం ఏ పాటిదో తెలుసుకోవచ్చునన్నారు. సభార్డినేట్ శ్రీనివాసులు



శేష జీవితం సుఖ సంతోషాలతో కొనసాగాలని తన భర్త ఇంటికి వచ్చినా కూడా అధికారులు సుశీల్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇస్తున్న సూచనలు కూడా పరిగణలోకి తీసుకొని కార్యాలయంలో విధులను కూడా నిబద్ధతతో పనిచేశారన్నారు. డిఎల్పిఓ చిన్న రెడ్డప్ప మాట్లాడుతూ తాను ఇక్కడ ఎంపీడీవోగా పని చేసినప్పుడు ఆఫీసు సభార్డినేట్గా శ్రీనివాసులు చేసిన సేవలను మరువ లేను అన్నారు. ఒక్కోసారి పని ఒత్తిడి ఉన్న అందుకు అనుగుణంగా రాత్రి 8 గంటల వరకు కూడా పనిచేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. తదనంతరం రిటైర్ అయిన ఆఫీసు సభార్డినేట్ సతీమణి మాట్లాడుతూ విధులు ముగించుకుని అప్పగించిన పనులను పూర్తి చేయాలన్న వాటిపైనే దృష్టి సారించారన్నారు. తదనంతరం జడ్పీటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి అధికారుల బృందంతో కలిసి పదవి విరమణ చేసిన శ్రీనివాసులు దంపతులకు గజమాల వేసి సాలువతో ఘనంగా సత్కరించడంతోపాటు బహుమతులు అందించారు. ఇదే తరహాలో పంచాయతీ సెక్రటరీలు కూడా శ్రీనివాసులకు పూలమాలు వేసే ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వెంకటరత్నమ్మ గురుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో షణ్ముగం,సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్ మాజీ సర్పంచులు రూబెన్, గోవిందస్వామి,యబినైజర్ ఇతర అధికారులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల అధికారి రామ్మోహన్..!

### -- ఆగస్టు 1 నుంచి 30వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తులు స్వీకరణ..

### సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ..

### చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 2,63,522 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,27,030 మంది పురుషులు, 1,36,465 మంది మహిళలు, 27 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడి..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి: చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి తహసీల్దార్ అమరేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల అధికారి మరియు ఆర్డీవో రామ్మోహన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 166-చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని జూన్ 15 నుంచి జూలై 24 వరకు నిర్వహించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ( బి ఎల్ ఓ లు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించగా, వాటిని డిజిటలైజేషన్ చేసి జూలై 31 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 2,63,522 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 1,27,030 మంది పురుషులు, 1,36,465 మంది మహిళలు, 27 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా 344 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ అనంతరం నియోజకవర్గంలో 358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ ప్రక్రియలో 40 పోలింగ్ కేంద్రాలు




తగ్గినట్లు వివరించారు. అలాగే నో-మ్యాపింగ్ కింద 50,866 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు, 18 రకాల లాజికల్ వ్యత్యాసాలతో 41,754 మంది ఓటర్లను గుర్తించినట్లు చెప్పారు. వీరితో పాటు దాదాపు 92 వేల మంది ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి జాబితాను నవీకరించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 1 నుంచి 30వ తేదీ వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని సెప్టెంబర్ 28 నాటికి పరిష్కరించి అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఆర్డీవో రామ్మోహన్ వెల్లడించారు. మండలాల వారీగా సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల్లో తిరుపతి రూరల్ మండలంలో 99,141తో అత్యధికం, అనంతరం చంద్రగిరి 43,140, పాకాల 40,363, రామచంద్రాపురం 23,890, యర్రావారిపాలెం 20,685, చిన్నగొట్టిగల్లు 19,785, తిరుపతి అర్బన్ 16,518 ఫారాలు నమోదైనట్లు ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎపిడబ్ల్యూజెఎఫ్

### - సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టుల వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం డిమాండ్స్ డే సంధర్భంగాఎపిడబ్ల్యూజెఎఫ్,ఎపిబిజెఎఫ్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్నిసమర్పించారు. కలెక్టర్ కిజర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు అయిన జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టుకోవడానికి తగిన ఆర్థిక సహాయం అందించాలికోరారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, పని పరిస్థితులు,ఇతర సదుపాయాలపై అధ్యయనం చేసేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో 'మీడియా కమిషన్' ఏర్పాటు చేయాలనికోరారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే మనరాష్ట్రంలోనూ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేసేందుకు ఒకకమిటీని నియమించాలని కోరారు. ఆగిపోయిన 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ప్రచురణను తిరిగి పునరుద్ధరించాలి. రాష్ట్రంలో ఏర్పాటైన 28 జిల్లాలకు అనుగుణంగా సమాచార శాఖను పటిష్టం చేసి, తగిన సిబ్బందిని నియమించడంతో పాటు కార్యాలయాలను ఆధునికీకరించాలిని కోరారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ రాయితీపై ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్ కమిటీని పునరుద్ధరించి, ఈ ఫండ్‌కు రూ. 50 కోట్లు కేటాయించాలని కోరారు. సి. రాఘవాచారి మీడియా అకాడమీ పనితీరు పారదర్శకంగా ఉండేందుకు వెంటనే గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుచేయాలని కోరారు. కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన



ప్రముఖుల పేరిట ఇచ్చే జర్నలిస్టు అవార్డుల ప్రదానాన్ని పునరుద్ధరించాలని కోరారు అసంఘటిత రంగ కార్మికులకు వర్తింపజేస్తున్న బీమా పథకాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని కార్మిక శాఖ కమిషనర్ పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలనికోరారు. వృద్ధ జర్నలిస్టుల సంక్షేమం సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కేంద్రంలో ప్రత్యేకంగా వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని జర్నలిస్ట్ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ తన పరిదిలోని సమస్యలను పరిష్కరిస్తానని,మిగిలిన సమస్యలను ప్రభుత్వానికి పరిష్కారం కోసం పంపుతానన్నారు. అదేవిధంగా జర్నలిస్టులు హెల్త్ స్కీమ్ కోసం జర్నలిస్టులు చెల్లించే 1250 రూపాయలను జిల్లాలో అక్రిడిడేషన్ కలిగి జర్నలిస్టులందరికి సిఎస్ఆర్ పండ్ నుంచి 1250 చెల్లించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ను కోరగా, సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.చెంగల్రాయులు (గాంధి)ఎపిబిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్, ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి,జిల్లా ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు యాదవ్,జిల్లా సహాయ కార్యదర్శి గుండ్రాజు సుకుమార్ రాజు, కోశాధికారి కె.శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టు సిబి మోహన్ రావు,యూనియన్ నాయకులు, సుధీర్,మణి, క్రిష్ణమూర్తి,వర్మ, వినోద్, రాధాదేవి, పి.యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డును పరిశీలించిన వెటర్నరీ జాయింట్ డైరెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపాడు వద్ద ఉన్న మార్కెట్ యార్డ్‌లో ప్రతి శుక్రవారం జీవాల సంతను నిర్వహిస్తుంటారు. శుక్రవారం మార్కెట్ యార్డును వెటర్నరీ జె.డి. రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు దాహార్తి తీర్చేందుకు 9 నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా వ్యాపారస్తులు, రైతుల కొరకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 14 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. పాలక మండలితో చర్చించి అదనంగా పది మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. క్రయ విక్రయాలు జరుగుతున్న ఒక్కొక్కజీవానికి మార్కెట్ కమిటీ నియమ నిబంధనలు మేరకే 50 రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆన్లైన్ పర్మిట్ల కారణంగా ఎటువంటి అవకతవకలు జరిగే ఆస్కారం లేదన్నారు. 2018 – 19 సంవత్సరంలో షెల్టర్ కొరకు రెండు షెడ్లకు 92 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ 39.60 లక్షలు ఖర్చు పెట్టి పిల్లర్స్ వరకు నిర్మాణం జరిపి షెడ్ల పై కప్పులను షీట్స్ తో అమర్చి అసంపూర్తిగా ఉందని, త్వరలోనే పాలక వర్గం దృష్టికి తీసుకు వెళ్లి ప్రతిపాదనలు తయారు చేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి షెడ్లను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈయన వెంట ఏడి మార్కెటింగ్ అనిత, సెక్రెటరీ జగదీష్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ , వెటర్నరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం , పట్టాభి రెడ్డి, తదితరులు ఉన్నారు.

# బేషరతుగా విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి

### విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి

### సీపీఐ నాయకుల డిమాండ్





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఢిల్లీ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు నమోదు చేయడాన్ని సీపీఐ శాఖా నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల మాట్లాడుతూ ఎన్డీయే అవలంభిస్తున్న విద్యా, నిరుద్యోగ వ్యతిరేక విధానాలు, నీట్ లేకేజీ తో బేజారైన యువత రోడ్డెక్కిందన్నారు. తమ హక్కుల సాధన కోసం కాక్రోచ్ పార్టీతో కలిసి శాంతియుత నిరసన దీక్షలు చేశారన్నారు. వారిపై అన్యాయంగా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సామాజిక శాస్త్రవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు కేంద్ర మంత్రులు ఇచ్చిన వాగ్దానం మేరకు విద్యార్థులు, విద్యార్థి నేతలు, సీజేపీ పై పెట్టిన కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమంలో జొరబడి రక్త గాయలయ్యేలా విచక్షణా రహితంగా దాడులు చేసిన ఆర్ఎస్ఎస్ మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు (సీవీఎల్), పీఎన్ఎం పట్టణ కార్యదర్శి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీరారెడ్డి పల్లి లో ముమ్మరంగా కొనసాగుతున్న టీడీపీ ఇంటింటి ప్రచారం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమం గూడూరు ఎమ్మెల్యే మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ మరియు 15వ యూనిట్ ఇంచార్జ్



తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ సూచనల ప్రకారం నేడు గూడూరు పట్టణం 27,28 వ వార్డు ల లో వీరారెడ్డి పల్లి నందు ఇంటింటి ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. ఇంటింటికికరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గూర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ ఇశ్రాయేల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తూ, అభివృద్ధి లో దూసుకుపోతోందన్నారు. సామాజిక పెన్షన్స్ అత్యధికంగా ఏ రాష్ట్రం లేని విధంగా 4 వేలు, 6వేలు, 10వేలు, 15వేలు ఇస్తున్న ప్రాబభుత్వం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించి ఆర్థిక సహకారం అందిస్తోందని, కుటుంబం లో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి 15000 చొప్పున ఇస్తూ పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఈ ప్రచార కార్యక్రమం లో పట్టణ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పూండ్ల శివయ్య,10 వ బూత్ కో కన్వీనర్ గంగలపూడి శ్రీనివాసులు, 28 వార్డు జనరల్ సెక్రటరీ కోవూరు మురళి, 10 వ బూత్ కన్వీనర్ మగ్గం రాజేష్, పరిమళ శ్రీనివాసులు, 11, 13 బూత్ కన్వీనర్లు నూనె వాసు యాదవ్, షేక్ ఆరీఫ్, 27 వార్డు అధ్యక్షుడు అన్నంగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం.. ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ సందేశం





ప్రజా భూమి ప్రతినిధి -- బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలం నేరనీ కండ్రిగ గ్రామంలో "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుని, కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, దీపం--2 పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను మహిళలు, వృద్ధులకు వివరించారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న స్థానిక సమస్యలు, ప్రజల వినతులను తెలుసుకుని వాటిని 'మై టీడీపీ' యాప్ ద్వారా నమోదు చేశారు. అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ ముని చంద్రనాయుడు, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ రమేష్ కరకంబట్టు, టీడీపీ సీనియర్ నాయకుడు మునియ్య, తెలుగు మహిళ కార్యకర్తలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనకవోలులో టిడిపి ఇంటింట ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు

తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక టిడిపి నాయకులతో కలిసి పెళ్ళకూరు మండలం



అనకబోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కు వినతి పత్రాలు అందజేశారు. తనకు అందిన 23 వినతి పత్రాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమంత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం అనకపోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంరెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ ప్రజల యొక్క క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వెనకవోలు గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు సిరసనం భేటీ చైతన్య కృష్ణారెడ్డి,రమేష్ నాయుడు,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రేణిగుంట మార్కెట్ ఆధునీకరించండి : ఎంపీడీవో రవిచంద్రకు టీడీపీ నాయకుల విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట పట్టణంలోని సుమారు 80 ఏళ్ల చరిత్ర కలిగిన పాత కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం ఎంపీడీవో రవిచంద్ర టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదం మాట్లాడుతూ, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన మార్కెట్ స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన మార్కెట్ భవనాన్ని నిర్మించాలని కోరారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తే వ్యాపారులకు, వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు అందడమే కాకుండా, పంచాయతీకి దుకాణాల అద్దెల రూపంలో ఆదాయం పెరిగి, పలువురికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని కోరారు. కార్యక్రమంలో ఈ ఓ శ్రీధర్, క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదం, ముస్లిం మైనారిటీ నాయకుడు నవాబ్, మరియు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## నక్కల కాలువ వంతెనను కాపాడండి - తలపా దామోదరం రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణానికి ముఖద్వారం అయినటువంటి పానగల్ వద్ద గల నక్కల కాలువ వంతెన దగ్గర గతంలో మున్సిపాలిటీ వారు మురుగునీటి కాలువను నిర్మించడం వల్ల వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహించడం ద్వారా వంతెన రిటైనింగ్ వాల్ దెబ్బతిని వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, రాబోవు వర్షాకాలంలో వరదనీరు వల్ల పెను ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్.కి కాంగ్రెస్ పార్టీ తరఫున వినతిపత్రం అందజేయడం జరిగినది. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్. సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారని, శ్రీకాళహస్తి నక్కల కాలం వద్ద నూతనంగా కాలువ నిర్మాణం చేపట్టి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగూరయ్యా, ముని కృష్ణయ్య, చందు, నాగరాజు,అరుణ్, చరణ్, జోసెఫ్,సారధి,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య నాయుడు ను పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి -- బుచ్చినాయుడు కండ్రిగ



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుచ్చినాయుడు కండ్రిగ మండలం వేణుగోపాలపురం పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెంలో అనారోగ్యంతో ఉన్న టీ. సుందరయ్య నాయుడును శుక్రవారం వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా సుందరయ్య నాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయనకు ధైర్యం చెప్పారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మనోహర్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు ఎం. సుధాకర్ నాయుడు, ఎన్ఆర్ఐ పుత్తేరి పార్థు, పార్లపల్లి దాము, కాటూరు రామనాథం, పెద్దపాలెడు చంద్ర, కాంపాళ్యం సత్యం, బాలకృష్ణ, నీర్పాకోట పురుషోత్తం తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ నందు మాన్ మిస్సింగ్ కేస్ నమోదు

ప్రజా భూమి ప్రతినిధి బంగారుపాళ్యం .



బంగారుపాళ్యం మండలం పోలీస్ స్టేషన్లో మ్యాన్ మిస్సింగ్ అయిన పర్సన్ పేరు పిచ్చండి, ఆయన వయసు వయస్సు 52 సంవత్సరాలు వాళ్ల తండ్రి పేరు లేట్ సీనయ్య కొదలమడుగు గ్రామ పంచాయతీకి చెందిన వ్యక్తి, కనబడని వ్యక్తి 18-7-2026 తేదీ 9 గంటల నుండి కనబడలేదని వాళ్ల భార్య గిరిజ ఆమె వయసు 40. సంవత్సరాలు బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగింది, కనబడని వారి భర్త పేరు పిచ్చండి కనబడడం లేదని వాళ్ల భార్య వచ్చి ఇంతవరకు కనబడలేదు అని కేసు ఇవ్వడం జరిగింది . మ్యాన్ మిస్సింగ్ కేస్ గా నిర్ధారించడం నమోదు చేశారు

## పాముకాటుతో తల్లి మృతి.. అనాథలైన ముగ్గురు చిన్నారులకు గరుడ గ్రూప్ అండ

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని కంచనపుత్తూరు గిరిజన కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. గత శుక్రవారం (24-07-2026) రాత్రి పాముకాటుకు గురై



వెంకటరత్నమ్మ (28) అనే పశువుల కాపరి మృతి చెందింది. ఎనిమిదేళ్ల క్రితమే భర్తను కోల్పోయిన ఆమె, ముగ్గురు చిన్నారులను పశువులు మేపుకుంటూ ఎంతో కష్టపడి పోషిస్తూ జీవనం సాగించింది. అయితే అనుకోని విధంగా పాము కాటుతో వెంకటరత్నమ్మ మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు. ఈ హృదయ విదారక సంఘటన స్థానికులను కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న 'గరుడ గ్రూప్' సభ్యులు వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చి రూ.20,000 ఆర్థిక సహాయాన్ని చిన్నారులకు అందజేశారు. కష్టకాలంలో తమకు తోడుగా నిలిచిన గరుడ గ్రూప్ సభ్యులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనాథలైన చిన్నారులకు అందించిన ఈ సహాయం ఇతరులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. గరుడ గ్రూప్ సభ్యుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

## తుమ్మూరు ఆటో స్టాండ్ నూతన కమిటీ నియామకం

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.



నాయుడుపేట పట్టణం లోని తుమ్మూరు ఆటో యూనియన్ నూతన కమిటీ నియామకం శుక్రవారం జరిగింది.సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు సతీష్ మస్తాన్ రెడ్డి శివకవి ముకుంద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సతీష్ మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీఐటీయూ లో ఉన్న ఆటో కార్మికులు క్రమశిక్షణగా ఉండాలని మద్యపానం త్రాగి ఆటో నడపడం నేరమన్నారు.అతి వేగం ప్రమాదకరమని ఆటో కార్మికుడు యూనిఫామ్ వేసుకోవాలని,బండి లైసెన్సు చట్టపరమైన కాగితాలన్నీ ఉండేలా చూసుకో వాలని అన్నారు.సిఐటియు 5 మండలాల బాధ్యులు శివకవి ముకుంద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి మహిళలకు ఫ్రీ బస్సు ఏర్పాటు చేశారు కానీ ప్యాసింజర్ కు తగినన్ని బస్సులు లేనందువల్ల మహిళలు బస్సులో నిలబడటానికి కూడా ప్లేస్ లేక ప్రజలు అనారోగ్యంకి గురి అవుతున్నారన్నారు.ఈ ఫ్రీ బస్సుల వల్ల ఆటో కార్మికులకు బాడుగులు లేక బతుకుతెరువు కోల్పోయారన్నారు.ఆటో ఆపుకోవడానికి కూడా స్టాండ్లు లేక ఉన్న స్టాండ్లు పెట్టుబడిదారులు కబ్జా చేస్తుంటే ప్రభుత్వ అధికారులు వారికి సపోర్ట్ చేస్తున్నారని తెలిపారు.ఆటో కార్మికుడు ఆటో ఆపుకోవడానికి స్థలము లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఆటో కార్మికులకు ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలన్నారు.లేని పక్షంలో పోరాటాలు చేపడతామన్నారు ఆటో యూనియన్ నూతన కమిటీ10 పదిమందిని ఎంపిక చేశారు.అధ్యక్ష కార్యదర్శులుగా డి ప్రసాద్,పి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ఉప కార్యదర్శులుగా ఎమ్ వెంకటేశ్వర్లు ,ట్రెజరర్ గా సతీష్ మరి కొంతమంది సభ్యులుగా ఆటో కార్మికులను ఎంపిక చేశారు.

## "బాధితులను వదిలి హంతకులకు ఓదార్పు.. ఇదేనా జగన్ నీ నీతి? - శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆగ్రహం"



ప్రజాభూమి ప్రతినిధి:శ్రీకాళహస్తి టౌన్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీరుపై టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శ్రీకాకుళం పర్యటనలో బాధితులను పట్టించుకోకుండా నేరస్తులను పరామర్శించి నిరుపేద కుటుంబాన్ని అవమానించారని ఆరోపించారు.నిరుపేద బి.సి యాదవ కులానికి చెందిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబాన్ని పరామర్శించే కనీస జ్ఞానం కూడా జగన్ కు లేకపోవడం చాలా బాధకరం అని ఎమ్మెల్యే విమర్శించారు. "నాడు 'ఓదార్పు యాత్ర' పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్, నేడు ప్రతీ పక్షంలో హంతకులను ఓదారుస్తున్నాడు" అని అన్నారు.18 ఏళ్ల మాజీ మంత్రి కొడుకు రోడ్డు ప్రమాదంలో దానయ్య ప్రాణాలు తీస్తే, తప్పు లేదని వెనకేసుకొస్తు ప్రమాదానికి కారణమైన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చాలా బాధాకరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి పెద్దను కోల్పోయి రోడ్డున పడ్డ దానయ్య కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి అవమానించారని ఆరోపించారు. జగన్ అండ్ కో నేరుగా ఇలాంటి ప్రమాదాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తీరు ఉందని బొజ్జల అన్నారు.

## మా ఊరి చెరువును కాపాడండి

ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు



కంచనపల్లి రైతుల ఆవేదన. వివరాల్లోకి వెళితే కంచనపల్లి చెరువును బోను పల్లికి చెందినఓ ప్రబుద్ధుడు తన పొలానికి దారి లేదని చెరువు కట్టను నిర్ధాక్షణ్యంగా తెగ్గొట్టి జెసిబి ల సాయంతో తన పొలానికి దారి వేసుకున్నాడు. ఎంతోమంది అన్నదాతలకు ఆసరాగా నిలిచిన చెరువు ఆ ప్రబుద్ధుడి పుణ్యమా అని చెరువులో చుక్కనీరు నిలవకుండా వెళ్ళిపోయే ప్రమాదం పొంచి ఉంది ఎప్పటికైనా ఇరిగేషన్ అలాగే రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు కట్టను యధావిధిగా నిర్మించి తమను ఆదుకోవాలని కంచనపల్లి గ్రామస్తులు వేడుకుంటున్నారు

## మామిడిగుంట గ్రామంలో 5వ రోజు విస్తృతంగా పర్యటించడం జరిగింది

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు



ఇంటింటికీ మీ బొజ్జల సుధీర్ రెడ్డి 5వ రోజు కార్యక్రమంలో భాగంగా ఈరోజు తొట్టంబేడు మండలం, విల్లవేడు పంచాయతీ పరిధిలోని మామిడిగుంట గ్రామంలో 5వ రోజు విస్తృతంగా పర్యటించడం జరిగింది. ప్రతి గడపకూ వెళ్ళి ప్రజల క్షేమ సమాచారాలను ఆరా తీస్తూ, మన కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను, నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వారికి వివరించాము. గడిచిన రెండేళ్ల కూటమి పాలనలో మామిడిగుంట గ్రామానికి లభించిన అభివృద్ధి-సంక్షేమ ఫలాలు 7 కోట్ల 62 లక్షల రూపాయాలు పర్యటన సందర్భంగా గ్రామంలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. అర్హులైన రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణమే ఈ రెవెన్యూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అధికారులను క్షేత్రస్థాయిలోనే ఆదేశించడం జరిగింది. ప్రతి ఇంటా నవ్వులు చూడటమే లక్ష్యంగా, మామిడిగుంట గ్రామ సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చాను. ఈ కార్యక్రమంలో మన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బైక్ చోరీ కేసులో బాధిత జనసైనికుడికి అండగా దండి నరేంద్ర

### - 2-టౌన్ పోలీసులతో సమన్వయం

### - సీఐ నాగరాజు గారి స్పందనకు అభినందనలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన మాధవరావు బసవయ్య పాలెం (నందిని సర్కిల్ సమీపం)లో నివాసముంటూ గ్రీన్ ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్లో మెకానికల్ ఫిట్టర్ గా పనిచేస్తున్నారు. తల్లి అనారోగ్యంతో స్వగ్రామానికి వెళ్లే సమయంలో పార్కింగ్‌లో ఉంచిన ఆయన పల్సర్ బైక్ (ఏపీ39 జీఎ 7566) ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడితో కలిసి 2-టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ శ్రీ నాగరాజు గారిని కలిసి ఘటన వివరాలను తెలియజేశాము. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వాహన ట్రాకింగ్ వ్యవస్థకు బైక్ వివరాలను అనుసంధానం చేసి గుర్తించే చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల పాటు ట్రాకింగ్ కొనసాగించి, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి బైక్‌ను గుర్తించి , బాధిత జనసైనికునికి సాధ్యమైనంత త్వరగా అందజేసేందుకు అవసరమైన చర్యలు తప్పక తీసుకుంటామని సీఐ గారు హామీ ఇచ్చారు. లిఈ సందర్భంగా సీఐ నాగరాజు తక్షణ స్పందన, సానుకూల దృక్పథం, బాధ్యతాయుతమైన చర్యలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.ఈ కార్యక్రమంలో బాధితుడు మాధవరావు తో పాటు జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, జయశంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా అగ్రహారపేటలోని సాయిబాబా ఆలయంలో వైభవంగా ముగిసిన గురుపౌర్ణిమ వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి (నాయుడుపేట)



నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో వెలసి ఉన్న శ్రీ సాయిబాబా ఆలయంలో 27వ తేదీన ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగిన నగరోత్సవం కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. మూడు రోజులు పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగిన గురుపౌర్ణమి వేడుకల అనంతరం శుక్రవారం ద్వితీయ పుష్కర మహోత్సవాల్లో భాగంగా మహా కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలు నడుమ వేద పండితులు వేదమంత్రోచరణలతో ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వేద పండితుల సమక్షంలో పవిత్ర కలశాలను ప్రతిష్టించి మహా కుంభాభిషేక మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ద్వితీయ పుష్కర మహోత్సవంలో భాగంగా శనివారం శ్రీ షిరిడి సాయి నాథుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి శ్రీ సాయినామ కీర్తనలతో అత్యంత వైభవంగా నగరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## విద్యాభివృద్ధికి ధాతల సహకారం ఆవశ్యకం

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



విద్యార్థికి ధాతలు అవసరమైన సహకారం అందించాలని చిందేపల్లి సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గంగల పూడి గిరిధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్పిబిఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధ్యాత్మిక అవధూత 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డైరీలు, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యావిధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. పాత తరానికి ప్రస్తుత జన్జీ తరానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యని అభ్యసిస్తున్న విద్యార్థులు తగిన జ్ఞానాన్ని సమపాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మిక అవధూత ఎడిటర్ ఆనందరెడ్డి విద్యార్థులకు డైరీలు, పెన్నులు అందించడం అట్లా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డైరీలు పెన్నులు పంపిణీ చేశారు అనంతరం ఆధ్యాత్మిక అవధూత 12వ వసంతం మొదటి సంచికను అతిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ మాజీ సభ్యులు పోతుల రాజకుమార్, పూజారి శ్రీనివాసులు రెడ్డి, పాకాల రామకృష్ణయ్య, ముచ్చేలి సురేంద్రబాబు, ఏఎస్ఐ గంగులయ్య, సెల్వరాజ్, ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విబి జీ రామ్ జీ హామీ పథకంలో పనులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు.

### రాయల చెరువు పేటలో విబి జీ రామ్ జీ హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో




ప్రజా భూమి ప్రతినిధిరామచంద్రాపురం

రామచంద్రపురం మండలంలో విబి జీ రామ్ జీ హామీ పథకంలో జరుగుతున్న పనులలో నాణ్యతను పాటించాలని సిబ్బందిని ఎంపీడీవో పులిరాం సింగ్ ఆదేశించారు. కార్మికుల సంఖ్యను పెంచి, కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి కల్పించాలని అన్నారు. శుక్రవారం మండలంలోని రాయల చెరువు పేటలో జరుగుతున్న వి బి జీ రామ్ జీ హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రతిరోజు 300 రూపాయలకు తక్కువ లేకుండా వేతనం చెల్లించేలా పనులు చేయించాలన్నారు. పథకంలో ఎలాంటి అక్రమాలకు తావు లేవని, ముఖ ఆదారిత హాజరు నమోదు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో కార్మికులందరూ కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకంలో పనిచేసే అనంతరం మస్టర్ను పరిశీలించి, కార్మికులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఆరోగ్య క్షేత్ర సహాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## రామానాయుడు లక్ష్మి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించిన :దండి నరేంద్ర

### కష్టసమయంలో ప్రతి జనసైనిక కుటుంబానికి జనసేన అండగా ఉంటుంది -- దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి పట్టణ జనసేన అధ్యక్షులు భవాని శంకర్ తల్లి రామానాయుడు లక్ష్మి అనారోగ్యంతో పరమపదించడం అత్యంత బాధాకరం. ఆమె దశదిన కర్మ కార్యక్రమానికి వారి శ్రీ కాళహస్తిలోని వారి నివాసానికి వెళ్లి, పవిత్ర నివాళులు అర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించాను. ఈ క్లిష్ట సమయంలో భవాని శంకర్ కి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, జనసేన తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చాను. జనసైనికుల ఆనందంలో భాగస్వాములమవడం ఎంత బాధ్యతో, వారి కష్టకాలంలో అండగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత అని నేను నమ్ముతున్నాను. ఈ కార్యక్రమంలో నాతో పాటు జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, జనశంకర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానంలో షాపులు తొలగిస్తే పేదల కుటుంబాలు రోడ్డున పడతాయి అంజూరు తారక శ్రీనివాసులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల దర్శనార్థం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం, ఆలయ సుందరీకరణ (బ్యూటీఫికేషన్) ప్రాజెక్టులో భాగంగా మొదటి గోపురం సమీపంలోని గోశాల వద్ద చేపడుతున్న నిర్మాణాల వల్ల కొన్ని కుటుంబాల జీవనోపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దశాబ్దాలుగా అక్కడే చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని కొబ్బరికాయలు, పూలు, పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 10 కుటుంబాలను తక్షణమే ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో ఆ వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లిఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిపరిస్థితిని సమీక్షించారు. అక్కడి నుంచే ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి మాట్లాడారు.దశాబ్దాలుగా ఈ షాపులనే నమ్ముకుని జీవిస్తున్న పేద కుటుంబాల కడుపు కొట్టవద్దని, వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు.మాజీ అధ్యక్షుల అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఈవో, వాహన మండపానికి మరియు భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చిన్న బల్లలు (టేబుల్స్) వేసుకుని పూజా సామాగ్రి విక్రయించుకోవడానికి అనుమతినిచ్చారు. సమస్య సకాలంలో స్పందించిన ఈవోకి అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి టౌన్ యువజన అధ్యక్షులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి,ప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 11

శనివారం 01 ఆగష్టు 2026

# వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.భార్గవి పదవీ విరమణకు గాండ్ల కులస్తుల శుభాకాంక్షలు

## పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించిన గాండ్ల తెలికుల ఉద్యోగులు, పెన్షనర్లు, సమస్త గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, జిల్లా సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్, అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ గాండ్ల కె. భార్గవి పదవీ విరమణ సందర్భంగా గాండ్ల సామాజిక వర్గీయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. శుక్రవారం మధ్యాహ్నం బుక్కరాయ సముద్రం మండలం రెడ్డిపల్లిలోని వ్యవసాయ పరిశోధన క్షేత్రం అధికారుల ఆధ్వర్యంలో డాక్టర్ కే భార్గవి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పదవీ విరమణ పొందిన డాక్టర్ కే భార్గవి, ఆమె భర్త రెడ్డయ్య దంపతుల శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడవాలని ఆకాంక్షిస్తూ పూలమాలలు, బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం (ఏ జి టి యు పి ఎస్ ఎస్), సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్ జి టి పి ఎస్ ఎస్) రాష్ట్ర మీడియా సెక్రెటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపీ కుమార్, మాట్లాడుతూ, వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదని, ఆ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు మూలాధారమని, అలాంటి రంగంలో పరిశోధనలు చేసి రైతులకు ఉపయోగపడే విజ్ఞానాన్ని అందించడం గొప్ప సేవ అని, అంతటి ఉత్కృష్టమైన సేవలో డాక్టర్ కే భార్గవి చేసిన సేవలు, పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఉద్యోగానికి పదవీ విరమణ ఉంటుంది కానీ, సేవకు ఉండదని, ప్రభుత్వ సేవలనుంచి విరమిస్తున్న ఆమె సమాజానికి, రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు అందించే మార్గదర్శకత్వం మాత్రం కొనసాగుతుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. డాక్టర్ కే భార్గవి




తమ ఉద్యోగ జీవితమంతా రైతు సంక్షేమానికి, వ్యవసాయ పరిశోధనకు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసి, ఒక మంచి శాస్త్రవేత్తగా, సమర్థ పరిపాలకురాలిగా, విద్యార్థులకు ఆదర్శ గురువుగా నిలిచారని కొనియాడారు. ఇదే సమయంలో టీచర్గా పని చేస్తూ రిటైర్డ్ అయిన ఆమె భర్త రెడ్డయ్య అందించిన సహాయ సహకారాలు అమోఘమని, ఈ దంపతుల జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ప్రశంసించారు. అన్ని రంగాల్లో కంటే తనకు ఇష్టమైన ఆహార భద్రతను కల్పించే వ్యవసాయ రంగం, మానవజాతి, సమాజ నిర్మాణానికి తోడ్పడే విద్యారంగం, చట్టాన్ని పరిరక్షిస్తూ న్యాయాన్ని ధర్మాన్ని అందించే న్యాయవ్యవస్థ, ఆరోగ్యకరమైన సమాజాన్ని కల్పించే వైద్య ఆరోగ్యశాఖ అంటే తనకు ఇష్టమని, అలాంటి రంగాల్లో ఒకటైన వ్యవసాయ రంగంలో డాక్టర్ కే భార్గవి విశేష సేవలు అందించి పదవి విరమణ పొందడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ జి టి యు పి ఎస్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాండ్ల నరసింహుడు, కార్యవర్గ సభ్యుడు రణ కుమార్, సభ్యుడు మద్దిలేటి, సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మాజీ గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, రాష్ట్ర నాయకులు ముకుందాపురం గంగాధర్, విద్యా కమిటీ కన్వీనర్ లెక్చరర్ రవికుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, పసల శ్రీనివాసులు, విజయ మద్దిలేటి, సన్మాన గ్రహీత కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భారీ ఊరట.. పంటల బీమా నమోదుకు మరో 15 రోజుల గడువు

- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల మనోహర్
- అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి

ప్రజాభూమి, ముదిగుబ్బ

ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావంతో సాగు ఖర్చులు పెరిగి, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. పంటలు సాగు చేసినప్పటికీ వివిధ సాంకేతిక, పరిపాలనా కారణాల వల్ల పంటల బీమా నమోదు చేయించుకోలేకపోయిన రైతులకు మరో అవకాశం కల్పిస్తూ పంటల బీమా నమోదుకు అదనంగా 15 రోజుల గడువును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది రైతులు లబ్ధి పొందనున్నారని రైతు వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రైతుల సమస్యలను రాష్ట్ర మంత్రులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా నమోదుకు మరో 15 రోజుల గడువు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ముదిగుబ్బ మండల టిడిపి అధ్యక్షుడు తుమ్మల మనోహర్ స్వాగతించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మరో అవకాశం కల్పించడం సంతోషకరమని అన్నారు. ఇప్పటికీ పంటల బీమా నమోదు చేయించుకోని రైతులందరూ ప్రభుత్వం కల్పించిన ఈ అదనపు అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని తుమ్మల మనోహర్ కోరారు. 15 రోజుల గడువులోపు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా సంబంధిత సేవా కేంద్రాలను సంప్రదించి పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పంట సాగు చేసిన ప్రతి రైతు క్రాప్ బుకింగ్ (ఈ-క్రాప్ నమోదు) ప్రక్రియను కూడా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. క్రాప్ బుకింగ్ పూర్తయిన రైతులకే పంటల బీమా, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుందని వివరించారు. వర్షాభావం, అధిక వర్షాలు, తుఫాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించే ప్రధాన రక్షణ కవచమే పంటల బీమా అని ఆయన పేర్కొన్నారు.



ప్రభుత్వం కల్పించిన ఈ అదనపు గడువును ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేస్తుందని, అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పంటల బీమా నమోదు ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని తుమ్మల మనోహర్ పిలుపునిచ్చారు.

# 'పురం'లో ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరసన -డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా శుక్రవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన చేపట్టి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం లభించలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతు



న్నా జర్నలిస్టుల సంక్షేమంపై మాత్రం నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, నిజాయితీగా వార్తలు రాసే పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతోందని పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, దౌర్జన్యాలు పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రత కోసం ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ పథకం అమలులో ఉందని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. దశాబ్దాలుగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నప్పటికీ అవి అమలుకు నోచుకోలేదని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తే సానుభూతి మాత్రమే వ్యక్తం చేస్తున్నారని, అయితే వాటి పరిష్కారానికి మాత్రం చర్యలు కనిపించడం లేదన్నారు. నాయకుల ఇంట్లో సంతోషకరమైన సందర్భాలైనా, విషాద ఘటనలైనా, రాజకీయ పరిణామాలైనా ప్రజలకు చేరవేసేది జర్నలిస్టులేనని, అలాంటి పాత్రికేయుల సంక్షేమం విషయంలో మాత్రం ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. తమకు సానుభూతి అవసరం లేదని, సమస్యల పరిష్కారమే కావాలని స్పష్టం చేశారు. గతంలో సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై పలు హామీలు ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు వాటి అమలులో ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షబ్బీర్, హిందూపురం నియోజకవర్గ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హెచ్.గంగప్ప, ఉపాధ్యక్షులు ఎం.రమేష్, విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గిరీష్ కుమార్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు శ్రీధర్ రెడ్డి, జబీవుల్లా, గోపాల్, ఆంజనేయులు, హనుమంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రశేఖర్‌తో పాటు హిందూపురం నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వాడలో కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు

## -రసాయన వ్యర్థాల శాంపిల్ల సేకరణ -ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పారిశ్రామిక వాడలో పెరిగిపోతున్న కాలుష్యంపై వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో కాలుష్య నియంత్రణ మండలి స్పందించింది. తూమకుంట--గోళ్ళాపురం పారిశ్రామిక వాడలో రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న ప్రమాదకర వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా పారబోస్తున్నారనే అంశంపై కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశికళ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి శుక్రవారం తూమకుంట పారిశ్రామిక వాడలో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. వ్యర్థాలు పడేసిన ప్రాంతాలను పరిశీలించి వాటి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షల కోసం పంపించారు. అధికారులు రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో కనిపించిన ద్రవ వ్యర్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పద్ధతిలో నమూనాలు సేకరించి వాటిని ప్రయోగశాలకు



పంపించారు. నివేదిక వచ్చిన అనంతరం వ్యర్థాల స్వరూపం, అందులో ఉన్న రసాయనాలు, అవి ఏ పరిశ్రమ నుంచి విడుదలయ్యాయనే విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశికళ మాట్లాడుతూ, రసాయన పరిశ్రమల నుంచి వెలువడే ప్రమాదకర వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఇటువంటి వ్యర్థాలు భూమిలో కలిసిపోతే భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, వర్షపు నీటితో చెరువులు, కాలువల్లోకి చేరితే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. మనుషులతో పాటు పశువులు, ఇతర మూగజీవాల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని చెప్పారు. వ్యర్థాలు పడేసిన ప్రాంతాల్లో నేల సహజ స్వభావం పూర్తిగా దెబ్బతింటుందని, అక్కడ చెట్లు కూడా పెరగని పరిస్థితులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలకు పంపిస్తున్నామని, నివేదిక వచ్చిన అనంతరం ఆ వ్యర్థాలు ఏ పరిశ్రమ నుంచి వచ్చినవో శాస్త్రీయంగా నిర్ధారించి సంబంధిత పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ చట్టాల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని శశికళ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తెలిపారు. తనిఖీల సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రవికుమార్, దేవరాజు, బాబు అధికారుల వెంట ఉండి తూమకుంట--గోళ్ళాపురం పారిశ్రామిక వాడలో నెలకొన్న కాలుష్య పరిస్థితులను వివరించారు. రాత్రివేళల్లో ట్యాంకర్ల ద్వారా నిర్మానుష్య ప్రాంతాల్లో రసాయన వ్యర్థాలను పారబోస్తున్నారనే స్థానికుల ఆరోపణలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ వ్యర్థాలు చెరువులు, వాగులు, భూగర్భ జలాల్లో కలిసే ప్రమాదం ఉందని, దీనివల్ల పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యంతో పాటు వ్యవసాయానికి కూడా తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కోర్ట్ వాయిదాకి హాజరైన వినుత కోటా జనసైనికులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు, ప్రజల తరఫున నిరంతరం పోరాడినందుకు వినుత కోటా పైన, చంద్రబాబు కోటా పైన అక్రమంగా నమోదు చేసిన 19 కేసుల్లో ఒక కేసుకు సంబంధించి, తమతో పాటు పలువురు జనసైనికులు కూడా నిందితులుగా ఉన్నారు. ఈ రోజు శ్రీకాళహస్తి కోర్ట్ నందు విచారణకు వినుత కోటా తో కలిసి పలువురు జనసైనికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినుత కోటా ప్రజల పక్షాన మా పోరాటం నిన్నా... నేడు... రేపూ కొనసాగుతూనే ఉంటుందని తెలియజేశారు.





## వైఎస్ఆర్సిపి నుండి టిడిపిలోకి చేరిన పలువురు నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి పెళ్లకూరు

తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామపంచాయతీ పరిధిలోని పెరుమాళ్ళపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే నేలవల విజయశ్రీ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా చేరిన వారిని అభినందించారు.



# క్రీడలలో మెరిసిన పుట్లూరు విద్యార్థులు

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండలంలోని విద్యార్థులు క్రీడలలో రాణించడం జరిగినది. అమరావతి ఛాంపియన్షిప్ 2026 లో భాగంగా ఈనెల 29న నార్పల లో జిహెచ్ఎస్ లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు చెస్లో ఓ. విద్య, కబడ్డీలో వి.పావని, హాకీలో కే.జయచంద్ర, బాక్సింగ్ క్రీడలలో ఏ. యశ్వంత్, ఏ. పరమేష్ లు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి చేరాలని ఎంఈఓ 1శ్రీదేవి, ఎంఈఓ 2 ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు ఆకాంక్షించారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం -ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా

## -మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ సహకారంతో హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నూతన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్ పేర్కొన్నారు శుక్రవారం ఆయన ఇన్చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆసుపత్రి వైద్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది డాక్టర్ ఆఫ్తాబ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆఫ్తాబ్ మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకొని ఆసుపత్రి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పరిశుభ్రమైన ఆసుపత్రి వాతావరణం, ఔషధాల అందుబాటు, సమయపాలన, రోగుల పట్ల బాధ్యతాయుతమైన సేవలు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి ఒక్కరూ సేవాభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వైద్యులు, అధికారులు, సిబ్బంది నూతన మెడికల్ సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయన నాయకత్వంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, వివిధ విభాగాల అధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

శుక్రవారం ఏర్పేడు మండలంలోని ఏర్పేడు నందు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో ప్రజల నమ్మకం అభివృద్ధి సంక్షేమం అనే అంశాలపై ఇంటింటి ప్రచారం కార్యక్రమం లో నాయకులతో కలిసి పాల్గొని కరపత్రాలను పంపిణీ చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణవేణి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునేయ్య పార్టీ నాయకులు సదా శంకర్ నాయుడునారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## చిట్టత్తూరు గ్రామంలోనీ (పోలేశమ్మ) అమ్మవారి పొంగళ్ల పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

లిఈ శుభ సందర్భంలో స్థానిక నాయకులు చిట్టత్తూరు బాలాజీ రెడ్డి ఆహ్వానం మేరకు మన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి బాలాజీ రెడ్డి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బాలాజీ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి సాదరంగా, సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం బొజ్జల సుధీర్ రెడ్డి పోలేశమ్మ అమ్మవారిని దర్శించుకుని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో తులతూగాలని, ఊరంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా పనిచేయాలి -: జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వేదికగా జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు డ్రగ్స్, అక్రమ మద్యం, అక్రమ లాటరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలపై గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని చెప్పారు. డ్రోన్ల సహాయంతో నిఘాను మరింత పెంచడంతో పాటు రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, ప్రాపర్టీ నేరస్తులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను సకాలంలో నమోదు చేయాలని, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్ష పడేలా నాణ్యమైన విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నాన్ కేడర్ ఎస్పీ ఎస్.ఆర్. రాజశేఖర రాజు, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్. షాను, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# నేడు 2,24,793 లక్షల మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ



జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా ఆగస్టు 1వ తేదీన విస్తృత స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 2,24,793 మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల విలువైన సామాజిక పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పథకం కింద ప్రతినెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను సమయానికి అందించేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం నుంచే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు మరియు పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.98,11,85,500 కోట్ల నిధులను పంపిణీకి సిద్ధం చేసి, పారదర్శకంగా, సమర్థవంతంగా కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, గౌరవంతో పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రతి లబ్ధిదారునికి పింఛన్ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.



# పాఠకులకు ఆదర్శం రామారావు లంకిశెట్టి బాలాజీ

**ఘనంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ పదవీ విరమణ సభ**

**రామారావు - రమాదేవి దంపతులకు శాలువా, నూతన వస్త్రాలతో సత్కారం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థలో వివిధ హోదాల్లో సేవలు అందించి జూనియర్ అసిస్టెంట్ గా పదవీ విరమణ చేసిన ఐ.వి.వి. రామారావు నేటి ఉద్యోగులకు ఎంతో ఆదర్శమని లంకిశెట్టి బాలాజీ కొనియాడారు.రామారావు పదవీ విరమణ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో లంకిశెట్టి బాలాజీ మరియు జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు – రమాదేవి దంపతులను శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలు బహుకరించి ఘనంగా అభినందనలు తెలియ జేశారు.సమాజ శ్రేయస్సే ధ్యేయంగా సేవలుఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడు తూ... రామారావు తన సుదీర్ఘ సర్వీసులో విద్యార్థుల నుంచి పాఠకుల వరకు అందరి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగిగానే కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పౌరుడి గా గ్రంథాలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. దాతల సహకారాన్ని సమీకరించి విద్యార్థులకు ఉపయోగపడే అనేక విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి సమకూర్చారని ప్రశంసించారు.మానవత్వంతో ఆర్థిక చేయూతజనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ... మానవ జన్మ అత్యంత విలువైనదని, రామారావు తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారని అన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు మానవత్వంతో ఎంతోమంది పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం తనవంతుగా ఆర్థిక చేయూతను అందించి వారి ఉన్నతికి తోడ్పడ్డారని కొని యాడారు. రాబోయే శేష జీవితాన్ని ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ ఉద్యోగులు, రామారావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కలెక్టరేట్ ముట్టడితో తీవ్ర ఉద్రిక్తత




**సిఐటియు ఆధ్వర్యంలో గళమెత్తిన స్కీమ్ వర్కర్లు..**

**బకాయిలు, వేతన పెంపుపై వివోఏల హోరెత్తిన నిరసన**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు (CITU) ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్లు, వెలుగు VOA (విలేజ్ ఆర్గనైజర్స్)లు చేపట్టిన ధర్నా కార్యక్రమం కలెక్టరేట్ ముట్టడికి దారి తీసింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ధర్నా ప్రాంగణం హోరెత్తింది.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్కీమ్ వర్కర్లు గళమెత్తారు.ముఖ్య డిమాండ్లు ఇవే:బకాయిల విడుదల: VOAలకు నిలిచిపోయిన 2 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. కనీస వేతనాలు & ఉద్యోగ భద్రత: గత 7 ఏళ్లుగా వేతనాలు పెరగలేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమల్లోకి తెచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలి. HR policy ని వర్తింపజేయాలి. ఇ న్సెంటివ్‌లు: ప్రభు త్వం వా గ్దానం చేసిన స్త్రీనిధి ఇన్సెంటివ్స్ బకాయిలను వెంటనే జమ చేయాలి.సౌకర్యాలు: VOAలకు సిమ్ కార్డులు, ఉచిత గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.పొదుపు మహిళల డబ్బులు తిరిగివ్వాలి: స్వావలంబన, అభయహస్తం, మహిళా మార్టుల్లో పొదుపు మహిళలు పెట్టిన పెట్టుబడులు, ఇన్సూరెన్స్ మొత్తాలను వారికి వెంటనే తిరిగి చెల్లించాలి.వడ్డీ రాయితీ: ఎన్నికల వాగ్దానం ప్రకారం పొదుపు మహిళలకు ₹10 లక్షల వరకు వడ్డీ రాయితీ వర్తింపజేయాలి.నాయకుల విమర్శ:"రాష్ట్రంలో దాదాపు 28 వేల మంది VOAలు రాత్రింబవళ్ళు పొదుపు సం ఘాల మహిళలకు సేవలు అందిస్తున్నారు. వేతనాలు పెరిగి ఏడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు స్కీమ్ వర్కర్లందరం ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తాం.సిఐటియు నాయకులు.కలెక్టరేట్ ఆవరణలోకి దూసుకెళ్లేందుకు యత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు అక్కడ నెట్టోట, ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం తమ కోరికలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.



# కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి





ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇంచార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు అన్నారు.అవనిగడ్డలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం నియోజకవర్గంలోని 6 మండలాల పార్టీ అధ్యక్షులతో ఇంచార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాస్ తో పాటు రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సమావేశంలో పాల్గొని, మండల అధ్యక్షుల తో పలు విషయాలపై చర్చించారు.ఈ సంద ర్భంగా విక్కుర్తి మాట్లాడుతూ, ఇంటింటికి తెలుగు దేశం పార్టీ కార్యక్రమాన్ని అవనిగడ్డ నియోజకవర్గంలో విజయవంతం చేయాలని మండల అధ్యక్షులకు సూచించారు. గ్రామ స్థాయి లో నాయకులను, కార్యకర్తలను కలుపు కుంటూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వ పాలనలో విజయవంతంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేరవేయడంలో మండల అధ్యక్షులు కీలకపాత్ర పోషించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నేత నారా లోకేష్ లను స్ఫూర్తిగా తీసుకొని, టిడిపి శ్రేణులు కష్టపడి పని చేయాలని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమిలో భాగమైన జనసేన, బిజెపి నేతలతో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు.ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించి, మొట్టమొదటిసారి సమావేశం ఏర్పాటుచేసిన విక్కుర్తి శ్రీనివాస్ కు మండల అధ్యక్షులు శుభాభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, చల్లపల్లి మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, మోపిదేవి మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, నాగాయలంక మండల అధ్యక్షులు మెండు చంటి, ఘంటసాల మండల ప్రధాన కార్యదర్శి పరిశే చలపతిరావు లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి...**



ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (APWJF) రాష్ట్ర, జిల్లా కమిటీలా ఆదేశాల మేరకు శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గం ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎదుర్కొం టున్న పలు సమస్యల పరిష్కారం కోసం అవనిగ డ్డ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ అంకాలు కు ఫెడరేషన్ సభ్యులు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్న రవిశంకర్ మాట్లాడుతూరాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణానికి ప్రత్యేక పథకం అమలు చేయాలని కోరారు. అలాగే హెల్త్ కార్డులు జారీ చేసి, ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి స్థాయిలో వైద్య సేవ లు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల పిల్లలకు విద్యా సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన లేదా విధుల్లో గాయపడిన జర్నలిస్టుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, సులభతరం చేయడంతో పాటు జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు జరిగితే కఠిన చర్యలు తీసుకుని వారికి రక్షణ కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని అదేవిధంగా గతంలో మాదిరిగా రైల్వే పాసులను కూడా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు గొర్రిముచ్చు సూర్యనారాయణ, అధ్యక్షులు అలపర్తి గోపాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి లంకే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆకుల అజయ్ కుమార్, కోశాధికారి మోపిదేవి అమ్మయ్య, సహాయ కార్యదర్శి ఇమ్మడిశెట్టి రామారావు, కుంపటి బాబురావు, కార్యవర్గ సభ్యులు, అప్పికట్ల శివకృష్ణ, కంచర్లపల్లి వెంకట నాంచారయ్య పాల్గొన్నారు.

# బాల శాస్త్రవేత్తలకు వేదికగా సైన్స్ కాంగ్రెస్

**-ఆగస్టు 15లోపు విద్యార్థుల నమోదు పూర్తి చేయాలి**

**-సైన్స్ ఉపాధ్యాయుల సమగ్ర శిక్షణలో ఎంఈఓ**

ప్రజాభూమి, హిందూపురం టౌన్


బాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, పరిశోధనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించే 32వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ)–2026ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎ.హెచ్. గంగప్ప సూచించారు. ఏపి రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం హిందూపురంలోని చిన్మయ విద్యాలయంలో పెనుకొండ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్ప మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా తమ పరిసరాల్లోని సమస్యలను శాస్త్రీయ కోణంలో పరిశీలించి, వాటికి వినూత్న పరిష్కారాలను అన్వేషించే దిశగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ జగదీష్ మాట్లాడుతూ, ఈ ఏడాది కాంగ్రెస్‌కు సంబంధించిన ప్రధాన ఇతివృత్తాలు, ఉపాంశాలు, ప్రాజెక్టుల రూపకల్పన విధానం, మూల్యాం కన ప్రమాణాలు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయులకు సవివరంగా వివరించారు. విద్యార్థుల నమోదును ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఆసక్తి గల విద్యార్థులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. గ్రామీణ సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ, జీవవైవిధ్యం, ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. హెచ్‌ఎంఏ అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు మనోజ్ ఆరాధ్య మాట్లాడుతూ, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాలను వెలికితీసే జాతీయ వేదిక అన్నారు. బాల శాస్త్రవేత్తలు తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ఆవిష్కరించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతి భను చాటుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈవో–2 ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ గ్రామాలు, పాఠశాలలు, పరిసర ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి వాటిపై శాస్త్రీయ పరిశీలన జరిపి నివేదికలు రూపొందించాలన్నారు. పరిశోధన ఆధారిత ప్రాజెక్టులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు దోహదపడతాయని తెలిపారు. చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ సరళ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. సచ్ఛీంద్ర, కె.మంజుల రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించి కాంగ్రెస్ ఇతివృత్తాలు, ప్రాజెక్టుల ఎంపిక, పరిశోధన పద్ధతులు, డాక్యుమెంటేషన్, ఆన్‌లైన్ నమోదు విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం

**- గ్రంథాలయ శాస్త్ర విభాగంలో ఒక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం**

**- ఆగస్టు 3 వరకు గడువు**



ప్రజాభూమి, వేంపల్లె


స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాస్త్ర విభాగంలో ఒక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంఎల్ఐఎస్‌సీ లేదా బీఎల్ఐఎస్‌సీతో పాటు ఎంఎల్ఐఎస్‌సీ పూర్తి చేసి కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. యూజీసీ-నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. బోధన లేదా గ్రంథాలయ నిర్వహణలో అనుభవం ఉన్న అభ్యర్థులకు అదనపు వెయిటేజ్ కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కలిసి దరఖాస్తులను ఆగస్టు 3, 2026 సాయంత్రం 5 గంటలలోపు వేంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ కోరారు.



# కృష్ణా జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా కె. శ్రీధర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్వో) కె. శ్రీధర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరే ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా జిల్లా రెవెన్యూ అధికారి బాధ్యతలను చేపట్టారు.ఇంతకు ముందు ఆయన ప్రకాశం జిల్లాలో వెలుగు ప్రాజెక్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్గా విధులు నిర్వహించారు. పరిపాలనలో తనకు ఉన్న అనుభవాన్ని జిల్లాలో సమర్థవంతమైన రెవెన్యూ పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వినియోగిస్తానని ఈ సంద ర్భంగా డిఆర్ఓ తెలిపారు.అధికారులు, సిబ్బంది నూతన జిల్లా రెవెన్యూ అధికారికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆయనకు స్వాగతం పలికారు.



Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

ప్రజాభూమి

# జనరల్ 13

శనివారం 1 ఆగస్టు 2026

# పిఠాపురం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట!

- నాలుగు వారాల్లో నమోదైన 375 అర్జీల శాశ్వత పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి.
- ప్రతి అర్జీని సరైన పద్ధతులు గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి–పిఠాపురం

నాలుగు వారాలుగా పిఠాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఒక నెల –ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం అందిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం ఇచ్చే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) కార్యాలయంలో వరుసగా నాలుగో వారం 'ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాడా చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్, పాడా ఏపీడీ వసంత మాధవి, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి. వాసుదేవ రావు ఇతర అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వయంగా స్వీకరించారు.

**375 అర్జీలకు తక్షణ పరిష్కారానికి చర్యలు..**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒక నియోజకవర్గం చొప్పున నాలుగు సార్లు శుక్రవారం ఆ నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాలుగో వారం పిఠాపురం నియోజకవర్గంలో ఒక నెల –ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. పిఠాపురంలో నాలుగు వారాలుగా నిర్వహించిన ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 375 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ అర్జీలు అన్నింటినీ పగడ్బందీగా,పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దాదాపు 75 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఇవన్నీ కూడా ప్రధానంగా మున్సిపాలిటీకి సంబంధించి, భూవివాదాలు, రీసర్వేలో గతంలో జరిగిన సమస్యల గురించి ఎక్కువగా వచ్చాయన్నారు. వీటిని అన్నిటిపై అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి, అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులు తెలుసుకొని ప్రజలకు అనుకూలంగా వారి సమస్యను పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.రాబోయే నెలలో వేరే నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, పిఠాపురంలో వచ్చిన ఈ 375 అర్జీలను ఎప్పటి కప్పుడు రివ్యూ చేస్తూ త్వరతిగతినపరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు – మెరుగైన సేవలందించేలా ఆదేశాలు జారీ:**

పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. గత మూడు వారాలుగా నమోదైన అర్జీలకు సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌ.ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించడం జరిగిందన్నారు. పీజీఆర్ఎస్‌తో పాటు స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐస్) మీద కూడా ప్రతి ఒక్క శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. దానితో పాటు పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, ప్రజా అభిప్రాయ సేకరణ ద్వారా తీసుకుంటున్న ఫీడ్‌బ్యాక్‌ని ప్రతి ఒక్క సిబ్బంది సీరియస్‌గా తీసుకొని, ప్రజల మధ్యలో ప్రభుత్వం అందించే సేవల్లో పూర్తి సంతృప్తి వచ్చే విధంగా వారి పనితీరు ఉండాలని స్పష్టమైన వివరణ ఇచ్చారు. గత నెల కన్నా రాబోయే నెలలో ఇంకా మెరుగైన సేవలు అందించేలా – పెన్షన్లు గాని, అన్నా క్యాంటీన్ గాని, గ్రామ, నగర ప్రాంత పరిశుభ్రత గాని, దీపం సమస్యలు గాని, రైస్ కార్డ్స్ సరఫరా వంటి అంశాలన్నింటి లోనూ సమర్ధవంతంగా పని చేయవలసిందిగా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం తహశీల్దార్ గోపాల కృష్ణ,గొల్లప్రోలు కమిషనర్ దివిజా సంపతి, పిఠాపురం నియోజక వర్గంలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజక వర్గ, డివిజన్,మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర ద్వారా ఏలేరుకు నీరు

- ఉపద్రవం నుంచి కాపాడేందుకు రైతులకు ఊతం
- మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ

సూపర్ ఎల్నినో ఉపద్రవం ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో కూడా ఏలేరు ఆయకట్టు భూములకు నీరిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు...కాకినాడ జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం ఏలేరు ఆయకట్టు పరిధిలో కాలువల్లో నీటి మట్టాలను తనిఖీ చేశారు. మంత్రితోపాటు,జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూల,ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్య ప్రభ తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు మెయిన్ కెనాల్, తక్షణ మరమ్మతులకు, సిల్ట్ తొలగింపుకు ఓఅండ్ ఎం నిధులు తక్షణ అవసర ప్రాతిపదికగా ఖర్చు చేయాలని స్థానిక అధికారులకు రామానాయుడు ఆదేశాలు ఇచ్చారు.ఏలేరు ప్రాజెక్టు రిజర్వాయర్ స్థానిక నీటి వనరుల ఆధారంగా డిజైన్ చేశారని మంత్రి చెప్పారు. అయితే ప్రస్తుత దుర్భిక్ష పరిస్థితుల నేపథ్యంలో ఏలేరు జలాల ద్వారా ఆయకట్టు సాగు చేయడం అసాధ్యమని మంత్రి తెలియజేశారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాల ను పుష్కర ఎత్తిపోతలతో ఎడమ కాలవ ద్వారా ఏలేరు రిజర్వాయర్ లోకి సాగు నీరు పంపి అందించ బోతున్నామని చెప్పారు. నేడు పుష్కర ఎత్తిపోతల పథకం లేకపోతే, ఏలేరుకు చుక్క నీరు వచ్చేది కాదన్నారు.పుష్కర ఎత్తిపోతల రూపకర్త, ముందు చూపు ఉన్న నేత చంద్రబాబు నాయుడు అని చెప్పారు.. ఏలేరు ఆయికట్టు, అలాగే పిఠాపురం బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతుల పరిస్థితిపై ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సూచించారని మంత్రి చెప్పారు. ఎల్ నినో ఉపద్రవాన్ని తట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు.ఇరిగేషన్, రెవిన్యూ,వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి సాధ్యమైనంత మేర రైతులకు ప్రయోజనం చేకూర్చాలని ఆయన ఆదేశాలిచ్చారు. అలాగే ఆయకట్టు రైతు సోదరు లంతా ఆరుతడి పంటలు వేసుకోవడం,నీటి పొదుపు ను పాటించడం, చేయాలన్నారు.వీటి కంటే ముందు తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులు ప్రతి ఎకరాకు పంటల బీమా చేయించ మని సలహా ఇచ్చారు.

## శాకాంబరి అలంకరణలో తాళ్లమ్మ అమ్మవారు



ప్రజభూమి ప్రతినిధి–కొత్తపేట

కొత్తపేట కమ్మిరెడ్డి పాలెం సెంటర్లో వేంచేసి ఉన్న తాళమ్మ తల్లి శాఖంబరిగా దర్శనమిచ్చారు శుక్రవారం తాళమ్మ అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో అమ్మవారిని సాకాంబరిగా అలంకరించటం ఆనవాయితీ. అదే క్రమంలో ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా భక్తులు సహకారంతో కమిటీ సభ్యులు తాళమ్మ అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటి వాటితో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకు లు పూజాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఉద యం నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా యోజన'తో అత్యాధునిక వైద్య సేవల విస్తరణ

- దేశంలో ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందించడమే కేంద్రం లక్ష్యం
- ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం



ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

దేశవ్యాప్తంగా వైద్య, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ తెలిపారు. దేశంలో వైద్య సేవలు విస్తరణ, పిఎంఎస్ఎస్ వై పథకం ద్వారా రాష్ట్రాలకు అందిస్తున్న సేవలు,నిధుల వివరాలపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా యోజన (గ్రామీణ్) ద్వారా దేశంలో ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తూ మెరుగైన వైద్య సేవలను విస్తరించడం, వైద్య విద్యను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 22 ఎయిమ్స్ సంస్థలు మరియు 75 ప్రభుత్వ వైద్య కళాశాలలు/వైద్య సంస్థల అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులు ఆమోదం పొందాయని మంత్రి వివరించారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లు, అదనపు పడకలు, ఆధునిక డయాగ్నస్టిక్ కేంద్రాలు, క్రిటికల్ కేర్ యూనిట్లు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దీంతో పాటు పీఎంఎస్ఎస్‌వై అమలుకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని 2026--27 ఆర్థిక సంవత్సరానికి 11,307 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఆమోదించిన ఎయిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, వాటి పురోగతిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తూ వేగవంతం చేస్తోందని మంత్రి తెలిపారు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యక్రమాల అమలుపై తాను పార్లమెంట్‌లో నిరంతరం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ ప్రజల ప్రయోజనాల కోసం కృషి చేస్తానని తెలిపారు.

# పండూరులో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం

- మామిడి తాంద్ర తయారీ కుటుంబాలు, రైతులతో మమేకమైన టీడీపీ నాయకులు
- కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి "పిల్లి" దంపతులు




ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం శుక్రవారం కాకినాడ రూరల్ మండలంలోని పండూరు గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. మామిడి తాంద్ర తయారీకి ప్రసిద్ధి చెందిన ఈ గ్రామంలో టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు, స్థానిక అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మామిడి తాంద్ర తయారీపై ఆధారపడిన కుటుంబాలు, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సూపర్–6 హామీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహక పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మామిడి తాంద్ర తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్, మౌలిక వసతులు, గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే సంప్రదాయ పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నూరుకుర్తి వెంకటేశ్వరరావు, క్లస్టర్ కన్వీనర్ ,మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రి వెంకటరాజు, నరసింగరావు రావు,గ్రామ టీడీపీ అధ్యక్షులు బావిశెట్టి శ్రీను, బావిశెట్టి ప్రసాదు, గుమ్మల్ల వీరబాబు కూటమి నాయకులు, మహిళలు, యువత, రైతులు, మామిడి తాంద్ర తయారీదారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంపా, పుష్కర జలాశయాల నుంచి సేద్యపు నీటిని విడుదల చేయాలి

–ప్రభుత్వ విప్ యనమల దివ్య....



ప్రజాభూమి ప్రతినిధి–తుని

తుని నియోజకవర్గ పరిధిలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, ఖరీఫ్ పంటల సాగు కోసం పంపా, పుష్కర జలాశయాల నుంచి ఆయకట్టు భూములకు తక్షణమే సేద్యపు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి యనమల దివ్య కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఆమె ఫోన్లో మాట్లాడి నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు. ఖరీఫ్ సాగుకు రైతాంగం సన్నద్ధమైనప్పటికీ వర్షాలు లేకపోవడంతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణమే పంపా, పుష్కర జలాలను కాల్వలకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు బెండపూడి వద్ద మంత్రి నిమ్మల రామానాయుడును సీనియర్ నేత యనమల రాజేష్ నేతృత్వంలోని రైతు ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రంపై స్పందించిన మంత్రి సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ నేత చింతంనీడి అబ్బాయి, పంపా చైర్మన్ బైరవర్జుల చందు, ఆత్మ చైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

## రేఖపల్లి సొసైటీకి ఎఫ్ బి ఓ ఎంపిక వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాభూమి, ప్రతినిధి–వి.ఆర్.పురం




రేఖపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి ఎస్) సొసైటీకి ఎఫ్ బి ఓ ఎంపిక వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలనీ, ఏపీ సి ఓ బి డ డిపిడి ఎం గీత, ఎన్సీడీసీ శివరామకృష్ణ, డిసిసిబి షరీఫ్ , ప్రకాష్,రంపచోడవరం బ్రాంచ్ సూపర్వైజర్ వెంకటేష్ అన్నారు. మండలం లోని రేఖపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి ఎస్)ను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైసేషన్ గా ఎంపిక చేసిన నేపథ్యంలో శుక్రవారం ఏపీ సి ఓ బి , ఎన్సీడీసీ , డిసిసిబి అధికారులు సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ సి ఓ బి డ డిపిడిఎం గీత, ఎన్సీడీసీ శివరామకృష్ణ, డిసిసిబి షరీఫ్ , ప్రకాష్,రంపచోడవరం బ్రాంచ్ సూపర్వైజర్ వెంకటేష్ మాట్లాడుతూ, ఎఫ్ పి ఓ గా ఎంపిక కావడం రేఖపల్లి సంఘానికి ఎంతో గౌరవకరమైన విషయమని తెలిపారు. ఈ ఎంపికతో ఎన్సీడీసీ మరియు ఏపీ సి ఓ బి నుంచి ప్రత్యేక నిధులు అందనున్నాయని, సంఘ పాలకవర్గం, సభ్యులు సమన్వయంతో ఆ నిధులను రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలు, పరికరాల కొనుగోలుకు వినియోగించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అలాగే, కొత్త రైతులను సభ్యులుగా చేర్చుకుని వారికి కూడా సొసైటీ ద్వారా అందించే అన్ని రకాల సేవలు, సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సభ్యత్వం పొందదలచిన రైతులు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు సభ్యత్వ రుసుము చెల్లించి నమోదు చేసుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గొంది చంద్రయ్య , డైరెక్టర్ సోడే వెంకమ్మ , బొర్రా సత్యనారాయణ , సీఈఓ శ్రీను , మండల అధ్యక్షులు బొర్రా నరేష్ , సీనియర్ నాయకులు గొర్రె కృష్ణ తో పాటు మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

## న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలి

–కొత్తపేటలో జర్నలిస్టుల డిమాండ్స్ డే నిరసన.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.



దశాబ్దాలుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( ఏపీడబ్ల్యుఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ క్రాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( ఎ పి బి జె ఎ) ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా కొత్తపేట లో జర్నలిస్టులు సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్డిఓ జీవివి సత్యనారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి వాకాడ బాబులు మాట్లాడుతు ఇంటి స్థలాలుకేటాయించాలని, వీడియో కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీ, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణ, సమాచార శాఖను బలోపేతం చేయా లని, జర్నలిస్టులందరికీ రాయితీపై ఏసీ ప్రయాణం, జర్నలిస్టులు కమిటీ, మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిలింగ్ ఏర్పాటు, జర్నలిస్ట్ లకు అవార్డులు ఏర్పాటు, కార్మిక భీమా సదుపాయం వర్తింపు , జర్నలిస్టులకు వృద్ధాశ్రమం కల్పించాలని కోరుతూ తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లాల ఏపీ బీజేపీ అధ్యక్షులు, బంగారు రాజు, నియోజకవర్గ సెక్రటరీ పల్నాటి చంటి ఎన్. శ్రీను.దంగేటి వెంకటేశ్వరరావు, నామాల శ్రీనివాస్, నామాడి పని శేఖర్, రాయుడు జయదేవ్, బొక్క తమ్మరాజు, ఇళ్ల విక్రమరావు, నక్క రమేష్ గుత్తుల ఏడుకొండలు, నేరేడుమిల్లి ఏడుకొండలు కొప్పిశెట్టి నరేష్, వందే స్వామి కుమార్ , పులిదిండి కిరణ్ కుమార్, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ మలేరియా టీమ్ పిహెచ్ సి సందర్శన.

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.



ద్రాక్షారామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సెంట్రల్ మలేరియా టీం డిఎం వో డాక్టర్ నాగ శ్రీనివాసు, డాక్టర్ రత్నసుధ, సందీప్ ఆధ్వర్యంలో ద్రాక్షారామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం జరిగింది .ఈ సందర్బంగా మలేరియా ఏ విధంగా సంక్రమిస్తుంది, వ్యాధి యొక్క లక్షణాలు, నివారణా చర్యలు, మరియు పరిసరాలు పరిశుభ్రత, మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తెలియ చేయడం జరిగింది ఈ సందర్బంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రశీ లో ల్యాబ్ మరియు వాక్సిన్ రూమ్ పరిశీలించారు, అంతే కాకుండా దగ్గర లో వున్న హాసన్ బాద హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమం లో ఎస్ యువో లు, ఆదినారాయణ, రాజబాబు, కామేశ్వరరావు, సూపర్ వైజర్లు శ్రీనివాస్, వరలక్ష్మి, జాని కమ్మ, హెల్త్ అసిస్టెంట్ లు, ఎంఎన్ఎమ్ లు,ఎమ్ ఎల్ హెచ్ పి లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 1 ఆగస్టు 2026

## ముంపు బాధితులకు ముందస్తు చర్యలు తీసుకోండి

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



ఎగువన రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తడంతో ప్రస్తుతం భద్రాచలం వద్ద 50 అడుగులు దాటి గంట గంటకు ఉగ్ర రూపం దాల్చుతుంది. ముంపు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే సామాన్లను సర్దుకొని మైదాన ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ మండలంలో పర్యటించారు.మండలానికి వచ్చిన పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ని కలిసి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు వల్ల ప్రతి కుటుంబం ఇబ్బంది పడుతుందని ప్రతి ఒక్క కుటుంబానికి రెండు నెలల సరిపడ నిత్యావసర వస్తువులు ఇవ్వాలని కోరారు. బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచాలని అన్నారు. వర్షాల వల్ల వ్యాధులు ప్రభలే ప్రమాద ఉందని ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు.వరదలకు బోటు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా ఎత్తయినా ప్రదేశాల నుండి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముఖ్యంగా చిన్నా ర్కూర్ నుండి ఆర్ అండ్ బీ రోడ్డు మీదుగా బురద గూడెం వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే చిన్నార్కూర్ నుండి బోదునూరు మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు.బురదగూడెం నుండి తుమ్మల వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, నాగమణి, తమ్మయ్య ఎంపీటీసీ అమ్మజి తదితరులు పాల్గొన్నారు.


## పెద్దేవంలో ఆర్.ఆర్. హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఆర్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దేవం గ్రామంలో శ్రీ ఆర్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిభిరం ఏర్పాటు చేసారు. సుమారు 150 మందికి పైగా రోగులకు ఉచిత రక్త పరీక్షలు ఈసీజీ చేసి మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెడ్డం సాయిబాబా, టిడిపి నాయకులు బోడపాటి గంగరాజు, కోడి శంకరం, తిగురుపల్లి గోపి, ముప్పిడి రాజేష్, గెడ్డం రాధాకృష్ణ, గెడ్డం భాస్కర్, ముప్పిడి రాజేశ్వరరావు, బాల, మేనేజర్ చింటూ, మణికంఠ, పి. ఆర్. ఓస్. సాగర్, వెంకట్, హాస్పిటల్ సిబంది తదితరులు పాల్గొన్నారు.

## చాగల్లు గ్రామంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆకస్మిక తనిఖీ



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి శుక్రవారం ఉదయం చాగల్లు గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.పంచాయతీ కార్యాలయం తనిఖీ సందర్భంగా పంచాయతీ బడ్జెట్, ఆదాయం-వ్యయాల నిర్వహణ, శానిటేషన్ పనులపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీకి సుమారు రూ.10 లక్షల ఆదాయం ఉన్న నేపథ్యంలో ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు ఉండాలని, ప్రతి రూపాయి పొదుపుగా మరియు ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలన్నారు. బడ్జెట్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీల సంఖ్య, బాలింతలు, పాలు తాగే చిన్నారుల వివరాలను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న ప్రసూతి, పోషకాహార, వైద్య సేవలపై పి. హెచ్.సి. వైద్యులు కలెక్టర్‌కు వివరించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో శానిటేషన్ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, కాలువలు, చెత్త నిల్వలు, దోమల నివారణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో శ్రీదేవి, పి. హెచ్.సి. వైద్యులు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల ఉచిత ఎంసెట్, నీట్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి.

-డిఐఈఓ జ్యోతుల రాంబాబు.

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు



కాకినాడ జిల్లా పరిధిలో గల అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు కాకినాడలో గల పి . ఆర్.గవర్నమెంట్ కాలేజి, ఉచితంగా అందిస్తున్న షార్ట్ టర్మ్ ఎంసెట్, నీట్ కోచింగ్ సదు పాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డాక్టర్ జ్యోతుల రాంబాబు కోరారు . ఈ మేరకు శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కాజులూరు లో గల జూనియర్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ కోచింగ్ కి వచ్చిన విద్యార్థులకు భోజన సౌకర్యము మరియు స్నాక్స్ , ఎం.సి క్లాస్ రూమ్ లలో ఉచితంగా కోచింగ్ అందిస్తున్నామని తెలియజేశారు. త్వరలో ఎంసెట్, నీట్ విద్యార్థులకు ఆన్‌లైన్ టెస్ట్‌లు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఒక యాప్‌ను తీసుకొస్తామని ఆయన పేర్కొ న్నారు.విద్యార్థులు ట్యాలి వంటి కోర్సులు నేర్చుకోవాలని, అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీషులో మాట్లాడడం వంటి స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు.ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలను, ఎంసెట్, నీట్ మెటీరియల్‌ను, సంకల్ప మెటీరియల్‌ను, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకమును అందిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ,స్టాఫ్‌తో సమావేశమయ్యి, కళాశాలలో మరిన్ని అడ్మిషన్స్ పెరగాలని ఈసందర్భంగా సూచించారు. కళాశాల లోని వాతావరణాన్ని, సదుపాయాలను చూసి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ఎస్. శ్రీనివాస్ ని, స్టాఫ్‌ను ఈసందర్భంగా ఆయన అభినందించారు.

# లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, పోలవరం కలెక్టర్ కే. దినేష్ కుమార్ అన్నారు. గోదావరి శబరి నదులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న నేపద్యంలో కలెక్టర్ దినేష్ కుమార్ శుక్రవారం కూనవరం, వి.ఆర్.పురం ప్రాంతాలలో వరద పరిస్థితులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ భద్రాచలం వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉందని, వర్షాల పరిస్థితిని బట్టి ఈ రాత్రి అర్ధరాత్రి లేదా రేపు ఉదయం మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందన్నారు. తదుపరి భారీ వర్షాలు లేకపోతే వరద క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశముందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని, చింతూరులో 24 గంటల కంట్రోల్ రూమ్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయంలో కూడా ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి మట్టం ఏ స్థాయికి చేరితే ఏ గ్రామాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతాయో ముందుగానే మ్యాపింగ్ చేసి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో వరద ప్రభావితమయ్యే అవకాశమున్న 189 హాబిటేషన్లను గుర్తించామని, 2022 గరిష్ట వరద స్థాయిని ఆధారంగా తీసుకుని సుమారు 34 వేల కుటుంబాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని తెలిపారు. ప్రజల రక్షణ కోసం 150 పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు, ఆహారం, తాగునీరు, రేషన్, అత్యవసర సరుకుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. సహాయక చర్యల కోసం 32 బోట్లను సిద్ధం చేసినట్లు, బోటు నిర్వాహకులతో సమావేశమై బకాయిలు కూడా విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు, ప్రసవ తేదీ సమీపించిన మహిళలను ముందుగానే ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అవసరమైన మందులు నిల్వ ఉంచామని, ముఖ్యంగా యాంటీ స్నేక్ వెనం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. శబరికొత్తగూడెం, టేకులబోరు తదితర ముంపు ప్రాంతాల్లో ఇప్పటికే మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, జిల్లా యంత్రాంగం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గోదావరి నీటి మట్టం, ముంపు ప్రాంతాలు, రాకపోకలు నిలిచే ప్రాంతాల వివరాలతో ప్రతి నాలుగు గంటలకు ఒకసారి అధికారిక బులెటిన్ విడుదల చేస్తామని తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## గోదావరి ఉధృతి రీత్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ముంపు నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
- రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఉధృతి పెరుగుతున్న రీత్యా చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శుక్రవారం ఒకప్రకటంలో అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాలుస్తున్నందున విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విలీన మండలాల ప్రజలు గోదావరి పరివాహక ప్రాంత ముంపునకు లోనయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 48 అడుగులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు గోదావరి నుండి1144645క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే అధికార యంత్రాంగం 2వ హెచ్చరిక నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో ఇప్పటికే సహాయక చర్యలపై అధికార యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అనుక్షణం ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## నూజివీడు సెయింట్ థామస్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



నూజివీడు సెయింట్ థామస్ హై స్కూల్ విద్యార్థులు ఆర్జీయూకేటీ ఏపీ కౌన్సిలింగ్లో ఎన్సిసి భాగము నుండి క్యాడేట్ ఎస్ నిస్సి వాసల్య నూజివీడు ట్రిబుల్ ఐటీ క్యాంపస్ నందు మరియు క్యాడేట్ కే సంతోష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నందుసీట్లను పొందినారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ మరెడ్డి బ్రదర్ జాజిరెడ్డి ఎన్సిసి సెకండ్ ఆఫీసర్ కెవి శ్రీనివాస్ మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

# నారీ శక్తి సివిల్ సర్వీసెస్ ఫెలోషిప్' ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు




సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్న అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'నారీ శక్తి సివిల్ సర్వీసెస్ ఫెలోషిప్ ప్రోగ్రామ్' ఆర్జీయూకేటీ-నూజివీడు క్యాంపస్‌లో విశ్వవిద్యాలయ ఉప కులపతి మరియు నూజివీడు క్యాంపస్ ఇన్చార్జి డైరెక్టర్ ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభమైంది. కార్యక్రమం ప్రారంభంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ సాధించిన విజయాలు, సంస్థ ద్వారా సివిల్ సర్వీసెస్‌లో ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రతిబింబించే ప్రత్యేక ఆడియో-విజువల్ (ఏవీ)ను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన విద్యార్థుల్లో సివిల్ సర్వీసెస్‌పై మరింత ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆర్జీయూకేటీ నాలుగు క్యాంపస్‌లైన నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు నుంచి మొత్తం 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులకు (ప్రతి క్యాంపస్ నుంచి 25 మంది చొప్పున) రెండు సంవత్సరాల పాటు అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఆన్‌లైన్ కోచింగ్‌ను పూర్తిగా ఉచితంగా అందించ నున్నట్లు అకాడమీ ప్రకటించింది. ఈ ఫెలోషిప్‌కు అర్హులైన విద్యార్థినుల ఎంపిక కోసం 2026 ఏప్రిల్ 4న నాలుగు క్యాంపస్‌లలో ఒకేసారి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఆ పరీక్షలో ఎంపికైన విద్యార్థినులను ఈ కార్యక్రమంలో అభినందించి, మెరిట్ సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు రెండు సంవత్సరాల ఉచిత ఆన్‌లైన్ సబ్‌స్క్రిప్షన్ ప్రదానం చేశారు. సివిల్ సర్వీసెస్ మరియు ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాల్లో విశిష్ట స్థానాలు సంపాదించిన ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థులైన హర్షిత ఎం (యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2025, ఆల్ ఇండియా ర్యాంక్ 520), కె. రాజా మాథ్యూ (డిప్యూటీ కలెక్టర్), నిత్యశ్రీ (డిప్యూటీ రిజిస్ట్రార్), కృష్ణవేణి (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్సెస్) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ అభిరామ్ విలసాగరం తన బృందంతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఇ డైరెక్టర్ ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు మాట్లాడుతూ "దాదాపు 70 శాతం మంది విద్యార్థినులు ఉన్న మన క్యాంపస్ లో నారీశక్తి సివిల్ సర్వీసెస్ ఫెలోషిప్ వంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని, మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సమర్థవంత మైన ప్రజా సేవకులుగా మిమ్మల్ని తీర్చిదిద్దడంలో ఇలాంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని, యూపీపిఎస్సీ వంటి అత్యున్నత పోటీ పరీక్షల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మీలాంటి ప్రతిభావంతులైన విద్యార్థినుల ప్రాతినిధ్యం పెరగాలని" అన్నారు.

ఈ కార్యక్రమాన్ని గూగుల్ మీట్ ద్వారా శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌ల విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. నాలుగు క్యాంపస్‌ల నుంచి ప్రత్యక్షంగా మరియు ఆన్‌లైన్ ద్వారా కలిపి సుమారు 650 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థులు లక్ష్యంపై స్పష్టమైన దృష్టితో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధించగల రని ప్రోత్సహించారు. అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ అభిరామ్ విలసాగరం మాట్లాడుతూ "తాను ఆర్జీయూకేటీ-ఆర్కే వ్యాలీ 2008 తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమని" తెలిపారు. అలాగే ముఖ్య అతిథులైన కె. రాజా మాథ్యూ, నిత్యశ్రీ, కృష్ణవేణి కూడా ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థులే కావడం విశేషమని పేర్కొన్నారు.అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యార్థినుల కోసం ప్రారంభించిన ఈ ఫెలోషిప్‌ను వచ్చే బ్యాచ్ నుంచి విద్యార్థులకు కూడా విస్తరించి, వారికి సైతం ఉచిత కోచింగ్ అందించే ప్రణాళిక ఉందని వెల్లడించారు.ఆర్జీయూకేటీ విద్యార్థుల్లో సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తిని పెంపొందిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన కోచింగ్ అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్, ఈఐటీపీ డీన్ శ్యామ్, సెంట్రల్ అకడమిక్ డీన్ దువ్వూరి శ్రావణి, అకడమిక్ డీన్ సాదు చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, హెచ్ఈ ఇ సీఈ సెల్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి రామకృష్ణ, డా. చింతయ్య నాయుడు, హెచ్ఈ ఇ సీఈ సెల్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రియాంక పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు అన్నవరం విద్యార్థి



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నియోజకవర్గస్థాయి అమరావతి చాంఫియన్ షిష్ లో భాగంగా ఈరోజు యస్.ఆర్.ఆర్. జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల నూజివీడు లో జరిగిన నియోజకవర్గ సెలక్షన్స్ లో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరం విద్యార్థి చెప్పల. బాలరాజు సెలెక్ట్ అయినాడని ఫిజికల్ డైరక్టర్ పి.రవీంద్ర తెలిపారు. గత సంవత్సరము కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసాపురంలో జరిగిన డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ లో వాలీబాల్ ఆటలో సెలెక్ట్ అయినాడని తెలిపారు. నూజివీడు నియోజక వర్గములో సెలెక్ట్ అయిన ఈ క్రీడాకారుడు జిల్లాస్థాయి లో పాల్గొంటారని నియోజకవర్గ ఇంచార్జి అన్నామణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొని క్రీడాకారుడును అభినందించారు.


## అమరావతి చాంపియన్‌షిప్ ఆటల పోటీలు



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

యస్.ఆర్.ఆర్. జిల్లాపరిషత్ హైస్కూల్ లో శుక్రవారంనియోజకవర్గస్థాయి ఖో ఖో, చెస్ సెలక్షన్స్..ఏలూరుజిల్లా నూజివీడు మండలముయస్.ఆర్.ఆర్. జిల్లాహైస్కూల్ లో అమరావతి చాంఫియన్ షిప్ లోభాగంగా ఖో ఖో కోర్టు ను నూజివీడుమండల విద్యాశాఖాధికారి దేవవరప్రసాద్ ప్రారంభించారు. తదనంతరంక్రీడాకారులనుపరిచయం చేసుకొనుట జరిగినది. కొంచెంసేపు క్రీడాకారులతో ఆడి ఉత్తేజపరిచారు.మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గస్థాయి లో సెలక్ట్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు.ప్రధానోపాధ్యాయిని పుష్పలత మాట్లాడుతూ పాఠశాల తరుపున క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ ఐదురోజులుమాదగ్గరజరగటం చాలా సంతోషముగా ఉందని, ప్రభుత్వము వారు ఏ కార్యక్రమము తలపెట్టినా విజయ వంతంగా నిర్వహిస్తామని తెలిపారు.నియోజక వర్గ వ్యాయామ ఉపాధ్యాయులందరూ భాధ్యతగా తమ విధులను నిర్వహించారని,మీ అందరికీ మాపాఠశాల విద్యా కుటుంబము తరుపున ధన్యవాదములు తెల్పు కుంటున్నా ము. మాస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయునులు అన్నామ ణి, లక్ష్మిని ప్రత్యేకముగా అభినందించారు.ఈరోజు ఖోఖో అండర్ 17,అండర్ 23క్రీడాకారులకు సెలక్షన్స్ నిర్వహించామని నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి అన్నామణి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యయులు నాగరాజు, లక్ష్మి, బాలబాస్కర్, రవీంద్ర,సుగుణరావు, శివ నాగేంద్రం,సుకుమార్,ఆలీఖాన్, వనజ, స్వప్న, నాగేశ్వరరావు, రాణి, సరళ, ప్రభాకర్, వాసు, సతీష్, నాగరాజు, ,అన్నపూర్ణ,హేమ,నారాయణ, శ్రీహరి, ఉమమహేశ్వరి, సాయి కిషోర్ పాల్గొన్నారు.

## ఆషాఢ శుక్రవారం వేళ ఆలయాల్లో విశేష పూజలు



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా ఆగిరిపల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, సహస్రనామార్చనలు, కుంకుమార్చనలు తదితర విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించగా, అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. సాయి పర్యవేక్షించారు.